శ్రీకాళహస్తీశ్వర శతకము
రూ॥40/-
పేజీలు:48
నవచేతన పబ్లిషింగ్ హౌస్
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

ఒట్ల కోసం తమిళులను అపఖ్యాతిపాలు చేయడం ఆపండి
కన్హయ్యకుమార్‌పై దాడిచేసిన వ్యక్తి అరెస్ట్
కవితను ప్రాసిక్యూట్ చేసేందుకు మావద్ద సరిపడ సాక్ష్యాలు ఉన్నాయి
మేము మైనారిటీలకు వ్యతిరేకం కాదు
లోపలి పేజీల్లో...

బుధవారం | 22-05-2024 | కరీంనగర్ | సంపుటి 07, సంచిక: 171 | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 8+8 | వెల రూ. 5.00

## మూడు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో నగదు



ధాన్యం కొనుగోలుపై బిఆర్‌ఎస్ నేతలవి గాలి మాటలు

గత ప్రభుత్వంతో పోలిస్తే అన్ని విషయాల్లోనూ ముందంజలో ఉన్నాం

మొలకెత్తిన ధాన్యం సైతం కొనుగోలు చేస్తాం

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

ప్రజాపక్షం / హైదరాబాద్

వరి ధాన్యం కొనుగోలు చేసిన మూడు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని, ఈ అంశం ప్రతిపక్షాలకు రుచించకనే రైతులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. గత ప్రభుత్వంతో పోలిస్తే యాసంగిలో కొనుగోలు కేంద్రాల ప్రారంభం, కొనుగోలు కేంద్రాల సంఖ్య, ధాన్యం సేకరణ, నగదు జమ చేసే అన్ని విషయాల్లోనూ కాంగ్రెస్ ప్రభుత్వం ముందంజలో ఉందని ఆయన వివరించారు. రైతులను ఇబ్బంది పెట్టేందుకు రాజకీయాలను వాడొద్దని ప్రతిపక్షాలకు డిప్యూటీ సిఎం హితవు పలికారు. హైదరాబాద్ గాంధీభవన్‌లో మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మాట్లాడారు. రాష్ట్రంలో అసలు ధాన్యమే కొనుగోలు చేయడంలేదని, కళ్ళాల్లో తరువాయి 2లో

## సన్నవడ్లకే ఇస్తామంటే రైతులను మోసం చేయడమే :హరీశ్ రావు

ప్రజాపక్షం/హైదరాబాద్



శాసనసభ ఎన్నికల సమయంలో అన్ని రకాల వడ్లకు రూ.500ల బోనస్ ఇస్తామని కాంగ్రెస్ తన ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపర్చి, అధికారంలోనికి రాగానే సన్నవడ్లకు మాత్రమే ఇస్తామనడం రైతులను మోసం చేయడమేనని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు విమర్శించారు. వానా కాలం నుంచి పంటలకు మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో తరువాయి 2లో

## ఓటమి భయంతోనే బిజెపి దాడులు

● ఎపి అల్లర్లపై 'సిట్' ఒక బోగస్.. జ్యుడీషియల్ విచారణ జరిపించండి ● జగన్, చంద్రబాబుది బాధ్యతారాహిత్యం ● బిఆర్‌ఎస్ పాపాలతోనే బిజెపి పెరిగింది...ఆ తప్పులు కాంగ్రెస్ చేయొద్దు ● మీడియా సమావేశంలో సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె. నారాయణ ● అన్ని రకాల వడ్లకు బోనస్ ఇవ్వండి..: పశ్య పద్మ



ప్రజాపక్షం / హైదరాబాద్

లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోతామనే భయం, నిరాశ, నిస్పృహలతోనే బిజెపి నాయకులు ప్రతిపక్షాల నాయకులపై దాడులకు తెగబడుతున్నారని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపి ప్రభుత్వం ప్రశ్నించే ప్రతి పక్ష నాయకులపై కేసులు పెడుతూ అరెస్టులు చేస్తున్నదని, చివరకు ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)లోని మహిళలను బెదిరించి వారి నాయకులపైనే కేసులు పెట్టించే నీచమైన స్థాయికి దిగజారిందన్నారు. మరోవైపు కేజ్రివాల్‌ను చంపేస్తామని, కోసేస్తామని నీచమైన భాషలో రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, మెట్రోరైల్‌లో ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధులు రాతలు రాయిస్తూ మానసికంగా బెదిరింపులకు గురిచేస్తున్నారన్నారు. తాజాగా తెలంగాణ సిఎంను కూడా అరెస్ట్ చేసేందుకు ప్రయత్నించారని, అయితే అది సాధ్యం కాలేదన్నారు. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ చేస్తున్న ఇలాంటి చర్యలను కమ్యూనిస్టు పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నదన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పశ్య పద్మ, ఎన్.బాలమల్లేష్, ఇ.టి.నరసింహాలతో కలిసి డాక్టర్ నారాయణ మంగళవారం హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్ధూంభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఢిల్లీలో అన్యాయంగా వ్యవహరిస్తున్నదని నారాయణ అన్నారు. ఢిల్లీలో బిజెపి గెలిచే పరిస్థితి లేదని, ఆప్, కాంగ్రెస్ కలిసిపోవడం, సిఎం కేజ్రీవాల్‌పై కేసు పెట్టి, జైలుకు పంపడంతో ప్రజలు సామూహికంగా బిజెపిని ఓడించేందుకు సిద్ధపడ్డారన్నారు. ఢిల్లీలో పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి కన్హయ్య కుమార్ ఎన్నికల ప్రచారంలో ఆయనపై ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధులు సీరా పోయడం, రాళ్లు రువ్వడంతో పాటు చుట్టుపక్కల వారిని బెదిరించారని మండిపడ్డారు. తెలంగాణలో ధరణి కెసిఆర్‌ను అధికారం నుంచి దూరం చేయగా, ఎపిలో భూమాతతో జగన్ కూడా అధికారాన్ని కోల్పోబోతున్నారని నారాయణ అన్నారు.

**ఎపి అల్లర్లపైన 'సిట్' బోగస్.. జ్యుడిషియల్ విచారణ జరిపించాలి**

లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఆంధ్రపదేశ్‌లో జరిగిన అల్లర్లు, అరాచకాలపై వేసిన 'సిట్' ఒక బోగస్ అని, వాస్తవాలు బయటకు రావాలంటే జ్యూడిషియల్ విచారణ జరపించాలని నారాయణ డిమాండ్ చేశారు. సిట్‌ను ఏర్పాటుతో ఎటువంటి ఉపయోగం లేదని తాము ముందే చెప్పామన్నారు. సిట్ విచారణలో తరువాయి 2లో



## ఆలయాల భూములకు జియో ట్యాగింగ్..

మంత్రి కొండాసురేఖ

ప్రజాపక్షం/హైదరాబాద్

ఆలయాల భూములను రక్షించేందుకు జియో ట్యాగింగ్ చేపడతామని దేవాదయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. మంగళవారం నగరంలోని బొగ్గుల కుంటలోని దేవాదాయ శాఖ కార్యాలయంలో మంత్రి కొండా సురేఖ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం జరిగింది. రాష్ట్రంలోని అలయాల భూములు గత బిఆర్‌ఎస్ ప్రభుత్వ హాయంలో కబ్జాకు గురయ్యాయని, అలాటి భూములను రక్షించాలనే ఉద్దేశ్యంలో జియో ట్యాగింగ్ విధానం తీసుకువస్తున్నామన్నారు. ఆలయాల భూములు కాపాడడమే లక్ష్యంగా అధికారులు దృష్టి సారించాలన్నారు. అలాగే కబ్జాకు గురైన కోర్టులలో ఉన్న పెండింగ్ కేసులపై దృష్టి సారించాలని సూచించారు. ఆలయాల భూముల వివరాలను ధరణిలో నమోదు చేయాలని ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఆక్రమణకు గురైన భూములను స్వాధీనం చేసుకుంటామన్న కొండా సురేఖ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. భూముల వివరాలను ధరణి పోర్టల్లో నమోదు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఆక్రమణకు గురైన భూముల లెక్కలు తీసి, తిరిగి వాటిని స్వాధీనం చేసుకుంటామన్నారు. ఆధునిక పద్ధతుల్లో భూరికార్డులు నమోదు చేస్తామన్నారు. ఈ సమావేశానికి దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, కమిషనర్ హన్మంతరావు, ఈఓలు, ఇతర కమిషనర్లు హాజరయ్యారు.



## తీన్మార్ మల్లన్నను చట్ట సభకు పంపుదాం

ఓటు అడిగే హక్కు బిజెపి, బిఆర్‌ఎస్‌కు లేదు

పట్టభద్రులు విజ్ఞతతో ఆలోచించాలి : ఎమ్మెల్యే కూనంనేని

సిపిఐ సంపూర్ణ మద్దతు : బాగం హేమంతరావు

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం/ఖమ్మం అర్బన్

ప్రజా గొంతుకు తీన్మార్ మల్లన్నను చట్ట సభకు పంపుతామని, నిరుద్యోగులను నిలువునా ముంచిన బిజెపి, బిఆర్‌ఎస్ లకు పట్టభద్రుల ఓటు అడిగే నైతిక హక్కులేదని ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు అన్నారు. పట్టభద్రుల ఎన్నికల ప్రచారంలో భాగంగా కొత్తగూడెం క్లబ్‌లో ఏర్పాటు చేసిన మిత్రపక్షాలు, పట్టభద్రుల సమావేశానికి ఆయన ముఖ్యాతిధిగా హాజరై మాట్లాడారు. జర్నలిస్టు వృత్తిని ఆయుధంగా చేసుకుని ప్రజా వ్యతిరేక పాలనను నిలదీస్తున్న తీన్మార్ మల్లన్న ప్రజా గొంతుక అని, ఆ గొంతును చట్టసభకు పంపితే ప్రజలకు మరింత మేలు జరుగుతుందని అన్నారు. రెండు కోట్ల ఉద్యోగాల హామీతో బిజెపి, రెండు లక్షల ఉద్యోగాల హామీతో బిఆర్‌ఎస్ నిరుద్యోగులను మోసం చేశాయని అన్నారు. మధ్యలో కాడి వదిలేసిన బిఆర్‌ఎస్ పార్టీకి, ఆ పార్టీ అభ్యర్థికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. బిజెపి ప్రభుత్వం రెండు కోట్ల ఉద్యోగాలు కల్పించకపోగా కోటి మందిని ఉద్యోగాల నుండి తప్పించిందని విమర్శించారు. మల్లను గెలిపించుకునేందుకు అంతా కలసికట్టుగా పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో సిపిఐ, సిపిఎం జిల్లా కార్యదర్శులు ఎస్‌కె సాబీర్ పాషా, కనకయ్య, కాంగ్రెస్ నాయకులు తుళ్లూరి బ్రహ్మయ్య, తరువాయి 2లో

## భారీగా పేరుకుపోతున్న దొడ్డు బియ్యం నిల్వలు

సన్న రకాల వరి సాగును పెంచేందుకే బోనస్

మార్కెట్ డిమాండ్, అవసరాలకు అనుగుణంగా వరి సాగుపై ప్రభుత్వం దృష్టి

రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం పంపిణీకి యోచన

ప్రజాపక్షం / హైదరాబాద్



దేశంతో పాటు రాష్ట్రంలోనూ భారీ మొత్తంలో దొడ్డు బియ్యం నిల్వలు పేరుకుపోతున్నాయి. ప్రతి సీజన్‌లోనూ రాష్ట్రంలోని రైతులు పెద్ద మొత్తంలో దొడ్డు రకం వడ్లను సాగు చేస్తున్నారు. దీంతో వాటి నిల్వలు పెరిగిపోతుండగా, మరో వైపు సన్న రకాలకు కొరత ఏర్పడుతోంది. మార్కెట్లో సన్న బియ్యం రేట్లు వినియోగదారులకు అందనంతగా పెరిగిపోతున్నాయి. గడిచిన రెండేళ్లలో దొడ్డు బియ్యం సాగు భారీగా పెరిగిపోయి సన్న ధాన్యాల సాగు గణనీయంగా తగ్గిపోయింది. అయితే మార్కెట్లో మాత్రం సన్న రకాల డిమాండ్, వినియోగం ఎక్కువగా ఉంది. ఈ కారణంగానే సన్న బియ్యం ధర కూడా ఎక్కువగానే ఉంది. ఈ నేపథ్యంలోనే సన్న రకాల వరి సాగు పెరిగేలా రైతులను ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు అధికార వర్గాల సమాచారం. అధికారవర్గాల సమాచారం ప్రకారం మధ్యాహ్న భోజన పథకం, సంక్షేమ వసతి గృహాలు, అంగన్వాడీ కేంద్రాలకు రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం సరఫరా చేస్తోంది. రేషన్ కార్డుదారులకు దొడ్డు బియ్యం పంపిణీ చేస్తోంది. ఏటా ఖరీఫ్, రబీ రెండు పంట సీజన్లలోనూ కస్టమ్ మిల్లింగ్ (సిఎంఆర్) చేయించిన బియ్యాన్ని రాష్ట్రంలో ప్రజాపంపిణీ అవసరాలకు ప్రభుత్వం వినియోగిస్తోంది. ఒకవైపు రైతుల నుంచి సేకరించిన దొడ్డు బియ్యం నిల్వలు పేరుకుపోతుంటే సన్న బియ్యం కోటా మన రాష్ట్ర పంపిణీ అవసరాలకు కూడా సరిపోవడంలేదు. రేషన్ షాపుల ద్వారా (రాష్ట్ర ప్రభుత్వ కార్డులు, జాతీయ ఆహార భద్రత కార్డుల కింద) ఏడాదికి 24 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం ప్రజా పంపిణీ వ్యవస్థకు అవసరం కాగా అది 36 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యానికి సమానంగా తరువాయి 2లో

ధాన్యం తేమ పేరుతో భారీ కుంభకోణం
మహేశ్వర్‌రెడ్డి సంచలన ఆరోపణ
03
నిత్యం వార్తల్లో ఉండాలనే అసత్య ఆరోపణలు
మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



## పారిశ్రామిక అభివృద్ధిలో ప్రపంచంతో పోటీ పడాలి

● 'ది బెస్ట్ పాలసీ'లను అధ్యయనం చేయాలి ● పవర్ లూమ్, హ్యాండ్ లూమ్ కార్మికులకు ఉపయోగపడే విధానం రూపొందించాలి ● అధికారులతో సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

పారిశ్రామిక అభివృద్ధిలో తెలంగాణ రాష్ట్రం ప్రపంచ దేశాలతో పోటీపడే విధంగా విధానాలు ఉండాలని అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ కార్యకలాపాలపై మంగళవారం అధికారులతో సిఎం సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధికి తీసుకోవాల్సిన నూతన విధానాలపై పలు సూచనలు చేశారు. గత సమీక్షా సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలు, పనుల్లో పురోగతికి సంబంధించిన వివరాలను అధికారులు సిఎంకు వివరించారు. టెక్స్‌టైల్స్‌కు సంబంధించి రాష్ట్రంలోని పవర్ లూమ్, హ్యాండ్ లూమ్ కార్మికులకు ఉపయోగపడే విధంగా కొత్త విధానాన్ని రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పారిశ్రామిక అభివృద్ధికి సంబంధించి కొత్తగా ఆరు పాలసీలను రూపొందించనున్నట్లు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. ఎంఎస్‌ఎంఈ పాలసీ, ఎక్స్‌పోర్ట్ పాలసీ, న్యూ లైఫ్ సైన్సెస్ పాలసీ, రివైజ్డ్ ఈవీ పాలసీ, మెడికల్ టూరిజం పాలసీ, గ్రీన్ ఎనర్జీ పాలసీలను రూపొందిస్తున్నామని సిఎంకు వివరించారు. ఎన్నికల కోడ్ ముగిసేలోగా పారిశ్రామిక పాలసీలను పూర్తిస్థాయిలో రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించి ప్రపంచ దేశాల్లో 'ది బెస్ట్ పాలసీ'లను అధ్యయనం చేయాలని సూచించారు.

## పంచాయతీ ఎన్నికలకు కసరత్తు

పదవీ కాలం పూర్తి కానున్న జెడ్‌పి, మండల పరిషత్‌పైన దృష్టి

ప్రభుత్వ నిర్ణయమే తరువాయి

పార్టీల ఎదురు చూపు

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం



గ్రామపంచాయితీ ఎన్నికల కసరత్తు మొదలైంది. రాష్ట్ర ప్రభుత్వానికి ఇప్పటికే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని గ్రామ పంచాయతీల వివరాలను కలెక్టర్ల ద్వారా సమర్పించారు. ఏఏ గ్రామపంచాయితీల్లో ఎవరెవరు పనిచేశారు. ఏఏ రిజర్వేషన్లకు అనుగుణంగా పదవులు అనుభవించారు వంటి పలు అంశాలతో కూడిన వివరాలను రిజర్వేషన్ల ఆధారంగా పంపించారు. జిల్లాలో ఈ పంచాయతీలతో పాటు మండల పరిషత్, జిల్లా పరిషత్‌ల పదవికాలం కూడా జూలైలో పూర్తి కానుండటంతో ఆ వివరాలు సైతం ప్రభుత్వానికి చేరాయి. ఎన్నికలు జరిపేందుకు ప్రభుత్వం సైతం సిద్ధంగా ఉండటంతో ఎప్పుడు నిర్వహిస్తారో అని అంతా ఎదురు చూస్తున్నారు. ఇందుకు సంబంధించి అధికారులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. జెడ్పి, మండల పరిషత్ పదవీ కాలం జూలై వరకు ఉండటంతో వాటిపై సైతం అధికారులు దృష్టి సారించారు.

**పంచాయతీల్లో ప్రత్యేకాధికారులు**

జిల్లాలో (భద్రాచలం, సారపాక తాళ్లగొమ్మూరూ మినహా) మొత్తం 479 గ్రామపంచాయతీలు ఉన్నాయి. వీటిలో కొన్ని మేజర్ గ్రామపంచాయతీలు ఉండగా, మరికొన్ని తండా పంచాయతీలున్నాయి. వీటిలో సర్పంచుల పదవీకాలం ఈ ఏడాది ఫిబ్రవరి 2వ తేదితో ముగియడంతో 3వ తేది నుండి గ్రామపంచాయతీలు ప్రత్యేకాధికారుల పాలనలో సాగుతున్నాయి. జిల్లాలో 479 గ్రామ పంచాయతీలు ఉండగా వీటి పరిధిలో 4232 వార్డులున్నాయి. సర్పంచుల పదవీ కాలం పూర్తయి నాలుగు నెలలు అవుతున్నందున నూతనంగా కొలువు దీరిన రాష్ట్ర ప్రభుత్వం సైతం ఈ ఎన్నికలపై దృష్టి పెట్టింది. పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు ప్రకటించి, ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే మొదటి నిర్ణయం గ్రామపంచాయతీ ఎన్నికలపైనే ఉండే అవకాశం ఉంది. మరో ప్రక్క మండల పరిషత్, జిల్లా పరిషత్ సభ్యుల పదవీ కాలం జూలై లో ముగియనుండటంతో వారికి కూడా పంచాయతీలతో కలిపి ఎన్నికలు నిర్వహిస్తారా, లేక వేర్వేరుగా జరుపుతారా అనే చర్చ సాగుతోంది. గ్రామాల్లో సర్పంచ్‌లతో పాటు వార్డు సభ్యులుంటేనే పనులు సజావుగా సాగే అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వం తరువాయి 8లో

## రాజీవ్‌గాంధీకి సిఎం ప్రభృతుల నివాళి

ప్రజాపక్షం / హైదరాబాద్



భారతరత్న , దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క సహా పలువురు మంత్రులు మంగళవారం సోమాజిగూడలోని రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. రాజీవ్‌గాంధీ 33వ వర్ధంతి సందర్భంగా గాంధీ భవన్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఎఐసిసి ఇంచార్జ్ దీపాదాస్ మున్షి, రాష్ట్ర ప్లానింగ్ కమిషన్ ఉపాధ్యక్షులు డాక్టర్ జి.చిన్నారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నేతలు వి.హనుమంతరావు, మహ్మద్ షబ్బీర్‌అలీ, ఎం.కోదండరెడ్డి, టి.కుమార్‌రావ్, జి.నిరంజన్, కొత్వాల్ తదితరులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా భట్టివిక్రమార్క మాట్లాడుతూ భారతదేశాన్ని ప్రపంచ దేశాలతో పోటీపడేలా ప్రయత్నం చేసిన మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ దుష్టశక్తుల చేతిలో బలైపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దేశంలో టెక్నాలజీ కమ్యూనికేషన్ రంగాన్ని ముందు చూపుతో ప్రధానిగా రాజీవ్ గాంధీ ఆచరణలో పెట్టారని, యువతను రాజకీయాల్లో పెద్ద ఎత్తున ప్రోత్సహించారని గుర్తు చేశారు. ప్రస్తుతం ఏ ప్రాంతంలో ఏ పంటలు పండుతున్నాయి ఎంత ధాన్యం కొనుగోలు చేశాం ఇలాంటి సమాచారం క్షణాల్లో తెలుసుకుంటున్నామని, దీనికి కారణం రాజీవ్ గాంధీ చూపిన మార్గమేనని, ప్రజా అవసరాలను తరువాయి 8లో

## తాత్కాలిక విసిల నియామకం

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలోని పది విశ్వవిద్యాలయాల వైస్‌ఛాన్స్‌లర్ల (విసి) పదవీకాలం ముగియడంతో ఐఎఎస్ అధికారులను ఇన్‌చార్జ్ వైస్ చాన్స్‌లర్‌గా ప్రభుత్వం నియమించింది. కొత్తగా విసిలను నియమించే వరకు, లేదా జూన్ 15 వరకు ఐఎఎస్ అధికారులు వైస్‌ఛాన్స్‌లర్లుగా కొనసాగనున్నారు. ఈ మేరకు ఉన్నత విద్యశాఖ కార్యదర్శి బి.వెంకటేశం పది విశ్వవిద్యాలయాలకు ఐఎఎస్‌లను ఇన్‌చార్జ్ విసిలుగా నియమిస్తూ మంగళవారం వేర్వేరుగా ఉత్తర్వులను జారీ చేశారు. వైస్ ఛాన్స్‌లర్ల నియామకానికి రాష్ట్ర ప్రభుత్వం తరువాయి 2లో

పూర్తిస్థాయి విసిలను నియమించాలి
ఎఐఎస్‌ఎఫ్ డిమాండ్
02

## రేపు ఇరాన్ అధ్యక్షుడు రైసీ అంత్యక్రియలు

### వచ్చేనెల 28న కొత్త అధ్యక్షుడి ఎన్నిక





**టెహ్రాన్ :** ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ అంత్యక్రియల ప్రక్రియ ప్రారంభమైంది. తూర్పు అజర్‌బైజాన్ రాష్ట్ర రాజధాని తబ్రిజ్‌లో వేలాదిమంది రైసీ భౌతిక కాయానికి నివాళులు అర్పించారు. 19వ తేదీ ఆదివారం నాడుజరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో రైసీ (63)తోపాటు ఇరాన్ విదేశాంగమంత్రి హొస్సేన్ అమిరబ్దుల్లాహ్యాన్ (60) సహా మొత్తం పదిమంది మరణించారు. తబ్రిజ్‌లో ఊరేగింపు అనంతరం వారి భౌతికదేహాలను టెహ్రాన్‌కు తరలిస్తారు. బుధవారంనాడు దేశరాజధానిలో వారికి నివాళులు అర్పించే కార్యక్రమంలో ఇరాన్ సర్వాధినేత ఆయొతుల్లా ఖొమైనీ సహా అనేకమంది ప్రముఖులు పాల్గొంటారు. ఆ మరుసనాడు గురువారంనాడు ఈశాన్య ఇరాన్‌లోని దేశ అతిపెద్ద రెడవ నగం రైసీ పుట్టి పెరిగిన ఊరు మష్హద్‌లో అంత్యక్రియలు జరుగుతాయి. పలు నగరాల్లో ఆయన భౌతిక కాయాన్ని ఊరేగిస్తున్నారు. లక్షలాదిమంది ప్రజలు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పిస్తున్నారు. దేశంలో ఐదు రోజులపాటు సంతాప దినాలు ప్రకటించారు. ఇదిలా ఉండగా ఇరాన్ రాజ్యాంగానికి అనుగుణంగా కొత్త అధ్యక్షుడి ఎన్నికలు జూన్ 28వ జరుగుతాయి. ఈలోపు తాత్కాలికంగా మొదటి ఉపాధ్యక్షుడు మమ్మద్ మొఖబర్‌ను దేశాధ్యక్షుడుగా, అలీ బఘేరి కని ను విదేశాంగ మంత్రిగా నియమిస్తూ ఇరాన్ సర్వాధినేత ఆయొతుల్లా ఖొమైనీ ఉత్తర్వులు జారీ చేశారు. అధ్యక్ష పదవికి 50 రోజుల్లో ఎన్నికలు జరుగుతాయి.

**ఘటనపై దర్యాప్తు ప్రారంభం**

ఇదిలా ఉండగా, రైసీ హెలికాప్టర్ కూలిపోయిన ఘటనపై ఉన్నతస్థాయి విచారణ ప్రారంభమైంది. ఈ కమిటీ ఘటనాస్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించింది. కాగా ఇరాన్ అధ్యక్షుడు రైసీ ప్రయాణిస్తున్న హెలికాప్టర్ కూలిపోవడం ఘటనకు అమెరికా పరోక్షంగా కారణమని ఇరాన్ మాజీ విదేశాంగ మంత్రి మహ్మద్ జావద్ జరఫ్ విమర్శించారు. ఇరాన్‌పై ఆంక్షలు విధించిన కారణంగా తమ దేశానికి నాణ్యతతో కూడిన ఆధునిక గగనతల ప్రయాణ సదపాయాలు, విడిభాగాలు సమకూరడంలేదని, రైసీ ప్రయాణిస్తున్న హెలికాప్టర్ 45 సంవత్సరాల క్రితంనాటిదనీ, దానితోపాటు వాతావరణం కూడా సహకరించలేదని విమర్శించారు. ఐతే ఈ విమర్శలను అమెరికా తోసిపుచ్చింది.

## చైనా స్కూల్లో కత్తితో దాడి : ఇద్దరు మృతి

**బీజింగ్ :** దక్షిణ చైనా జియాంగ్జీ రాష్ట్రం గుయిగ్జి నగరంలోని ఒక ప్రాథమిక పాఠశాలలో కత్తితో జరిగిన దాడిలో ఇద్దరు మరణించారు. మరో పదిమంది గాయపడ్డారు. ఐతే మృతుల్లో పిల్లలు ఉన్నారా? లేదా? అనే విషయం వెంటనే తెలియరాలేదు. స్కూల్లో పనిచేసే 45 ఏళ్ళ వయసుగల ఉపాధ్యాయురాలే ఫ్రూట్స్ కోసుకునే కత్తితో ఈ దాడి చేసినట్లు సోషల్ మీడియా ద్వారా పోలీసులు తెలియజేశారు. ఈ ఘటనతో తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. తక్షణం స్కూలు వద్దకు తల్లిదండ్రులు పరుగులు తీశారు. ఇటీవల చైనాలోని స్కూళ్ళల్లో ఈ విధమైన దాడులు పెరిగాయిని బిబిసి తన నివేదికలో పేర్కొంది. యునన్‌రాష్ట్రంలోని ఒక ఆసుపత్రిలో ఒక వ్యక్తి కత్తితో దాడిచేసిన ఘటనల్లో ఇద్దరు మరణించగా 21 మంది గాయపడ్డారు. గత ఏడాది ఆగస్టులో కూడా ఇదే రాష్ట్రంలో మానసిక సమస్యతో బాధపడుతున్న ఒక వ్యక్తి చేసిన దాడిలో ఇద్దరు మరణించగా ఏడుగురు గాయపడ్డారు.

# ఉక్రేన్‌లో యూరప్, అమెరికా వ్యూహం పూర్తి విఫలం

### హంగేరీ విదేశాంగమంత్రి జిజార్టో



**బుడాపెస్ట్ :** ఉక్రేన్‌లో యుద్ధం ద్వారా స్వప్రయోజనాలు సాధించాలని యూరప్, అమెరికా చేసిన వ్యూహం విఫలమైందని హంగేరీ విదేశాంగ మంత్రి పీటర్ జిజార్టో విమర్శించారు రష్యాపై పైచేయి సాధించేందుకు చేసిన వ్యూహం పూర్తిగా విఫలమైందన్నారు. "ఇది నేను చెబుతున్న వ్యక్తిగత అభిప్రాయం కాదు, ప్రపంచదేశాలు చాలా వరకూ అనుకుంటున్న వాస్తవం'' అని ఆయన ఉద్ఘాటించారు. జపాన్‌కు చెందిన అగ్రశ్రేణి చింతనాపరుల వేదిక ససకావా పీస్ ఫౌండేషన్ ఏర్పాటు చేసిన సెమినార్‌లో మంగళవారం ఆయన ప్రసంగించారు. ఆర్థికంగా రష్యాను మోకాళ్ళపై నిలబెట్టేందుకు మొదటగా ఆంక్షలు విధించామనీ, ఆ వ్యూహం నెరవేరలేదనీ, ఈ విధంగా ఇప్పటికే 13 సార్లు వ్యూహాలు చేశారనీ, ఇప్పుడు తాజాగా 14వ ప్యాకేజీ గురించి చర్చిస్తున్నామనీ, మరో ప్రయత్నం చేస్తున్నామనీ, ఈ ప్రయత్నం కూడా ఆదే దారిలో వెళుతుందనీ ఆయన హెచ్చరించారు. పోనీ ఇప్పటికైనా యుద్ధం చివరి దశకు వచ్చిందా అంటే అదీ లేదు, యుద్ధం ముగిసే అవకాశాలు, ఆ వాతావరణం కనిపిస్తోందా? అంటే ఆ జాడా ఎక్కడా లేదు అని ఆయన విమర్శించారు. దీని అంతటికీ కారణం అమెరికా, యూరప్ దేశాల తప్పుడు పద్ధతులేనన్నారు. వాస్తవం చెప్పాలంటే రష్యాపై విధించిన ఆంక్షలు యూరప్ ఆర్థిక వ్యవస్థమీదే ఎక్కువ ప్రభావం చూపించాయనీ, ఈ కారణంగా యూరప్ దేశాలు పరోక్షంగా రష్యా నుండి ఇతర మార్గాలలో చమురు కొనుగోలు చేయవలసి వస్తోందని విమర్శించారు. ఈ సందర్భంగా రష్యా చమురు మళ్ళీ శుద్ధిచేసి భారత్ నుండి సరఫరా జరుగుతున్న విషయాన్ని ఆయన ప్రముఖంగా తన ప్రసంగంలో ప్రస్తావించారు.

**పశ్చిమ దేశాలు**

**నేరుగా యుద్ధంలోకి రావాలి : జెలెన్స్కీ**

పశ్చిమ దేశాలు నేరుగా రష్యాతో ఉక్రేన్ చేస్తున్న యుద్ధంలోకి దిగాలని ఆ దేశ అధ్యక్షుడు జెలెన్స్కీ ఒత్తిడి చేస్తున్నారు. అలా నేరుగా యుద్ధంలోకి దిగినప్పుడే పాశ్చాత్యదేశాల ఆయుధాలను తాము ఉపయోగించగలుగుతామని ఆయన అన్నారు. ఉక్రేన్‌కు తీవ్ర నష్టం జరుగుతోందనీ, పాశ్చాత్యదేవాలు రంగ ప్రవేశం చేస్తే రష్యా ప్రయోగిస్తున్న క్షిపణులను, ఆయుధాలను, వారు తమ గ్రామాలలోకి చొచ్చుకురావడాన్ని అడ్డుకోగలుగుతామని అన్నారు. తమ సరిహద్దుల్లో రష్యా 300 యుద్ధ విమానాలను ఉపయోగిస్తోందనీ, తాము ఈ దాడులను ఎదుర్కోవాలంటే కనీసం 130 విమానాలన్నా కావాలనీ ఆయన అన్నారు. అమెరికా చేసే సాయం కోసం తమ దేశం ఎదురుచూస్తోందని ఆయన అన్నారు. ఒకవేళ ఎఫ్–16 విమానాలను నేరుగా తమకు సరఫరా చేయలేకపోతే పొరుగున ఉన్న నాటో దేశాల భూభాగాల నుండి యుద్ధ విమానాలను ప్రయోగించి రష్యా యంత్రాంగాన్ని దెబ్బతీసే వ్యూహమైనా అమలు చేయాలని జెలెన్స్కీ ప్రతిపాదించారు.

**ముగిసిన జెలెన్స్కీ పదవీకాలం**



ఉక్రేన్ దేశాధ్యక్షుడు జెలెన్స్కీ పదవీకాలం మే 21వ తేదీతో ముగిసింది. ఐతే దేశంలో యుద్ధం పరాకాష్టకు చేరడం, పరిస్థితులు విషమించిన కారణంగా ఇప్పట్లో ఎన్నికలు ఉక్రేన్‌లో జరిగే అవకాశం లేదు. ఐతే ఆయన పదవీకాలం పొడిగించేందుకు చట్టబద్ధమైన మార్గాలు కూడా ఉన్నాయని ఉక్రేన్ పార్లమెంటు ''వెర్ఖోవనా రాడా'' సభ్యుడు అలెగ్జాండర్ దుబిన్స్కీ చెప్పారు. 21వ తేదీ అర్ధరాత్రితో జెలెన్స్కీ పదవీకాలం ముగిసిపోతుంది, ఆ పదవీకాలాన్ని ఎవరూ పొడిగించలేరు, కానీ పార్లమెంటు ద్వారా తీర్మానం చేసి ఆయన పదవీకాలం పొడిగించవచ్చు అని దుబిన్స్కీ టెలిగ్రామ్‌లో రాశారు. 2022 ఫిబ్రవరిలో రష్యాతో ఉక్రేన్ యుద్ధం ప్రారంభమైనప్పటి నుండీ ఉక్రేన్‌లో మార్షల్ లా ను పదే పదే పొడిగిస్తూ వస్తున్నారు. ఇప్పుడు అక్టోబరులో ఎన్నికలు జరిపినాగానీ అది సాధ్యం కాదు, నిర్ణీత ప్రకారం ఉక్రేన్‌లో ఎన్నికలు మార్చి నెలలో జరగాల్సి ఉంది.

## గాజాలో చేస్తున్నది సామూహిక హత్యాకాండ కాదు : బైడెన్

### అరెస్ట్ వారెంట్ హాస్యాస్పదం : నేతన్యాహు

**టెల్‌అవీవ్ :** అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు (ఐసిసి) సోమవారం ప్రకటించిన అరెస్ట్ వారెంట్లను ఇజ్రాయిల్ ప్రధానమంత్రి బెంజిమన్ నేతన్యాహుతో పాటు హమాస్ నాయకులు కూడా తిరస్కరించారు. మరోవైపు అమెరికా కూడా ఇజ్రాయిల్‌ను వెనకేసుకొచ్చింది. ఒకవేళ అరెస్టు వారెంటు గనుక నేతన్యాహూకు జారీ చేస్తే అంతర్జాతీయ క్రిమినల్ కోర్టుపై ఆంక్షలు విధించే విషయాన్ని పరిశీలిస్తామని అమెరికా హౌస్ స్పీకర్ మైక్ జాన్సన్ చెప్పారు. హమాస్‌ను, ఇజ్రాయిల్‌ను ఒకే గాటన కట్టటం సరైన పద్ధతి కాదని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ విమర్శించారు. ఇజ్రాయిల్ సైన్యం గాజాలో చేస్తున్నది సామూహిక హత్యాకాండ కాదని బైడెన్ సమర్థించారు. ఐసిసి ఉత్తర్వును తాము తిరస్కరిస్తున్నామన్నారు. గాజాలో పాలస్తీనియన్లపై ఏడునెలలుగా ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధాన్ని సామూహిక హత్యాకాండగా అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు ప్రకటించింది. నేతన్యాహు సహా ముగ్గురు హమాస్ నాయకులు ఈ మారణకాండకు కారకులుగా గుర్తించి వారికి అరెస్ట్ వారెంట్లు ఇవ్వాలని ఐసిజె చీఫ్ ప్రాసిక్యూటర్ కరీంఖాన్ ప్రకటించారు. ఐసిసిలో వాదనల సందర్భంగా ఇజ్రాయిల్ కూడా తాము సామూహిక హత్యాకాండ చేయడంలేదని వాదించింది. ఇది పూర్తిగా హాస్యాస్పదమని నేతన్యాహు కొట్టిపారేశారు. ఇది సరికొత్త యాంటీ సెమిటిజమ్ (యూదు మత వ్యతిరేకత)లా కనపడుతోందని విమర్శించారు. హమాస్‌ను సమూలంగా నిర్మూలించడమే తమ లక్ష్యమని అన్నారు. ఇజ్రాయెల్ రక్షణమంత్రి యోవ్ గాలంట్ ఐసిజె ప్రకటనపై మాట్లాడుతూ ఇజ్రాయిల్‌కున్న ఆత్మరక్షణ హక్కును అంతర్జాతీయ కోర్టు తిరస్కరిస్తోందని తప్పుపట్టారు. తమ దేశంపై దాడిచేసి ఉగ్రవాదులు కల్లోలం సృష్టిస్తే వారిని నిర్మూలించి ఆత్మరక్షణ చేసుకునే హక్కు తమకు ఉందని గాలంట్ అన్నారు. ఉగ్రవాద హమాస్‌కు, మాకు సాపత్యం ఏమిటని ప్రశ్నించారు. బాధితులు ఎవరో అన్యాయం జరుగుతున్నది ఎవరికో అంతర్జాతీయ న్యాయస్థానం గుర్తించాలని హమాస్ పేర్కొంది. మరోవైపు ఐక్యరాజ్యసమితి కూడా గాజాలో యుద్ధం ఈ శతాబ్దంలోనే అత్యంత విషాదకరమైనదిగా పేర్కొంది.



మే 6వ తేదీనుండి ఇప్పటివరకు రఫా నుండి 8 లక్షలమంది పాలస్తీనియన్లు ప్రాణభయంతో పారిపోయారని, ఇది సామూహిక హత్యాకాండ ఫలితమేనని పేర్కొంది. ఇక ఫ్రాన్స్ ప్రభుత్వం ఐసిసి ప్రకటనను సమర్థించింది.

**ఒక్కరోజులో 85 మంది మృతి**

ఉత్తర దక్షిణ గాజా ప్రాంతాలలో ఇజ్రాయిల్ సైన్యాలు మంగళవారంనాడు బీభత్సం సృష్టించాయి. ఒక్కరోజులోనేవివిధ ప్రాంతాలలో 85 మంది పాలస్తీనియన్లు మరణించారు. వీరిలో అనేమంది పిల్లలు ఉన్నారు. రఫాలో ఇజ్రాయిల్ మంగళవారం జెనిన్ శరణార్థ శిబిరంపై జరిపిన దాడులలో 7మంది మరణించారు. ఉత్తర గాజాలో 14మంది మరణించారు. దక్షిణ గాజా ఇబ్నా శరణార్థ శిబిరంపై జరిపిన దాడిలో ముగ్గురు పిల్లలు మరణించారు. 200 మంది గాయపడ్డారు. గత ఏడాది అక్టోబర్ 7వ తేదీన ఇజ్రియల్ నగరంపై హమాస్ ఉగ్రవాదులు సామూహికంగా దాడిచేసి 1300 మందిని హతమార్చారు. మరో 300మందిని బందీలుగా తీసుకుపోయారు. వీరిలో వివిధ దేశాలకు చెందిన పౌరులు ఉన్నారు. ఆ తరువాత అక్టోబరు 31న ఇజ్రాయిల్ గాజాపై యుద్ధం ప్రకటించింది. ఈ యుద్ధంలో 3.80లక్షల సామాన్య పాలస్తీనియన్ల ఇళ్లు ధ్వంసమైనాయి. 20లక్షలమంది ప్రజలు ఇళ్లు వదిలి పారిపోయారు. వీరిలో 15లక్షల మంది రఫాలో తలదాచుకుంటున్నారు. ఇప్పుడు రఫాలోకూడా యుద్ధం జరుగుతోంది.

## కలడోనియాలో ఆగని హింస

**న్యూ కలడోనియా :** ఫ్రెంచి వలస దీవి కలడోనియాలో అల్లర్లు ఆగడంలేదు. కలడోనియాలో పదేళ్లుగా ఉంటున్న ఫ్రాన్సు దేశీయులకు కూడా స్థానిక ఎన్నికల్లో ఓటు హక్కు ఇవ్వాలని ఫ్రెంచ్ పార్లమెంటులో తీర్మానం పెట్టడంతో కలడోనియాలో స్థానిక జాతీయులు ఆగ్రహంతో ఉద్యమించారు. అది కాస్తా హింసాకాండగా మారి సామూహిక విధ్వంసం కలడోనియాను అతలాకుతలం చేస్తున్నది. ఈ అల్లర్లలో వారం రోజులుగా ఆరుగురు మరణించగా, వందలమంది గాయపడ్డారు. ఈ అల్లర్లను అణచివేసేందుకు ఫ్రెంచి సైన్యం రంగంలోకి దిగింది. ఈ నగరంలో ఎక్కడపడితే అక్కడ రహదారులను అడ్డుకున్నారు. వాహనాలు దగ్ధమౌతున్నాయి. జనజీవనం స్తంభించింది. దీంతో పలు దేశాలు ఆ ప్రాంతంలోని తమ జాతీయులను సురక్షితంగా తీసుకు వెళ్లేందుకు ప్రత్యేక విమానాలు నడుపుతున్నాయి. ఆస్ట్రేలియా సైనిక రవాణా విమానం కల్లోలిత న్యూ కలడోనియా నుండి 300మందిని తీసుకుని వెళ్లింది. న్యూజిలాండ్ ఎయిర్‌పోర్టు కూడా 50మందిని తమ దేశానికి తరలించింది. సుమారు 290మంది న్యూజిలాండ్ దేశీయులు న్యూ కలడోనియాలో ఉన్నారు. స్థానిక కణత జాతీయుడు ఒకరు మాట్లాడుతూ దేశంలో బయటినుండి వచ్చినవారికి ఓటు హక్కు ఇవ్వటం అంటే కణతవాసీయులను నిర్మూలించటానికి చేసిన ప్రయత్నమేనని మండిపడ్డారు. కాగా దేశం వదిలి పారిపోయేందుకు సుమారు 3,200మంది విమానాశ్రయం వద్ద పడిగాపులు పడుతున్నారు. ఫ్రాన్సు నుంచి1000మందిపైగా సైన్యం కలడోనియాకు వచ్చింది. అయినా హింసాకాండ అదుపులోకి రాలేదు.కాగా ఫ్రాన్స్ దేశాధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ ఈ ప్రాంతంలో పర్యటనకు సిద్ధమయ్యారు. అక్కడి పరిస్థితులు అంచనా వేసి ప్రజలతో మాట్లాడాలని నిర్ణయిచారు.



## చట్ట సభకు పంపుదాం

(మొదటి పేజీ తరువాయి)

నాగ సీతారాములు, రమసహాయం రఘురామిరెడ్డి, కంచర్ల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

**సిపిఐ సంపూర్ణ మద్దతు : బాగం హేమంతరావు**

వరంగల్ ఖమ్మం నల్గొండ పట్టభద్రుల ఎంఎల్‌సి ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) సంపూర్ణ మద్దతునిస్తుందని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ తెలిపారు. పట్టభద్రుల ఎంఎల్‌సి ఉప ఎన్నికల్లో తనకు మద్ధతు ఇవ్వాలని కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న మంగళవారం ఖమ్మం బైపాస్ రోడ్డులోని సిపిఐ కార్యాలయంకు వెళ్లారు. ఈ సందర్బంగా సిపిఐ కార్యాలయంకు వెళ్లిన తీన్మార్ మల్లన్నకు సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ లు పుష్పగుచ్చం అందించి స్వాగతం పలికారు. అనంతరం జరిగిన సమావేశంలో తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ పట్టభద్రులు, ఉద్యోగులు తనను ఆదరించి గెలిపిస్తే మండలిలో ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తానని తెలిపారు. బిజెపి, బిఆర్‌ఎస్ తరుపున పోటీ చేసే అభ్యర్థులకు ఓటు అడిగే హక్కు లేదన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, రాష్ట్రంలో పదేళ్ల పాలించిన బిఆర్‌ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులను మోసగించిందన్నారు. కోట్ల ఉద్యోగాలు అంటూ మభ్యపెట్టిందన్నారు. రాష్ట్రంలో కేసిఆర్ ప్రభుత్వం నోటిఫికేషన్లు ఇచ్చి పరీక్షా పేపర్లను లీకులు చేయించి లక్షాలాది మంది నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడిందన్నారు. పట్టభద్రులు, ఉద్యోగులు ఆలోచించి తనను అత్యధిక మెజార్టీతో మొదటి ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలన్నారు. బాగం హేమంతరావు, పోటు ప్రసాద్ లు మాట్లాడుతూ ప్రశ్నించే గొంతుకైన తీన్మార్ మల్లన్నను శాసన మండలికి పంపిస్తే ప్రజల పక్షాన తన వాణిని వినిపిస్తారన్నారు. ఈనెల 27న జరిగే ఉప ఎన్నికలకు తీన్మార్ మల్లన్నకు సిపిఐ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని తెలిపారు. పట్టభద్రులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీన్మార్ మల్లన్నను ఆదరించి మొదటి ప్రాధాన్యత ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు శింగు నర్సింహారావు, తాటి వెంకటేశ్వరరావు, మేకల శ్రీనివాసరావు, తోట రామాంజనేయులు పాల్గొన్నారు.

## రైతులను మోసం చేయడమే

(మొదటి పేజీ తరువాయి)

మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో యాసంగి సీజన్‌లో పండేదే దొడ్డు వడ్లు అని, పండని సన్నవడ్లకు బోనస్ ఇస్తామనడం రైతుల నోట్లలో మట్టికొట్టడం కాదా అని ప్రశ్నించారు. వానకాలంలో 20 శాతం సన్నాలు, యాసంగిలో 99 శాతం దొడ్డువడ్లు పండుతాయని వివరించారు. కోటి 20 లక్షల వరి ధాన్యానికి రూ.500 ల చొప్పున బోనస్ ఇవ్వాలంటే, రూ ఆరు వేల కోట్ల నిధులు అవసరమని, కేవలం సన్నాలకు మాత్రమే బోనస్ ఇస్తే రూ. 500ల కోట్లు సరిపోతాయని వివరించారు. రైతుభరోసా కింద రూ.15 వేలు ఇస్తామని చెప్పి పాక్షికంగానే ఇస్తున్నారని, గతంలో మాదిరిగా తొలి విడత కింద రూ. 7500 కాకుండా రూ.5 వేలనే ఇస్తున్నారని వివరించారు. రైతుభరోసా కింద రూ. 15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బకాయి పడిన రూ.2500, వానకాలం పంటల విడత కింద రూ 7500 కలిపి జూన్ లోపల మొత్తంగా రూ. 10 వేలను రైతులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జొన్న, మిరప, పసుపు, సోయాబీన్, ఎర్రజొన్న ఇతర పంటలకు కూడా మద్దతు ధర ఇవ్వాలన్నారు. అన్ని రకాల వడ్లకు బోనస్ ఇచ్చేలా రైతాంగాన్నిఏకం చేసి పోరాడతామన్నారు.

భట్టి మాటలు వట్టి మాటలని, సన్నవడ్లకే బోనస్ ఇస్తామని చెప్పిన మాటను ఓట్లు డబ్బాలో పడకముందు ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. అన్ని రకాల వడ్లను చివరి గింజవరకు కొంటామని డైలాగులు చెబుతున్నారని, కానీ క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి లేదని చెప్పారు. వడ్లకు బోనస్ అంశాన్ని పునఃపరిశీలించాలని కోరారు. వడగళ్ల వాన, అకాల వర్షాల్లో నష్టపోయిన పంటలకు ఎకరానికి రూ. 25 వేల పరిహారం ఇవ్వాలని, తడిచిన ధాన్యాన్ని యుద్ధప్రాతిపదికన కొనుగోలు చేయాలని హరీశ్‌రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## పూర్తి స్థాయి విసిలను త్వరగా నియమించాలి

### ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మణికంఠరెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ యూనివర్సిటీలకు త్వరితగతిన పూర్తి స్థాయి విసిలను నియమించాలని ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మణికంఠరెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ యూనివర్సిటీల వైస్ ఛాన్సలర్ల పదవీకాలం మంగళవారంతో పూర్తి కానుండడంతో ప్రభుత్వం సీనియర్ ఐఎఎస్ అధికారులకు రాష్ట్రంలోని యూనివర్సిటీలకు అదనపు బాధ్యతలు ఇస్తూ ఇంచార్జ్ విసిలుగా నియమించిందని వారు ప్రకటనలో తెలిపారు. ఇంచార్జ్ విసిలుగా ఉన్న ఐఎఎస్ అధికారులకు వారి శాఖల పరమైన పూర్తి బాధ్యతలు ఉన్న నేపథ్యంలో వారిని ఎక్కువ కాలం ఇన్చార్జ్ విసిలుగా ఉంచవద్దని వారు కోరారు. ఇంచార్జ్ విసిల వల్ల యూనివర్సిటీలో విద్యా ప్రమాణాలు పెరుగవని, విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో పూర్తిస్థాయి విసిలు ఉండాలన్నారు. ఇప్పటికే అన్ని యూనివర్సిటీలకు విసి పోస్టుల కోసం దరఖాస్తులు స్వీకరించి, అన్ని సెర్చ్ కమిటీలు సమావేశమై వెంటనే యూనివర్సిటీలకు పూర్తి స్థాయి విసిలను నియమించాలని వారు డిమాండ్ చేశారు.

## రైతుల ఖాతాల్లో నగదు

(మొదటి పేజీ తరువాయి)

ధాన్యం తడిసి ముద్దౌతుందని బిఆర్‌ఎస్, బిజెపి నేతలు పచ్చి అబద్దాలు ప్రచారం చేస్తున్నారని డిప్యూటీ సిఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. బిఆర్‌ఎస్ నేతలు గాలి మాటలు మాట్లాడడం సరైనది కాదని, గత ఏడాది ఇదే సమయంలో తాను పాదయాత్ర చేస్తుండగా రోడ్ల వెంట ధాన్యం కుప్పలుగా పోసి రైతులు ఇబ్బంది పడేవారన్నారు. గత ప్రభుత్వం తడిసిన, మొలకెత్తిన ధాన్యం కొనుగోలు చేయలేదని, ఈ విషయాన్ని వేలాది మంది రైతులు తన పాదయాత్ర సమయంలో గోడు వెళ్లబోసుకున్నారని వివరించారు. మొలకెత్తిన ధాన్యం సైతం మద్దతు ధరకే తమ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరంలేదని, ఇది ప్రజల ప్రభుత్వమని, ప్రజలకు ఇబ్బంది రాకుండా చూసుకునే బాధ్యత తమదే అన్నారు. ఇక ధాన్యానికి బోనస్ విషయానికి వస్తే సన్నాలకు రూ.500ల బోనస్‌తో ఈ ప్రక్రియను మొదలు పెట్టామని చెప్పారు. నాటి సిఎం కెసిఆర్ వరి వేస్తే ఉరే అని ప్రకటించిన విషయాన్ని డిప్యూటీ సిఎం గుర్తు చేశారు. ప్రస్తుతం ఏ ప్రాంతంలో ఏ పంటలు పండుతున్నాయి ఎంత ధాన్యం కొనుగోలు చేశాం ఇలాంటి సమాచారం క్షణాల్లో తెలుసుకుంటున్నామని, దీనికి కారణం రాజీవ్ గాంధీ చూపిన మార్గమేనని, ప్రజా అవసరాలను తీర్చడంలో రాజీవ్ గాంధీ మార్గాన్ని రాష్ట్ర ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తుందని తెలిపారు.

## బిజెపి దాడులు

(మొదటి పేజీ తరువాయి)

భాగంగా 124 మందిని అరెస్ట్ చేశారని, అయితే అల్లర్లకు కారణమైన నాయకులు తప్పించుకునేందుకు, వారి పేర్లు బయటకు రాకుండా ఉండేందుకు పోలీసులతో కలిసి అమాయకులను సరెండర్ చేయించారని విమర్శించారు. ఎపిలో వైసిపికి, జగన్‌కు వ్యతిరేక పవనాలు వీస్తున్నాయని, వారికి వ్యతిరేకంగా సాధారణ జనం తండోపతండాలుగా బయటకు వస్తున్నారని, ప్రపంచంలో, దేశంలో ఎక్కడ ఉన్నా తరలివచ్చిన ఓటర్లు జగన్‌కు వ్యతిరేకంగా పోలింగ్‌లో పాల్గొన్నారని, దీనిని తట్టుకోలేకనే వైసిపి అరాచకాలను సృష్టించిందని ఆయన విమర్శించారు. ఎన్నికల్లో అల్లర్లు పథకం ప్రకారం జరిగినవేనని, వైసిపి పునాదులు కూడా అవే అయినందున పోలీసులు వారికి సహకరించారని, ఇన్ని అల్లర్లు జరుగుతున్నా పోలీసులు చూసీ చూడనట్లు వ్యవహరించారన్నారు. చివరి నిమిషంలో కేంద్ర ఎన్నికల కమిషన్ పట్టించుకుని పలువురు అధికారులను మార్చనట్లయితే ఎపిలో 50 శాతం ధ్వంసమయ్యేదని తెలిపారు.

**జగన్, చంద్రబాబుది బాధ్యతారాహిత్యం**

ఎపిలో ఇంత పెద్ద ఎత్తున అరాచకాలు జరుగుతుంటే వాటిని ఆపాల్సిన బాధ్యత కలిగిన సిఎం జగన్, ప్రతిపక్ష నాయకుడు, కాబోయే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు లేదా అని నారాయణ ప్రశ్నించారు. ఎన్నికల హింసా రణరంగం నుంచి ప్రజలను కాపాడాల్సిన ఇద్దరూ, తమకేమీ పట్టనట్టుగా విదేశాలకు పారిపోవడం పూర్తిగా బాధ్యతరాహిత్యమని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో జరుగుతున్న అల్లర్లకు కారణమవుతున్న వైసిపి కార్యకర్తలను నిలువరించాల్సిన బాధ్యత జగన్‌దేనని,కానీ ఆయన ఆ బాధ్యతల నుంచి తప్పుకున్నారని మండిపడ్డారు. అయితే అన్ని రాజకీయ పార్టీలను కలిసి హింసను నివారించి, ప్రజలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యతను ప్రతిపక్ష నేతగా చంద్రబాబు పైన ఉన్నదన్నారు.

**బిఆర్‌ఎస్ చాలా అసహనంగా ఉంది**

తెలంగాణ రాష్ట్రంలో బిఆర్‌ఎస్ నాయకులు అధికారం కోల్పోయిన తరువాత చాలా అసహనంతో వ్యవహరిస్తున్నారని నారాయణ అన్నారు. గతంలో బిఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు సిఎం, డిప్యూటీ సిఎం ఇద్దరే ప్రమాణ స్వీకారం చేసి, ఆరు నెలల వరకు పూర్తి స్థాయి మంత్రివర్గం లేదని, ఇది దేశ చరిత్రలో మంత్రివర్గం లేని ఘోరమైన పరిస్థితిని ఎప్పుడూ చూడలేదని అన్నారు. అప్పుడు ఏమీ మాట్లాడని బిఆర్‌ఎస్ నాయకులు, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మొదటి రోజు నుంచే వారిపై విమర్శలు చేయడం సమంజసం కాదని హితవుపలికారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయడానికి సమయం పడుతుందని, అది బిఆర్‌ఎస్ అర్థం చేసుకోకుండా, అన్నప్రాసన చేసిన రోజునే ఆవకాయ పచ్చడి పెడతామనే విధంగా వ్యవహరించడం సరైంది కాదన్నారు.

**బిఆర్‌ఎస్ పాపాల వల్లనే బిజెపి పెరిగింది**

బిఆర్‌ఎస్ నియంతృత్వ పోకడలు, ఆ పార్టీ చేసిన పాపాల వల్లనే రాష్ట్రంలో బిజెపి పెరిగిందని డాక్టర్ నారాయణ అన్నారు. ఇప్పుడు అవే తప్పులు కాంగ్రెస్ చేయవద్దని, కాంగ్రెస్ వల్ల బిజెపి పెరిగే పరిస్థితి తీసుకురావద్దని సూచించారు. మతోన్మాద బిజెపిని దెబ్బకొట్టడం అంత సులభం కాదని, బిజెపిని టార్గెట్ చేయాలంటే తమిళనాడు సిఎం స్టాలిన్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అక్కడ స్టాలిన్ అన్ని రాజకీయ పార్టీలను కలుపుకుని విశాల ఐక్య వేదికను ఏర్పాటు చేశారని, ఇండియా కూటమిలో భాగస్వాములైన అన్ని పార్టీలను కలుపుకునిపోయారని నారాయణ గుర్తు చేశారు. అలాగే రాష్ట్రంలో బిజెపిని ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ కూడా విశాల ప్రాతిపదికన ఆలోచన చేయాలని, తాము ఏది చెబితే, అది వినాలనే సాంప్రదాయం మంచిది కాదన్నారు. కాంగ్రెస్ ఒంటెత్తు పోకడలకు పోకుండా, అందరినీ కలుపుకుని, ప్రజాస్వామ్యబద్ధంగా ఆలోచించి ముందుకు వెళ్ళాలని చెప్పారు. బెంగుళూరులో రేవ్ పార్టీని ఏర్పాటు చేసిన వారిని, అక్కడ అవకాశం కల్పించిన వారిపైన, డ్రగ్స్ సరఫరా చేసిన వారిపైన వెంటనే చర్యలు తీసుకోవాలని నారాయణ డిమాండ్ చేశారు. వారందరిపై చర్యలు తీసుకోవడానికి బదులుగా ఆ పార్టీలో పాల్గొన్న వారిని ఎక్స్‌పోస్ చేస్తున్నారన్నారు. తద్వారా వారి వ్యక్తిత్వాన్ని దెబ్బతీయడంతో వారు ఆత్మహత్యలకు పాల్పడే పరిస్థితికి తీసుకురావడం అన్యాయమని హితవు పలికారు.

**అన్ని రకాల వడ్లకు బోనస్ ఇవ్వాలి: పశ్యపద్మ**

రాష్ట్రంలో రైతులు పండిస్తున్న అన్ని రకాల వడ్లకు ప్రభుత్వం రూ.500ల బోనస్ ఇవ్వాలని పశ్య పద్మ డిమాండ్ చేశారు. కేవలం సన్న వడ్లకే బోనస్ ఇవ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయించడం అన్యాయమన్నారు. 'రైతులు పండించిన వడ్లకు రూ.500ల బోనస్ ఇస్తాం' అని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో హామీ ఇచ్చిందని, సన్న వడ్లు, దొడ్డు వడ్లు అని ఎక్కడా చెప్పలేదని ఆమె గుర్తు చేశారు. ఇప్పుడు బోనస్ అమలు విషయానికి వచ్చే సరికి సన్న వడ్లు, దొడ్డు వడ్లు అనే తేడా చూపించడం దొడ్డ వడ్లు పండించే రైతులకు అన్యాయం చేయడమేనని పశ్మపద్మ అన్నారు.

## చేనేత కార్మికుల అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం మరిన్ని చర్యలు

### మంత్రి తుమ్మల నాగేశ్వరావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** చేనేత కార్మికుల అభివృద్ధితో పాటు వారి సంక్షేమానికి ప్రభుత్వం మరిన్ని చర్యలు చేపట్టిందని వ్యవసాయ, సహకార శాఖ, చేనేత జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలిపారు. హ్యాండ్లూమ్ టెక్నాలజీలో విద్యార్థులకు డిప్లొమా, డిగ్రీ కోర్సులను అందించడం, చేనేత మగ్గాల అధునీకరణతో పాటు పలు ప్రతిపాదనలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని మంత్రి వెల్లడించారు. ఇందులో భాగంగాపోచంపల్లి హ్యాండ్లూమ్ పార్క్ కనుముక్కలలో (23) ఎకరాల స్థలంలో ఏర్పాటు చేసే ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ ( ఐఐహెచ్‌టి)లో డిప్లొమాతో పాటు డిగ్రీ ప్రోగ్రాంలలో విద్యార్థులకు ప్రవేశాల కల్పనకు సిఎం ఆమోదం తెలపారన్నారు. మరమగ్గాలు, చేనేత మగ్గాల ఆధునీకరణకు గాను నేతన్నలకు సహాయం అందించేందుకు గాను బిసి సంక్షేమ శాఖకు 2024 25 ఆర్థిక సంవత్సరంలో కేటాయించిన బడ్జెట్‌లో నుంచి రూ.400 కోట్లను వినియోగించుకునేందుకు సైతం సిఎం సమ్మతించారని వెల్లడించారు. టిఎస్‌సిఓ ద్వారా సానిటరీ నాప్కిన్లు ఉత్పత్తి పరిశ్రమను పోచంపల్లిలో స్థాపించి వాటిని స్వయం సహాయక సంఘాల ద్వారా పాఠశాలలకు వెళ్ళే బాలికలకు అందించడం ద్వారా ఋతుక్రమ సమయంలో వారు పాఠశాలలకు గైర్హాజరు కాకుండా చర్యలు తీసుకోనున్నామని తెలిపారు. అదేవిధంగా అన్ని ప్రభుత్వ శాఖల నుండి టెస్కోకు రావాల్సిన అన్ని పెండింగ్ బాకాయిలను విడుదల చేసేందుకు సైతం సిఎం అంగీకరించారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

## విసిల నియామకం

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటికే సర్చ్ కమిటీలను నియమించింది. విసిల నియామకానికి సంబంధించి పలువురు ప్రొఫెసర్ల నుంచి దరఖాస్తులను కూడా స్వీకరించారు. సర్చ్ కమిటీలు దరఖాస్తుల పరిశీలన పక్రియను మొదలుపెట్టాయి. త్వరలోనే ముగ్గురు పేర్లతో కూడిన ప్రతిపాదన జాబితాను ఆయా విశ్వవిద్యాలయాల సర్చ్ కమిటీలు ప్రభుత్వానికి అందజేయనున్నాయి.

**విశ్వవిద్యాలయాల ఇన్‌ఛార్జ్ వైస్‌ఛాన్సలర్లు వీరే**

1.ఉస్మానియా యూనివర్సిటీ ఎం.దాన కిషోర్
2. జెఎన్‌టియు బుర్రా వెంకటేశం
3. కాకతీయ యూనివర్సిటీ కరుణ వాకాటి
4. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ సయ్యద్ అలీ ముర్తజా రిజ్వి
5. తెలంగాణ వర్సిటీ సందీప్ సుల్తానియా
6. పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ శైలజ రామయ్యర్
7. మహాత్మా గాంధీ యూనివర్సిటీ నవీన్ మిట్టల్
8. శాతవాహన యూనివర్సిటీ సురేంద్ర మోహన్
9. జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనాన్స్ యూనివర్సిటీ జయేష్ రంజన్
10. పాలమూరు యూనివర్సిటీ నదీం అహ్మద్.

## దొడ్డు బియ్యం నిల్వలు

(మొదటి పేజీ తరువాయి)

ఉంటుంది. దొడ్డు బియ్యం తినేందుకు రేషన్ కార్డుల లబ్దిదారులు ఇష్టపడటం లేదు. చాలా చోట్ల వీటిని అమ్ముకుంటున్న ఉదంతాలున్నాయి. అందుకే సన్నాల సాగు పెరిగితే రాష్ట్రంలోని రేషన్ షాపుల ద్వారా కూడా ఈ బియ్యాన్ని పంపిణీ చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. రాష్ట్ర సివిల్ సప్లయిస్ విభాగం మిల్లింగ్ చేయిస్తున్న వాటిలో దొడ్డు బియ్యం 98 శాతం ఉండగా, సన్న బియ్యం ఒకటీ రెండు శాతం మించి ఉండటం లేదు. మారిన అవసరాలకు అనుగుణంగా రైతులు దొడ్డు రకాలకు బదులు సన్నరకాల వరి సాగుపై దృష్టి సారిస్తే ఈ పరిస్థితిని అధిగమించే వీలుందని ప్రభుత్వ వర్గాలు అ అభిప్రాయపడుతున్నాయి. దొడ్డు రకంతో పోలిస్తే సన్న ధాన్యాల దిగుబడి కొంత తగ్గుతుంది. అందుకే రైతులు దొడ్డు రకం ధాన్యం ఎక్కువగా సాగు చేస్తున్నారు. కానీ సన్న ధాన్యానికి బోనస్ ఇవ్వటం ద్వారా రైతులకు వచ్చే దిగుబడి నష్టాన్ని పూడ్చే వీలుంది. వ్యవసాయ శాఖ అంచనాల ప్రకారం 2019–20లో రాష్ట్రంలో 91.45 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు రకం వడ్ల దిగుబడి ఉండగా. 86.79 లక్షల మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం దిగుబడి వచ్చింది. 2020–21 లో 125.51 లక్షల మెట్రిక్ టన్నుల సన్న దాన్యం, 93.01 లక్షల దొడ్డు ధాన్యం, 2021–22లో 105.90 లక్షల మెట్రిక్ టన్నులు సన్నవి, 96.26 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు ధాన్యం దిగుబడి వచ్చింది. 2022–23లో 178.46 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు ధాన్యం, కేవలం 79.74 లక్షల సన్న ధాన్యం, 2023–24లో 174.18 లక్షల దొడ్డు ధాన్యం, 86.26 లక్షల సన్న ధాన్యం దిగుబడి వచ్చింది.

# 18వ లోక్‌సభ ఎన్నికల సమరం 2024

| పోలింగ్ | ఏప్రిల్ 19 | ఏప్రిల్ 26 | మే 7 | మే 13 | మే 20 | మే 25 | జూన్ 1 | ఓట్ల లెక్కింపు |
|---|---|---|---|---|---|---|---|---|
| సీట్లు | 102 | 89 | 94 | 96 | 49 | 57 | 57 | జూన్ 4 |

## కన్హయ్యకుమార్‌పై దాడి చేసిన వ్యక్తి అరెస్ట్

**న్యూఢిల్లీ :** ఈశాన్య నియోజకవర్గం నుండి పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి కన్హయ్య కుమార్‌పై గత వారం ఇంకు పోసి దాడి చేసిన వ్యక్తిని మంగళవారం నాడు ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడు అజయ్‌కుమార్‌ను న్యూ ఉస్మాన్‌పూర్‌లోని ఆయన నివాసంలో అరెస్టు చేసినట్లు తెలిపారు. మరో నిందితుడిని అదుపులో తీసుకునేందుకు కూడా ప్రయత్నాలు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ నెల 17వ తేదీన న్యూ ఉస్మాన్‌పూర్‌లోని ఆప్ కార్యాలయంలో ప్రచార సమావేశం అనంతరం బైటికి వస్తున్న కన్హయ్యకుమార్‌పై దాడి చేసినట్లు స్థానిక ఛాయా శర్మ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు చర్యలు తీసుకున్నారు.

## కవితను ప్రాసిక్యూట్ చేసేందుకు మా వద్ద సరిపడ సాక్ష్యాలు ఉన్నాయి



**న్యూఢిల్లీ :** ఎక్సైజ్ పాలసీతో సంబంధం ఉన్న మనీలాండరింగ్ కేసులో బిఆర్‌ఎస్ ఎంఎల్‌సి కల్వకుంట్ల కవితపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దాఖలు చేసిన అనుబంధ ఛార్జిషీట్‌ను పరిగణలోకి తీసుకోవాలా? వద్దా? అనే అంశంపై మే 31వ తేదీన కోర్టు ఆదేశాలను వెలువరించనుంది. కవితను ప్రాసిక్యూట్ చేసేందుకు తమ వద్ద సరిపడ సాక్ష్యాలు ఉన్నాయని యాంటీ మనీలాండరింగ్ ఏజెన్సీ చెప్పిన దానిపై ఇడి, సిబిఐ అంశాలను చూసే ప్రత్యేక జడ్జ్ కావేరీ బవేజా ఆర్డర్‌ను రిజర్వులో ఉంచారు. ఈ కేసులో ఢిల్లీ సిఎం అరవింద్ కేజ్రీవాల్‌ను ప్రాసిక్యూట్ చేసేందుకు కూడా తమ వద్ద సరిపడ సాక్ష్యాలు ఉన్నాయని ఇడి స్పష్టం చేసింది. కేజ్రీవాల్, ఆమ్ ఆద్మీ పార్టీలకు వ్యతిరేకంగా ఆమ్ ఆద్మీ పార్టీ దాఖలు చేసిన అనుబంధ ఛార్జిషీట్‌ను పరిగణలో తీసుకోవడంపై మే 28న కోర్టు ఆదేశాలు ఇవ్వనుంది.

## మేము మైనారిటీలకు వ్యతిరేకం కాదు...



**న్యూఢిల్లీ :** లోక్‌సభ ఎన్నికలు మొత్తాన్ని ప్రజలను విభజించి, మతతత్వ అంశంపై పోటీ జరిగే విధంగా ప్రధాని మోదీ నిమగ్నమయ్యారని, దానిని తిరస్కరించిన కాంగ్రెస్ మాత్రం పాంచ్ న్యాయ్‌లనే ఎజెండాగా ముందుకు సాగుతోందని ఎఐసిసి ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ అన్నారు. తాను ఎన్నడూ మైనారిటీలకు వ్యతిరేకంగా ఒక్క పదం వాడలేదని, బిజెపి ఇప్పుడే కాదు గతంలో కూడా వారికి వ్యతిరేకంగా పనిచేయలేదని ఒక వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రధాని చేసిన వ్యాఖ్యలను జైరామ్ ఎద్దేవా చేశారు. లోక్‌సభ ఎన్నికలు ప్రారంభమైన ఏప్రిల్ 19 నుండి ప్రధాని ప్రచారమంతా మతతత్వంపై ఆధారపడి సాగిందని, హిందూ ముస్లిం అనే మాట తప్ప వికసిత్ భారత్, మోదీ కీ గ్యారంటీ వంటి అంశాలే రాలేదని ఆయన ఒక వార్తా సంస్థ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

## ఓట్ల కోసం తమిళులను
# అపఖ్యాతిపాలు చేయడం ఆపండి

ప్రధాని వ్యాఖ్యలపై స్టాలిన్ తీవ్ర అభ్యంతరం



**చెన్నై :** కనిపించకుండా పోయిన ఒడిషా జగన్నాథుడి తాళాలు తమిళనాడుకు పోయాయని ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై డిఎంకె అధ్యక్షులు, తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇది కేవలం ఓట్ల కోసం తమిళులను అపఖ్యాతి చేసే ప్రయత్నమని విమర్శించారు. తక్షణమే ఇలాంటి వ్యాఖ్యలను మానుకోవాలని ఒక ప్రకటనలో స్టాలిన్ పేర్కొన్నారు. ఒడిషా ప్రచార సభలో మోదీ మాట్లాడుతూ నవీన్ పట్నాయక్ ప్రభుత్వం పూరీ జగన్నాథ స్వామి దేవాలయం కూడా సురక్షితంగా లేదని, దేవుని రత్న భాండాగారం తాళాలు ఆరేళ్లుగా కనిపించకుండా పోయాయని, అవి తమిళనాడుకు పోయాయని ఆరోపించారు. ఈ వ్యాఖ్యలపై స్టాలిన్ స్పందిస్తూ తన ద్వేషపూరిత ప్రసంగాల ద్వారా ప్రజల మధ్య శత్రుత్వాన్ని, రాష్ట్రాల మధ్య ఆగ్రహభావాన్ని సృష్టిస్తున్నారని మండిపడ్డారు. ఆయన వ్యాఖ్యలు కోట్లాది మంది ఆరాధించే జగన్నాథ స్వామి, తమిలనాడు ప్రజలను అవమాన పరచడమే అవుతుందన్నారు. తమిళులను దొంగల మాదిరిగా చిత్రీకరించడమే కాకుంఆ వారు ఆలయ సొమ్మును దొంగలించారనే భావన కల్పిస్తున్నారని ధ్వజమెత్తారు. తమిళనాడులో ఉన్నప్పుడు తమిళ భాషను పొగడటం, రాజస్తాన్, ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, ఒడిషా రాష్ట్రాల ప్రచారంలో తమిళనాడు గురించి తప్పుగా మాట్లాడడం ప్రధాని ద్వంద్వవైఖరిని సూచిస్తుందన్నారు.

# అధిష్టానం మీద కోపంతో...



జార్ఖండ్‌లోని హాజారీబాగ్ పార్లమెంటు నియోజకవర్గంలో సోమవారం జరిగిన పోలింగ్‌లో బిజెపి సిట్టింగ్ ఎంపి, కేంద్ర మాజీ మంత్రి జయంత్ సిన్హా ఓటు వేయలేదు. ఈసారి పోటీ చేసే అవకాశం తనకు కాకుండా మనీశ్ జైస్వాల్‌కు ఇవ్వడంపై అతను పార్టీ అధిష్టానంపై కోపంతో ఉన్నారు. దీనితో అతను సోమవారం ఓటు హక్కును వినియోగించుకోకుండా, నిరసన వ్యక్తం చేశారు. ఈ విషయంపై బిజెపి అగ్రనాయకత్వం తీవ్రంగా స్పందించింది. ఎంపిగా ఉండి, ఓటు కూడా వేకపోవడంపై అధిష్టానం ఆయనకు షోకాజ్ నోటీసు పంపింది. పార్టీ సంస్థాగత కార్యకలాపాలు, ఎన్నికల ప్రచారంలో పాల్గొనకపోవడాన్ని ప్రశ్నించింది. 'హజారీబాగ్ లోక్‌సభ స్థానం నుంచి పార్టీ అభ్యర్థిగా మనీశ్ జైస్వాల్‌ను ప్రకటించిన నాటి నుంచి పార్టీ సంస్థాగత కార్యకలాపాలు, ఎన్నికల ప్రచారంపై మీరు ఏమాత్రం ఆసక్తి చూపడం లేదు. కనీసం ఓటు వేయాలని కూడా మీరు భావించలేదు. మీ ప్రవర్తనతో పార్టీ ప్రతిష్ట మసకబారింది' అంటూ ఝార్ఖండ్ బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదిత్య సాహు పేరుతో విడుదలైన నోటీసులో పేర్కొన్నారు. రెండు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని సిన్హాను పార్టీ కోరింది. కాగా నోటీసులపై ఆయన ఇంకా స్పందించలేదు. ఇదిలావుంటే, లోక్‌సభ ఎన్నికల్లో తాను పోటీ చేయకూడదని నిర్ణయించుకున్నానంటూ మార్చిలో జయంత్ సిన్హా తన 'ఎక్స్' ఖాతాలో పోస్టు చేశారు. ఆ కొద్దిసేపటికే హజారిబాగ్ అభ్యర్థిగా మనీశ్ జైస్వాల్ పేరును బిజెపి అధిష్టానం ప్రకటించింది. కేంద్ర మాజీ మంత్రి యశ్వంత్ సిన్హా కుమారుడే ఈ జయంత్ సిన్హా. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో ఇదే నియోజకవర్గం నుంచి పోటీ చేసిన ఆయనకు 7,25,798 ఓట్లు లభించాయి. సమీప ప్రత్యర్థి, కాంగ్రెస్ అభ్యర్థి గోపాల్ ప్రసాద్ సాహుకు 2,49,254 ఓట్లు దక్కాయి. అంతకు ముందు, 2014 లోక్‌సభ ఎన్నికల్లోనూ జయంత్ సిన్హా భారీ మెజారిటీతో గెలుపొందారు. వరుసగా వరుసగా రెండు పర్యాయాలు తిరుగులేని విజయాలను నమోదు చేసిన తనను పక్కకుపెట్టి, జైశ్వాల్‌కు టికెట్ ఇవ్వడాన్న వ్యతిరేకిస్తున్నారు.

## పూరి జగన్నాథుడే మోదీకి భక్తుడు!



భగవంతుడికి భక్తులు ఉంటారు. ఇది సహజం. కొంత మంది తమను తాము దేవుళ్లతో పోల్చుకుంటారు. అలాంటి వారు ఎంతో మంది కనిపిస్తారు. కానీ, దేవుడే ఒక మనిషికి భక్తుడిగా మారిపోయాడన్న అద్భుతమైన విషయాన్ని ఒడిశాకు చెందిన బిజెపి నాయకుడు సంబిత్ పాత్ర కనిపెట్టాడు! ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఇటీవల ఒక ఎన్నికల సభలో మాట్లాడుతూ, కౌరవుల వంటి ప్రతిపక్షాలను నాశనం చేయడానికి అవతరించిన కృష్ణుడిగా ప్రధాని మోదీని అభివర్ణించారు. కాగా, పాత్ర మరో అడుగు ముందుకేసి, ఏకంగా భగవండుడినే మోదీకి భక్తుడిగా మార్చేశాడు. ఒడిశాలో మీడియాతో మాట్లాడుతూ, ''ఈ రోజు మోదీని చూసేందుకు కొన్ని లక్షల మంది ఇక్కడకు వచ్చారు. జగన్నాథుడు కూడా మోదీ భక్తుడే. మనమంతా మోదీ కుటుంబసభ్యులమే. ఒడిశా ప్రజలకు ఇంత ముఖ్యమైన రోజున నేను భావోద్వేగాన్ని అణచుకోలేకపోతున్నా' అని మాట్లాడాడు. అయితే, పూరీ జగన్నాథుడిని మోదీ భక్తుడనటం వివాదానికి దారి తీసింది. పాత్ర వ్యాఖ్యలపై ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సీరియస్ అయ్యారు. 'ఒడిశా ఆత్మాభిమానానికి మహాప్రభు పూరీ జగన్నాథ్ చిహ్నం. పూరీ జగన్నాథుడు ఓ మనిషికి భక్తుడని వ్యాఖ్యానించడాన్ని నేను ఖండిస్తున్నాను. మహాప్రభును రాజకీయాల్లోకి లాగొద్దని నేను బిజెపికి విజ్ఞప్తి చేస్తున్నా. ఈ వ్యాఖ్యలు ఒడియా ప్రజల ఆత్మాభిమానాన్ని దెబ్బతీశాయి. దీన్ని వారు చాలా కాలం పాటు గుర్తుపెట్టుకుంటారు' అని ఎక్స్ వేదికగా ఆయన వ్యాఖ్యానించారు. సర్వత్రా విమర్శలు వెల్లువెత్తడంతో పాత్ర దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించాడు. తాను పొరపాటున నోరు జారానని, ఈ విషయాన్ని పెద్దది చేయవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశాడు. కానీ, అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. దేవుడినే మోదీకి భక్తుడి చేసిన పాత్రను నెటిజన్లు విపరీతంగా ట్రోల్ చేస్తున్నారు.

## ఇసిఐ నిర్లక్ష్యం?




ఓటింగ్ పూర్తయిన వెంటనే వివరాలను అందించడంలో భారత ఎన్నికల కమిషన్ (ఇసిఐ) వరుసగా విఫలమవుతున్నది. ఈ విషయంపై కోర్టు ఆదేశాలను కూడా పాటించడం లేదు. ఐదవ విడత పోలింగ్‌లో సుమారు 60.09 శాతం ఓటింగ్ జరిగినట్టు ప్రకటించింది. అత్యధికంగా పశ్చిమ బెంగాల్‌లో 74.65 శాతం పోలింగ్ నమోదైనట్టు పేర్కొంది. మహారాష్ట్రలోని 13 సీట్లలో అత్యల్పంగా 52.60 శాతం నమోదైందని వెల్లడించింది. అయితే, అంతకు ముందు జరిగిన నాలుగు దశల్లో అసలు ఓటర్ల నంబర్లను ఇప్పటికీ ప్రకటించలేదు. పోలింగ్ శాతం వెల్లడిలో జరుగుతున్న జాప్యంపై ప్రతిపక్ష పార్టీలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. అక్రమాలు జరిగే అవకాశాలు ఉన్నాయని భయపడుతున్నాయి. అయితే, ఇసిఐ మాత్రం నామ మాత్రపు వివరాలతో సరిపుచ్చుతున్నది.

## ఫీజు రియాంబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలి : బూర నర్సయ్యగౌడ్



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** విద్యార్థుల ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలకు సంబంధించిన నిధులను వెంటనే విడుదల చేయాలని మాజీ ఎంపి, బిజెపి నేత బూర నర్సయ్య గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం మీడియాతో ఆయన మాట్లాడారు. 2022 నుంచి ఇప్పటివరకు విద్యార్థుల ఫీజులకు సంబంధించి రూ.7500 కోట్లు బకాయిలు ఉండడంతో కళాశాలల యాజమన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా వేధిస్తున్నాయని దీంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కనీసం టోకెన్లు ఇచ్చిన రూ.2 వేల కోట్ల నిధులనైనా యుద్ధప్రతిపాదికన విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలని కోరారు. అదేవిధంగా ఆరోగ్యశ్రీకి సంబంధించి రూ.1400 కోట్లు బకాయిలు పేరుకుపోవడంతో కార్పోరేట్ ఆసుపత్రులలో పేదలకు వైద్య సేవలు అందక అప్పుల పాలవుతున్నారన్నారు. ఆరోగ్య శ్రీ పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని, సిఎం రిలీఫ్ ఫండ్‌కు సంబంధించి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరించాలని, అప్పుడే దళారుల ఆట కట్టించడానికి అవకాశం ఉంటుందన్నారు. వీటితో ఉద్యోగులకు సంబంధించి 4 డిఎలు పెండింగ్‌లో ఉన్నాయని వాటి బకాయిలను చెల్లించడంతో పాటు వెంటనే పిఆర్‌సి అమలు చేయాలని బూర నర్సయ్య గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## ధాన్యం తేమ పేరుతో భారీ కుంభకోణం

శాసన సభ బిజెపి పక్ష నేత మహేశ్వర్‌రెడ్డి సంచలన ఆరోపణ



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** మిల్లర్లు, సంబంధిత శాఖ మంత్రి కలిసి రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లలో తేమ పేరుతో భారీ కుంభకోణానికి తెర లేపారని బిజెపి శాసనసభ పక్ష నాయకులు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలో కొత్తగా యు టాక్స్ పుట్టుకు వచ్చిందన్నారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం మహేశ్వర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ యాసంగిలో 1.30 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి గా, ఇందులో ఐకెపి సెంటర్లు, మిల్లర్లు కలిసి క్వింటాల్‌కు 10 నుంచి 12 కిలోల కోత విధిస్తున్నారన్నారు. తద్వారా తేమ పేరుతో రూ.1600 కోట్లు విలువైన 13 వేల టన్నుల ధాన్యాన్ని రైసు మిల్లర్లు రైతుల నుంచి కొల్లగొడుతుండగా, వారి నుంచి యు టాక్స్ పేరుతో రూ.500 కోట్లు, రశీదులు లేని జరిమానాల పేరుతో మరో రూ.450 కోట్లు మొత్తం రూ.900 కోట్లు చేతులు మారాయని ఆరోపించారు. ఇందులో యు టాక్స్ రూపంలో పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కి రూ.500 ముట్టాయని, వాటిలో నుంచే ఆయన ఢిల్లీ పెద్దలకు రూ.100 కోట్లు పంపించారన్నారు. దీనిపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందిస్తే తను నిజం అని నిరూపించేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. ఈ కుంభకోణంపై నిగ్గు తేల్చేందుకు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## నిత్యం వార్తల్లో ఉండాలనే తపనతోనే అసత్య ఆరోపణలు : మంత్రి ఉత్తమ్

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** శాసనసభ బిజెపి పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపణలను నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. మహేశ్వర్ రెడ్డి నిత్యం వార్తల్లో ఉండాలనే తపనతో నిరాధార, అసత్య ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. మహేశ్వర్‌రెడ్డితో పాటు బిజెపి నాయకులు కనీసం అవగాహన లేకుండా మాట్లాడుతున్నారన్నారు. వంద రోజుల్లోనే తెలంగాణలో రాష్ట్రంలో అస్తవ్యస్తంగా మారిన పాలనను అధికారం చేపట్టిన 100 రోజుల్లోనే ఓ గాడి లో పెట్టి అద్భుతమైన పాలన అందిస్తున్నామని ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ వంద రోజుల పాలనలోనే అవినీతికి పాల్పడి యూ టాక్స్ వసూళ్లు చేశామనడం పచ్చి అబద్ధం, అత్యంత దుర్మార్గమని పేర్కొన్నారు. ప్రస్తుతం తాను కుటుంబంతో కలిసి దైవ దర్శనానికి వేరే రాష్ట్రంలో ఉన్నామని, బుధవారం హైదరాబాద్‌కు వచ్చాక మహేశ్వర్‌రెడ్డి చేసిన అన్ని రాజకీయ ఆరోపణలకు తగిన జవాబు ఇస్తామని ఓ ప్రకటనలో తెలిపారు.

## షాలో ఆక్విఫర్ ప్రాజెక్టు ద్వారా నగరంలో...
# భూగర్భ జలాల రీఛార్జ్ పైలెట్ ప్రాజెక్టు





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రస్తుతం నగరంలో భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో బోర్లు ఎండిపోతున్నాయి. అదే సమయంలో చిన్నపాటి వర్షానికి నగరంలోని వీధులన్నీ జలమయం అవుతున్నాయి. ఈ సమస్యను పరిష్కరించడానికి కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని అమృత్ పథకంలో భాగంగా జిహెచ్‌ఎంసిలో పైలట్ ప్రాతిపదికన 'షాలో ఆక్వి ఫర్ రీఛార్జ్' ప్రాజెక్టును చేపట్టడానికి జిహెచ్‌ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్ దిశా నిర్దేశం చేశారు. ఈ ప్రాజెక్టును అమలు చేయడానికి ఎన్‌ఐయుఎ నోడల్ ఏజెన్సీగా ఉన్నది. నగరంలో ఈ ప్రాజెక్టును ప్రయోగాత్మకంగా చేపట్టేందుకు జిహెచ్‌ఎంసి 5 మున్సిపల్ పార్కులను ఎంపిక చేసింది. ఖైరతాబాద్ జోన్‌లో కెవిఎన్ యాదవ్ పార్క్, శేరిలింగంపల్లి జోన్‌లో టెక్నో పార్క్, సికింద్రాబాద్ జోన్‌లో ఇందిరా పార్కు, ఎల్.బి.నగర్ జోన్‌లో హబ్సిగూడలోని కాకతీయ నగర్ కాలనీ పార్క్, సైనిక్ పురి ఈ సెక్టార్ పార్క్ గుర్తించి అమలు చేయనున్నారు. ఈ పార్కులలో 100 నుండి 120 అడుగుల లోతు వరకు షాలో ఆక్వి ఫర్ ఇంజక్షన్ బోర్వెల్‌లను డ్రిల్ చేయడం ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం. లోతులేని జలాశయాలలోని నీటిని బయటికి పంపడం ద్వారా వర్షపాతం ఉన్నప్పుడల్లా భూమిలోని దిగువ పొరలు రీఛార్జ్ అవుతాయి. చుట్టుపక్కల వాటర్ షెడ్ నుండి నీటిని సేకరించడం, రీఛార్జ్ పిట్ల ద్వారా నీటిని పంపడం వల్ల భూగర్భంలోని పొరలను ఇది రీఛార్జ్ చేస్తూ నీటి స్థాయిని పెంచుతుంది. ఈ ప్రాజెక్టును ది రైన్ వాటర్ ప్రాజెక్ట్ సహాయంతో అమలు చేస్తారు. మంగళవారం జిహెచ్‌ఎంసి అధికారులు, ఎన్‌ఐయుఎ ప్రతినిధి, రైన్ వాటర్ ప్రాజెక్ట్ బృందంతో కలిసి హబ్సిగూడలోని కాకతీయ నగర్ కాలనీ పార్కులో ఈ ప్రాజెక్టుపై కాలనీ వాసులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ ప్రాజెక్టుతో కలిగే ప్రయోజనాలను స్థానికులకు వివరించారు. ఈ పార్కు వాటర్ షెడ్ ప్రాంతం 685738 ఎస్ క్యూఎమ్, వాటర్ షెడ్ సామర్థ్యం 44.6 కోట్ల లీటర్లు, వార్షిక వర్షపాతం 53 లక్షల లీటర్లు. అదనపు కమిషనర్ (యుబిడి) డాక్టర్ సునంద రాణి, ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం, దీనితో సమాజానికి చేకూరే ప్రయోజనాలను వివరించారు. ది రెయిన్ వాటర్ ప్రాజెక్ట్ బృందం అధిపతి కల్పన ఈ పార్క్‌లో చేపట్టిన సాంకేతిక ఇంటర్వెన్షన్స్, అది రీఛార్జ్ ఎలా అవుతుందో వివరించారు. తద్వారా దీనివల్ల పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాల స్థాయిలు మెరుగుపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో యుబిడి డిప్యూటీ డైరెక్టర్ ఎం. చంద్రశేఖర రావు, ఎన్‌ఐయుఎ ప్రతినిధి అనిరుద్, ఉప్పల్ సర్కిల్ మేనేజర్ ఎ. నరసింహారావు, ది రైన్ వాటర్ ప్రాజెక్ట్ బృందం, ఇతర జిహెచ్‌ఎంసి అధికారులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ బుక్ ఫెయిర్ నూతన కార్యవర్గం ఎన్నిక



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** హైదరాబాద్ బుక్ ఫెయిర్ (హెచ్‌బిఎఫ్) నూతన అధ్యక్షులుగా కవి యాకూబ్, ప్రధాన కార్యదర్శిగా ఆర్.వాసు (నవ తెలంగాణ) ఎన్నికయ్యారు. హైదరాబాద్ బుక్ ఫెయిర్ సంస్థ విస్తృతస్థాయి సమావేశం మంగళవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. ఈ సందర్భంగా గత సంవత్సరం వరకు జరిగిన కార్యక్రమాలతో పాటు ఆదాయ, వ్యయాలను సమీక్షించిన అనంతరం సభ్యులు అమోదించారు. అనంతరం సమావేశం రానున్న రెండేళ్లకుగాను నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా యాకూబ్ (కవి), ఉపాధ్యక్షులుగా శోభన్ బాబు, మలుపు బాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఆర్.వాసు (నవతెలంగాణ), సహాయ కార్యదర్శులుగా సూరిబాబు, సురేష్ (మంచిపుస్తకం), కోశాధికారిగా నారాయణరెడ్డి (నవచేతన) ఎన్నికయ్యారు. వివిధ ప్రచురణ సంస్థల నుండి జనార్ధన గుప్తా, విజయరావు, ఎన్.మధుకర్, కోటేశ్వరరావు, శ్రీకాంత్, భూమి శ్రీనివాస్, సాంబశివరావు, కుమార్ ఎనిమిది మందితో ఎగ్జిక్యూటివ్ కమిటీని ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలను ఎమెస్కో విజయకుమార్, వీక్షణం వేణుగోపాల్ నిర్వహించారు.

## 'ఇండియా' కూటమి పక్షాలన్నీ
# కుల, మత, వంశపారంపర్య పార్టీలే

బీహార్ బహిరంగ సభల్లో మోదీ దాడి

**మహారాజ్‌గంజ్ / మోతీహరి :** 'ఇండియా' కూటమిలో ఉన్న భాగస్వామ్య పక్షాలన్నీ కుల మతాలతో అంటకాగిన వంశపారంపర్య పార్టీలేనని ప్రధానమంత్రి నరేంద్రమోదీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మంగళవారం బీహార్‌లో జరిగిన బహిరంగ సభల్లో ఆయన మాట్లాడారు. 'ఇండియా' కూటమి అంతా కుల, మత, వంశపారంపర్య పార్టీలతో నిండిపోయింది, ఆ కూటమి భాగస్వామ్యపక్షాలు ఈ దుష్ట ప్రవృత్తులనన్నింటినీ నూటికి నూరుశాతం తీవ్రస్థాయిలో ప్రదర్శించాయని మోదీ అపనిందలు ఎత్తుకున్నారు. బీహార్‌లోని మహారాజాగంజ్, పూర్వీ చంపారన్ లోకసభ నియోజకవర్గాలలో జరిగిన ర్యాలీలలో మోదీ ప్రసంగించారు. అవినీతి, బుజ్జగింపు రాజకకీయాలు, ప్రాచీన సాంస్కృతిక ఆలోచనలకు వ్యతిరేకించే ప్రతిపక్ష కూటమి పార్టీలకు ఈ రాష్ట్రంలో జూన్ 4వ తేదీన వెలువడే ఫలితాల్లో చాలా పెద్ద దెబ్బ తగులుతుందని కూడా ఆయన ఊహాగానాలు చేస్తూ తీవ్రస్థాయిలో ప్రతిపక్షాలపై ఆయన విమర్శలు గుప్పించారు. తనకెవరూ వారసులు లేరనీ, దేశంలో ఉన్న ప్రజలే త వారసులనీ అన్నారు. భారతదేశ తొట్టతొలి రాష్ట్రపతి బాబూ రాజేంద్ర ప్రసాద్ జన్మించిన బీహార్ గడ్డకు ఆర్‌జెడి – కాంగ్రెస్ పార్టీలు ఉమ్మడిగా బెదిరింపులతో అక్రమ వసూళ్ళద్వారా తీవ్రమైన అపఖ్యాతి తెస్తున్నాయని విమర్శించారు. నెహ్రూ – ఇందిరాగాంధీ కుటుంబంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పంజాబ్, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాలలో 'ఇండియా' కూటమి పార్టీలు బీహార్‌కు వ్యతిరేకంగా వివాదాస్పదమైన వ్యాఖ్యలు చేస్తే కాంగ్రెస్ రాచకుంటుంబం కిక్కురుమనకుండా చూస్తూ కూర్చుందని విమర్శించారు. ''మీ ఓటును కేవలం మీ స్థానిక ఎంపీని మాత్రమే ఎంచుకోవడం కోసం కాదు, మీ ప్రధానమంత్రిని బలోపేతం చేయడం కోసం కూడా మీరు మీ స్థానిక ఎంపీని ఎంచుకోవాలి'' అని మోదీ అన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, ఓబిసిల నుండి రిజర్వేషన్లను లాగేసుకునేందుకు రాజ్యాంగాన్ని మార్చేయాలని కాంగ్రెస్‌పార్టీ భావిస్తోందని, అలా లాగేసుకున్న రిజర్వేషన్లను 'ఓట్ జీహాద్'కు పాల్పడేవారికి కట్టబెడుతుందని ఆయన ఆరోపించారు. ''అంబేద్కర్ గనుక లేకపోతే నెహ్రూ ఈ దేశంలో ఎస్‌సి, ఎస్‌టీలకు రిజర్వేషన్లను అనుమతించేవాడే కాదని ఆరోపించారు. రాహుల్‌గాంధీ, అఖిలేశ్ యాదవ్, తేజస్వి యాదవ్ వంటి నాయకులపై ఆయన పరోక్ష విమర్శలు చేశారు. వారంతా ధనవంతుల కుటుంబాల్లో పెట్టి పుట్టారని విమర్శించారు. ''దేశం 'ఇండియా' కూటమి చేసిన పాపపాలతో ముందుకు ప్రయాణం చేయలేదు, అవినీతి, బుజ్జగింపు రాజకీయాలు, ఎవరూ ఎవరికీ కాకుండాపోయే చెల్లా చెదురు కూటమి ప్రాతినిధ్యవల్ల దేశానికి ఒరిగేదేమీ లేదని విమర్శించారు. 'ఇండియా' కూటమి పార్టీలలో కులం, మతం, వంశపారంపర్యం అనే మూడు దుష్టత్వాలు ఉమ్మడిగా అందరికీ ఉన్నాయని విమర్శించారు. చంపారన్ ప్రాంతం మహాత్మా గాంధీ కర్మభూమిగా ఆయన అభివర్ణించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆదర్శాలన్నింటికీ తిలోదకాలిచ్చి ద్రోహం చేసి తన కుటుంబ ప్రయోజనాలు చూసుకుంటుందని హెచ్చరించారు.

## అన్ని రకాల వడ్లకు
# క్వింటాకు రూ.500 బోనస్ ఇవ్వాలి

తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్న ధాన్యంలో 60 శాతం దొడ్డు వడ్లేనని, వీటిని పండిస్తున్న రైతాంగాన్ని ఆదుకునేందుకు క్వింటాకు రూ.500 బోనస్ ఇచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాగం హేమంతరావు, ప్రధాన కార్యదర్శి పశ్య పద్మముఖ్యమంత్రి రేవంత్రెడ్డికి విజ్ఞప్తి చేశారు. వానాకాలం సీజన్లో సన్న వడ్లకు రూ. 500ల బోనస్ ప్రకటించటం, రాష్ట్ర అవసరాలను దృష్టిలో పెట్టుకొని సన్నరకాల వడ్లను సేకరించాలని నిర్ణయణం తీసుకోవడం హర్షనీయమన్నారు. రాష్ట్రంలో రైతాంగం 25 రకాల సన్న వడ్లను పండించటానికి కృషి చేస్తున్నారని,హెచ్‌ఎంటి, జెఎస్ ఆర్ మహేంద్ర బిపిటి రకాలు కూడా ఎకరానికి 25 నుంచి 30 క్వింటాల వరకు దిగుబడి వస్తోందని తెలిపారు. అయితే సన్న రకాలవడ్లకు రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాలలో మార్కెట్ కు మంచి అవకాశాలు ఉండడంతో పంట రాగానే పచ్చి వడ్లనే మిల్లర్స్ మద్దతు ధర కంటే ఎక్కువగా ధర పెట్టికొనుగోలు చేసుకుని ఇతర రాష్ట్రాలలో మార్కెట్ చేసుకుంటున్నారన్నారు. దొడ్డు రకం వడ్లను సాగుకు తక్కువ పెట్టుబడితో పాటు ఏలాంటి వాతావరణం ఉన్నా దిగుబడి ఎక్కువ వస్తుంది అన్న ఆలోచనతో రైతులు సాగుచేస్తున్నారని వెల్లడించారు. యాసంగిలో పండిన పంటను ప్రభుత్వం ప్రతి గింజనుకొనుగోలు చేస్తామని, అకాల వర్షాల కారణంగా తడిచిన ధాన్యాన్నిసైతం పూర్తి మద్దతు ధరకే కొనుగోలు చేస్తామని చెప్పటం పట్ల పశ్య పద్మహర్షంవ్యక్తం చేశారు. ప్రభుత్వం సన్న రకాలను ప్రోత్సహించాలనుకుంటున్న నేపథ్యంలో దొడ్డు రకాల సాగుపై తెలంగాణలో అన్ని జిల్లాలలో క్షేత్రస్థాయిపరిశీలించి రైతులను చైతన్యవంతులను చేయాలన్నారు. అదేవిధంగా ఏ ఏ ప్రాంతాలలో సన్న రకాలు సాగు చేయాలి. దొడ్డు రకాలు ఎక్కడ సాగుచేయాలి దీనిపై పూర్తి అవగాహన కల్పించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పశ్య పద్మ కోరారు. తద్వాకా క్రమక్రమంగా లాభసాటిగా ఉన్న సన్నరకాలను పండించటానికి ప్రభుత్వం రైతాంగంలో అవగాహన కల్పించడానికి నిర్దిష్టమైన చర్యలు తీసుకోవాలని అప్పటి వరకు. ప్రస్తుతం దొడ్డు రకం వడ్లకుసైతం రూ.500 బోనస్ ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరారు.

ప్రజాపక్షం

బుధవారం, మే 22

# ఓటింగ్ తగ్గుతూనే ఉంది, కారణం!

ఏడు దశల సార్వత్రిక ఎన్నికల పోలింగ్ మరో రెండు దశల్లో ఓటింగ్‌తో జూన్ 1న ముగుస్తుంది. ఇక 114 నియోజకవర్గాలే పోలింగ్‌కు వేచి ఉన్నాయి. సోమవారం ఐదవ దశలో 60 – 61 శాతం ఓట్లే పోలనాయి. ఈ ఎన్నికల సగటు ఓటింగ్ శాతం 62 దాటకపోవచ్చు. 95 కోట్ల మంది ఓటర్లుగా నమోదై ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగా ప్రస్తుతించబడే మనదేశంలో అనేక అమెరికన్ , యూరప్ దేశాల మాదిరి పోలైన ఓట్లలో 50 శాతంపైగా పొందిన అభ్యర్థే (అధ్యక్షుడు కావచ్చు, సాధారణ పార్లమెంటేరియన్ కావచ్చు) విజేత అవుతారన్న నియమం లేదు. బహుముఖ పోటీలో డిపాజిట్ దక్కని అభ్యర్థి కూడా ఆ నియోజకవర్గంలో పోటీలోని అభ్యర్థుల్లో ఎక్కువ ఓట్లు పొంది విజయం సాధించవచ్చు. ఇందిరాగాంధి హత్యానంతర ఎన్నికల్లో మినహా ఏ సార్వత్రిక ఎన్నికల్లోనూ దాదాపు 50 శాతం ప్రజల ఓట్లతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం లేదు. మైనారిటీ ఓటు ప్రభుత్వాలే మెజారిటీ ప్రజలను పరిపాలిస్తున్నాయి. పట్టణీకరణ – వలసలు పెరిగిన తర్వాత ఒకే వ్యక్తి ఒకే చోటు కన్నా ఎక్కువ ప్రదేశాల్లో ఓటరుగా నమోదు కావటం, పట్టణ ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఉత్సాహం చూపించకపోవడం ఓటింగ్ శాతం తగ్గుదలకు సర్వసాధారణంగా కనిపించే కారణాలు. ఇది పాక్షిక సత్యం మాత్రమే. రాజకీయ ప్రత్యర్థులు విధానాలపై చర్చ బదులు పరస్పర నిందలు, ఆరోపణలకు ఒడిగట్టటం, ధనబలం, కండబలం (రౌడీయిజం) విచ్చలవిడికావటం, రాజకీయ నాయకుల స్వార్థం ప్రజలకు అర్థం కావటం, ఎవరు గెలిచినా ఒకటే – వాళ్ళు దోచుకోవటం, దాచుకోవటం తప్ప మనల్ని ఉద్ధరించేవాడెవడన్న నిస్పృహ ఓటర్లను ఆవహించటం, వీటన్నిటికీ మించి కులం, మతం పేరుతో ఓట్లడగరాదని చట్టం చెబుతున్నా అవే ప్రధానం కావటం, 'అభ్యర్థుల ముఖంతో మీకు పనిలేదు, మహా నాయకుణ్ణి చూసి ఓ ప్రాతినిధ్య ప్రజాస్వామ్య మూలసూత్రానికి విరుద్ధమైన ప్రచారం వగైరా ఎన్నికల పట్ల ఆసక్తిని చంపేస్తున్నాయి. ప్రస్తుత ఎన్నికలనే తీసుకుందాం. పాలకపార్టీ వరుసగా మూడవసారి అధికారం కోసం అర్రులు చాస్తున్నది. గత పదేళ్ళలో దేశానికి, ప్రజలకు ఏమి మేళ్లు సాధించారో, మళ్లీ అధికారమిస్తే ఏమి ఉద్ధరిస్తారో వివరించి ఓట్లు అర్థించాలి. ఇటువంటి ప్రచారం వినబడుతోందా? ఎంత సేపటికి కాంగ్రెసును ప్రతిపక్షాలను తూలనాడటం, మతం పేరుతో, అయోధ్య రాముని పేరుతో ఓట్లు అడగటం, ముస్లిం మైనారిటీలపై ద్వేషపూరిత ఆరోపణలతో హిందువులను కూడగట్టే దుష్టప్రయత్నం తప్ప మరేదీ లేదు. రామాలయం సాకారంతో హిందువుల్లో ఉత్సాహం, పట్టుదల తగ్గిందని గ్రహించిన హిందూత్వశక్తులు మోదీ ఈ పర్యాయం కాశీ, మధుర వివాదాలు పరిష్కరించి భవ్యమైన ఆలయాలు నిర్మిస్తాడని ప్రజల్ని బుజ్జగిస్తున్నారు. ఇది లౌకిక రాజ్యమా? మత రాజ్యమా? ఎన్నికలు ఇందుకోసమా? లేక అవినీతి, పేదరికం నిర్మూలన, సామాన్య ప్రజల జీవన స్థితిగతుల మెరుగుదల, యావన్మంది దేశ ప్రజలకు ఉచిత విద్య, వైద్యం, ధరల అదుపు, నిరుద్యోగం తగ్గింపు వంటి ప్రజా ప్రయోజనాలు నెరవేర్చేందుకా? లేక దేశ ప్రజల స్వేదంతో నిర్మించిన ప్రభుత్వరంగ పరిశ్రమలను అస్మదీయ పెట్టుబడిదారులకు అప్పనంగా కట్టబెట్టేందుకా? ప్రభుత్వరంగం ప్రైవేటీకరించబడేకొలది ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి రిజర్వేషన్‌లకు కోతపడుతున్న వాస్తవాన్ని మోదీజీ మరుగుపరచగలరా? అబద్ధాలు, నిందలు వ్యాప్తి చేస్తూ కొంత కాలం కొందర్ని మోసగించవచ్చు. ధనస్వామ్య వ్యవస్థలో ఏ పార్టీ అవినీతికి, కుంభకోణాలకు అతీతం కాదు కనుక తాము చేసే ఆరోపణలే తమ మెడకు చుట్టుకోక మానవు, ఎలక్టోరల్ బాండ్‌లే ఇందుకు ఉదాహరణ.

ఓటింగ్ శాతం తగ్గటానికి పట్టణ, నగరవాసుల్లో స్తబ్దత ప్రధాన కారణం. కోపంతో, నిస్పృహతో ఇంట్లో కూర్చోవటం వల్ల మెరుగైన ప్రభుత్వం రాదు. మనం విశ్వసించేవారిని చట్టసభల్లోకి పంపాలంటే ఓటును అస్త్రంగా ప్రయోగించటమే ఉత్తమ మార్గం. ప్రజలు చైతన్యం ప్రదర్శిస్తే రాజకీయ పార్టీలు వారి చుట్టూ తిరుగుతాయి. నీతిమంతమైన అభ్యర్థులను ఎంపిక చేస్తాయి. సుపరిపాలన ఇంటి ముంగిటకు వస్తుంది.

# అయోధ్య చుట్టూ బిజెపి ప్రదక్షిణలు!

**అయోధ్య (ఉత్తరప్రదేశ్):** మతాలు, ప్రాంతాలుగా ప్రజలను విభజించి, మనుషుల మధ్య విభేదాలను సృష్టించి, రెచ్చగొట్టడం బిజెపి లక్ష్యంగా కనిపిస్తున్నది. అయోధ్యలో రామమందిర నిర్మాణానికి ముందు, ఆ తర్వాత కూడా మతాన్ని అడ్డుపెట్టుకొని రాజకీయాలు చేయడం తప్ప బిజెపి సృష్టిస్తున్న అద్భుతాలు ఏవీ లేవు. అందుకే, ఈసారి కూడా అయోధ్య రామమందిరాన్నే ప్రచార అస్త్రంగా ఎంచుకుంది. దాని చుట్టూనే రాజకీయ ప్రదక్షిణలు చేస్తున్నది. 'ది వైర్' కథనం ప్రకారం, ఓటర్లను ప్రలోభపెట్టడానికి మతాన్ని వినియోగించుకుంటున్నది. అయోధ్య అనగానే రాముడి జన్మస్థలం అని కాకుండా, 1993లో బాబ్రీ మసీదు కూల్చివేత, అంతకు ముందు చోటు చేసుకున్న భయంకరమైన హింస మాత్రమే ముందుగా గుర్తుకొస్తాయి. వివాదాస్పద భూమిని రామమందిరానికి కేటాయించినప్పుడే, సుప్రీం కోర్టు ఆదేశాలతో అక్కడికి సుమారు 25 కిలోమీటర్ల దూరంలోని ధన్నీపూర్‌లో మసీదు నిర్మానానికి స్థలాన్ని ఖాయం చేశారు. కానీ, అక్కడ మసీదు నిర్మాణం ఇంకా ప్రారంభం కాలేదు. అందుకు కారకులు ఎవరన్నది బహిరంగ రహస్యం. మధ్యప్రదేశ్‌లోని ఖర్గోన్, ధర్ జిల్లాల్లో జరిగిన ర్యాలీల్లో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ.. రామజన్మ భూమి.. బాబ్రీ మసీదు టైటిల్ వివాదం కేసుపై సుప్రీంకోర్టు 2019లో ఇచ్చిన తీర్పును కాంగ్రెస్ రద్దు చేయకుండా ఉండాలంటే, బిజెపికి కనీసం 400 సీట్లను అందించాలని ప్రజలకు సూచించారు. నిర్మాణం పూర్తికాకముందే, హడావుడిగా విగ్రహ ప్రతిష్ట జరిపించిన మోదీ, అక్కడి దేవాలయం చుట్టూ హిందూ ఓటర్లను ర్యాలీకి రప్పించడం ద్వారా వారిని ప్రలోభపెట్టే ప్రయత్నం చేశారన్నది ప్రతిపక్షాల ఆరోపణ. అయోధ్య లోక్‌సభ నియోజకవర్గానికి ఈనెల 20న (సోమవారం) పోలింగ్ జరిగింది. కానీ, అయోధ్య పేరును మాత్రం మోదీ వాడుకుంటూనే ఉన్నారు. అంతకు ముందు ఆ ప్రాంతమంతా జైలులా ఉండేదని, చుట్టూ బ్యారికేడ్లు ఉండేవని మోదీ భక్త జనం ప్రచారం చేస్తునే ఉన్నారు. ఇప్పుడు అంతా సజావుగా సాగుతున్నది, అయోధ్య భూమిని దక్కించుకోవడం, గుడి కట్టడం అనే రెండు గొప్ప కార్యాలను సమర్థంగా నిర్వహించిన ఘనత మోదీకి మాత్రమే దక్కుతుందని ఆయన మద్దతుదారుల వాదన. బాబ్రీ మసీదు వివాదంలో వాదిగానీ, ప్రతివాదిగానీ బిజెపి కాదు. సుప్రీం కోర్టు విలక్షణమైన తీర్పును వెల్లడించకపోతే అసలు ఆ వివాదానికి తెరపడేదే కాదు. కానీ, సుప్రీం కోర్టుతో మోదీయే తీర్పు ఇప్పించిన రీతిలో భజన చేస్తున్నారు. ఇటీవల ఉత్తరప్రదేశ్‌లోని బారాబంకిలో జరిగిన ఒక ఎన్నికల ర్యాలీలో పాల్గొన్న ప్రధాని ప్రసంగిస్తూ, కాంగ్రెస్, సమాజ్‌వాది పార్టీ అధికారంలోకి వస్తే, అయోధ్యలోని రామ మందిరాన్ని బుల్డోజర్లతో బద్దలు కొడతారని వ్యాఖ్యానించారు. రాం లల్లాను తిరిగి డేరాలోకి పంపుతారని ఆరోపించారు. అంతేగాక, బుల్డోజర్లను ఎక్కడ ఉపయోగించుకోవాలో యుపి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నుంచి పాఠాలు నేర్చుకోవాలని అంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. బిజెపి తన రాజకీయ ప్రయోజనాలకు అయోధ్య రామ మందిరాన్ని ఒక అస్త్రంగా తీసుకురావడం కొన్ని దశాబ్దాలుగా కొనసాగుతునే ఉంది. బిజెపి దీర్ఘకాల ఎన్నికల వాగ్దానం.. ఆర్‌ఎస్‌ఎస సుదీర్ఘ రాజకీయ ప్రాజెక్టు ఒక్కటే. అదే అయోధ్యలో రామ మందిర నిర్మాణం. భారత ఎన్నికల కమిషన్ (ఇసిఐ) ప్రకటించిన మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ (ఎంసిసి/ ప్రవర్తనా నియమావళి) ప్రకారం ఓట్లను పొందడం కోసం కులం లేదా మతపరమైన భావాలను వ్యాప్తి చేయకూడదు. వాటి ఆధారంగా ప్రజలను ప్రభావితం చేసేందుకు ప్రయత్నించకూడదు. కానీ, ఎన్నికల ప్రసంగాలలో మతాన్ని ఉపయోగించడం మోదీకి లేదా బిజెపికి కొత్త కాదు. ప్రజాప్రాతినిధ్య చట్టం, 1951 ప్రకారం, ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించిన వారిపై సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకోవచ్చు. వారి అభ్యర్థిత్వాన్ని లేదా సభ్యత్వాన్ని



రద్దు చేయవచ్చు. మత విద్వేషాలు రెచ్చగొట్టే ప్రసంగాలపై ఇసిఐ ఇప్పటివరకూ చెప్పుకోదగిన చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తున్నది. అయోధ్యలో రామ మందిరం కేవలం బిజెపి వల్లే వచ్చిందని, కాబట్టి, ఎన్నికల సమయంలో ఆ విషయాన్ని ప్రస్తావిస్తూ, ఓట్లు అడగడంలో తప్పులేదని వాదిస్తున్న మోదీ భక్తాగ్రేసరులు కూడా ఉన్నారు. అయోధ్యలో ఆలయ నిర్మాణం వల్ల ఎంతో మందికి ఉపాధి లభించిందని, ఈ ప్రాంతం మొత్తం అభివృద్ధి చెందిందని వారు వాదిస్తున్నారు. రాయ్‌బరేలీ, అమేథీ నియోజకవర్గాలు దశాబ్దాలుగా వెనుకబడే ఉన్నాయని, అవి గ్రామాలుగానే మిగిలిపోతున్నాయని వ్యాఖ్యానిస్తున్నారు. అయితే, 2019 ఎన్నికల్లో అమేథీ నుంచి బిజెపి అభ్యర్థిగా స్మృతి ఇరానీ కేంద్ర మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నప్పటికీ, అక్కడ అభివృద్ధి ఎందుకు జరగలేదో మోదీ భజనపరులు చెప్పగలరా? రామ మందిరంపై గొప్పలు చెప్తున్న కేంద్రంగానీ, యుపి ప్రభుత్వంగానీ, మసీదు కోసం మంజూరైన స్థలంలో ఇంకా నిర్మాణాలు ఎందుకు మొదలు కాలేదన్నది ప్రశ్న. మసీదు నిర్మాణ బాధ్యతలు తీసుకున్న ఇండో-ఇస్లామిక్ కల్చరల్ ఫౌండేషన్ (ఐఐసిఎఫ్) మ్యాప్‌ను సిద్ధం చేసేందుకు కసరత్తు చేస్తున్నదని అక్కడ ఓ పోస్టర్ దర్శనమిస్తున్నది. అంతేతప్ప, మసీదు నిర్మాణం గురించి ఏ ఒక్క విషయం బయటకు రావడం లేదు. ఐఐసిఎఫ్‌ను నిధులు కొరత వెంటాడుతున్నదని సమాచారం. మసీదుకు శంకుస్థాపన జరినప్పటికీ, నిర్మాణ పనులు మొదలే కాలేదు. అయోధ్యలో ఆలయ నిర్మాణం జరిగిన సమాచారం తెలుసుకొని, దానితోపాటే మసీదు కూడా పూర్తయిందని అనుకునే వారు చాలా మంది ఉన్నారు. ఉత్తరాఖండ్, బెంగాల్ నుంచి ఎంతో మంది మసీదును చూడడానికి అయోధ్యకు వచ్చి, దిగాలుగా వెళ్లిపోవడాన్ని కూడా 'ది వైర్' గమనించింది. మసీదు పనులు మొదలైతే ఎంతో మందికి ఉపాధి లభిస్తుంది. మసీదు పూర్తయితే, స్థానికులు లాభపడతారు. కానీ, పనులే ప్రారంభం కాలేదు. చాలా మంది కొన్ని నెలలుగా ఉపాధి లేక అల్లాడుతున్నారు. పెరుగుతున్న ధరలతో రోజులు దొర్లించడానికి కష్టపడుతున్నారు. అయోధ్య రామమందిర నిర్మాణం నేపథ్యంలో కొంత మంది నివాసితుల నుంచి భూసేకరణ జరిపారు. కానీ, వారికి పరిహారంగానీ, పునరావృద్ధి పనులకు వెలకట్టి ఇచ్చిన దాఖలాలుగానీ లేదు. ఆలయ సముదాయానికి సుమారు కిలోమీటర్ దూరంలో, మల్టీ లెవల్ పార్కింగ్ కోసం మూడు అంతస్తుల బహుళస్థాయి భవన సముదాయాన్ని కట్టారు. ఆ ప్రాంత నివాసితులను 2021లో తరలించి, ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న కాన్షీరామ్ కాలనీకి తరలించారు. నిజానికి ఈ కాలనీలో ఇళ్లను బహుజన సమాజ్ పార్టీ (బిఎస్‌పి) అధినేత్రి మాయావతి యుపి ముఖ్యమంత్రిగా ఉన్న రోజుల్లో ప్రారంభించారు. కానీ, ఇప్పటికీ ఆ ప్రాజెక్టు పూర్తికాలేదు. గత ప్రభుత్వం మొదలు పెట్టిన ప్రాజెక్టును పూర్తిచేయకపోగా, నివాసితులను అక్కడికి తరలించడంలో ఆంతర్యం ఏమిటో 'డబుల్ ఇంజిన్' (కేంద్ర, రాష్ట్ర) ప్రభుత్వాలే చెప్పాలి. తమకు ఇళ్లను ఇస్తున్నట్టు ధ్రువీకరించే పత్రాలు కూడా అందచేయలేదని బాధితులు అంటున్నారు. అయోధ్యలో రామమందిర నిర్మాణ పనులు అత్యంత వేగంగా జరగ్గా, అభివృద్ధి పనుల కోసం కొంత మందిని బలవంతంగా తరలిం చారు. సమాచారం ఇచ్చిన ఒకటిరెండు రోజుల్లోనూ బుల్డోజర్లు అక్కడికి చేరుకున్నాయని బాధితులు వాపోతున్నారు. కాన్షీరామ్ కాలనీలో ఇళ్లు ఇస్తామని, వటిపై యాజమాన్య హక్కులతో కూడిన పత్రాలు కూడా అందచేస్తామని అధికారులు నమ్మబలికారని 'ది వైర్'తో చెప్పారు. కానీ, ఇంటి జాడలేదు. పత్రాల ఊసు లేదు. ఉన్న స్థలాలను కోల్పోయి ఎన్నో కుటుంబాలు వీధినపడ్డాయి. ఆలయ సమీపంలో ఉంటే, ఏదో ఒక ఉపాధి లభించేది. కానీ, ఆరు కిలోమీటర్ల దూరానికి వెళ్లి, కొత్త ప్రాంతంలో ఉపాధి లేక కష్టాలు పడుతున్నారు. మల్టీలెవల్ పార్కింగ్ కోసం తరలించిన 36 కుటుంబాల పరిస్థితి ఇది. అయోధ్య ఆలయ నిర్మాణం, అభివృద్ధి పనుల నేపథ్యంలో సమీప ప్రాంతాలలో జరిగిన భూసేకరణలో సర్వ స్వం కోల్పోయి వీధిన పడిన కుటుంబాలు ఎన్నో ఉన్నాయి. కాన్షీరామ్ కాలనీలో ప్రాజెక్టు పూర్తికాకపోవడంతో, చాలా కుటుంబాలకు కనీసం మరుగుదొడ్లు కూడా లేదు. 'స్వచ్ఛ భారత్ అభియాన్' పేరుతో, మరుగు దొడ్ల అవసరాన్ని విస్తృతంగా ప్రచారం చేసిన బిజెపి, అయోధ్యలో ఆ పథకాన్ని ఎందుకు అమలు చేయడందో అర్థం కాదు. బిజెపికి రాజకీయ ప్రయోజనాల కోసం అయోధ్య కావాలి. ఓట్ల కోసం అయోధ్య వాడుకోవాలి. హిందువుల ఓట్లను పోలరైజ్ చేయడానికి అయోధ్య కావాలి. ఒక్క మాటలో చెప్పాలంటే, కొన్ని దశాబ్దాలుగా అయోధ్యనే నమ్ముకొని, అయోధ్యే శ్వాసగా బిజెపి మనుగడ సాగిస్తున్నది. కానీ, అయోధ్యలో బాధితుల గోడు ఆ పార్టీకి వినిపించదు. వారు పడుతున్న కష్టాలు కనిపించవు. అయోధ్యా రాముడి జపం సొంత ప్రయోజనాలకే తప్ప, సమాజ వికాసానికి కాదని బిజెపి తీరు చెప్పకనే చెప్తున్నది. ఆ పార్టీకి అయోధ్యలో గెలవకపోతే పరువు పోతుంది. ఏళ్లకు ఏళ్లు అయోధ్యపై భారం వేసి, దేశ ప్రజలను ప్రభావితం చేయడంలో సఫలమైన బిజెపి వరుసగా రెండు పర్యాయాలు అధికారంలోకి వచ్చింది. ఇప్పుడు ప్రజల నుంచి వ్యతిరేకత తప్పడం లేదు. అసంతృప్తి సెగ తగులుతున్నది. అందుకే మరోసారి అయోధ్యపై భారం వేసి లోక్‌సభ ఎన్నికల బరిలోకి దిగింది. 400 సీట్లు అంటూ హడావుడి చేస్తున్న బిజెపికి అయోధ్య నియోజకవర్గం అత్యంత కీలకం. కానీ, స్థానిక ప్రజలు అనవసరం. రాజకీయ నాయకులు కావచ్చు.. ప్రాంతాలు కావచ్చు.. అక్కర తీరిన తర్వాత దూరంగా విసిరికొట్టడం బిజెపికి అలవాటే. మోదీ బృందం అదే సూత్రాన్ని పాటిస్తున్నది. అర్థం చేసుకోవాల్సింది ప్రజలే.

(ది వైర్ సౌజన్యంతో)

# అకాల వర్షాలు.. భారీ నష్టాలు..





ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాలను అకాల వర్షాలు ముంచెత్తుతున్నాయి. భారీగా ప్రాణ, ఆస్తి నష్టం తప్పడం లేదు. వరద బీభత్సాలతో కెన్యా ఇప్పుడు వార్తల్లో ఉంది. తూర్పు ఆఫ్రికాలో పడుతున్న భారీ వర్షాలు, తత్ఫలితంగా సంభవిస్తున్న వరదలు కెన్యా, సోమాలియా, బురుండి, టాంజానియా తదితర దేశాలపై ప్రభావం చూపుతున్నాయి. మార్చి నుండి మే వరకు దీర్ఘ వర్షాకాలం కొనసాగడమే ఈ పరిస్థితి కారణమని అంటున్నారు. అదే విధంగా పర్యావరణ మార్పులు కూడా సమస్య తీవ్రతను పెంచుతున్నాయని స్పష్టం చేస్తున్నారు. గత ఏడాది వర్షాకాలం నిడివి తక్కువగా ఉన్నప్పటికీ, కెన్యాలో వరదలు సంభవించాయి. ఈసారి ఎక్కువ కాలం కొనసాగుతున్న నేపథ్యంలో, భారీ వార్షలు, వరదలు తప్పడం లేదు. నైరోబీ తదితర ప్రాంతాల్లో వరదలు అసాధారణమేమీ కాదు. ఎల్ నినో ప్రభావంతో భారీ వర్షాలు, వరదలు సంభవిస్తునే ఉంటాయి. అయితే, ఈసారి సుదీర్ఘ వర్షాకాలం కారణంగా, వీటి తీవ్రత మరింత ఎక్కువగా ఉంది. ఇలావుంటే, హిందూ మహాసముద్రం ఉష్ణోగ్రతల వ్యత్యాసాలు కూడా భారీ వర్షాలకు కారణం. భూమధ్యరేఖ తూర్పు హిందూ మహాసముద్రంలో సాధారణం కంటే ఎక్కువ సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు, పశ్చిమ భూమధ్య రేఖ హిందూ మహాసముద్రంలో సాధారణం కంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదుయ్యాయి. ఏప్రిల్ ముగింపులో సానుకూల పరిస్థితులు కనిపించాయి. కానీ, ఆ తర్వాత వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో కెన్యా భారీ వర్షాలతో అతాలాకుతలమైంది. వరుసగా ఐదు పర్యాయాలు వరదలు ముంచెత్తాయి. దేశ స్థూల జాతీయోత్పత్తి (జిడిపి)లో కనీసం 5 శాతం వర్షాలు, వరదల కారణంగా నష్టపోయినట్టు అధికారులు ప్రకటించారు. అక్కడ సగటున ప్రతి ఏటా కనీసం 2.2 శాతం విలువైన ఆస్తి నష్టం జరుగుతున్నది. ఈ పరిస్థితులు ప్రజలకు, ముఖ్యంగా అట్టడుగు వర్గాలకు సమస్యలు సృష్టిస్తాయి. పేదలు, దివ్యాంగులు, వృద్ధులు సురక్షిత ప్రదేశాలకు వెళ్లలేని దుస్థితి. సాహసించి, అక్కడే ఉంటే, వరదల వల్ల ఏం జరుగుతుందోనన్న భయం వారిని వెంటాడుతున్నది. ఇలావుంటే, వర్షాల కారణంగా వివిధ రకాలైన అంటు వ్యాధులు కెన్యాలో వ్యాపిస్తున్నాయి. కలరా వంటి నీటి ద్వారా సంక్రమించే వ్యాధుల ప్రమాదాన్ని పెంచాయి. ఇప్పటికే వందలాది మంది మృతి చెందారు. వేలాదిమంది స్థానభ్రంశమయ్యారు. వాతావరణ పరిరక్షణ దిశగా అంతర్జాతీయ సమాజం సరైన చర్యలు తీసుకోకపోతే, కెన్యా ఎదుర్కొంటున్న దుస్థితి మిగతా దేశాలకూ తప్పదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కాలుష్యాన్ని ఎంత తగ్గిస్తే భవిష్యత్ తరాలకు అంత మేలు.

## గోపి రోదసి ప్రయాణం హర్షణీయం

లేఖలు

అంతరిక్షంలోకి వెళ్ళిన తొలి భారతీయ పర్యాటకుడిగా మన తెలుగువాడు గోపిచంద్ తోటకూర రోదసి ప్రయాణం విజయవంతం కావడం యావత్ మన దేశ యువతకు గర్వకారణం, స్ఫూర్తిదాయకం. మన దేశపు భవిష్యత్, అభివృద్ధి మనం చేసే స్పేస్ ప్రయోగాలపై ఆధారపడి వుందన్నది నిజం. ఇస్రో, డిఆర్‌డిఓ, బార్క్ వంటి మన దేశ సంస్థలు మరియు మన ఇంజనీర్లు, శాస్త్రజ్ఞులు ఆ దిశగా చాలా శ్రమిస్తున్నారు. భవిష్యత్లో మన చేసే ప్రయోగాలపు పరికరాలన్ని మనం తయారు చేసేలా ప్రభుత్వాలు ప్రోత్సహించాలి. కేవలం మన దేశపు పౌరసత్వం మాత్రమే కల్గిన మన విఖ్యాత శాస్త్రవేత్తలకు సరైన ప్రోత్సాహం ఇవ్వాలి. సి.వి.రామన్, విక్రమ్ సారాభాయ్, హోం జహంగీర్ బాబా, అబ్దుల్ కలాం, కల్పనా చావ్లా, టెస్సీ థామస్ వంటి శాస్త్రవేత్త ల స్ఫూర్తితో మనం శాస్త్ర సాంకేతిక రంగాల్లో ప్రపంచదేశాలను శాసించే స్థాయిలో వుంటేనే ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం కల్గిన దేశంగా మన భారతదేశం ఎదగగలదు.

**పి.అరుణ్ కుమార్**
నాగర్ కర్నూల్ 9394749536

## న్యాయవాదులు సిపిఎ కిందకు వస్తారా?

వినియోగదారుల సక్కులను కాపాడడానికి పలు చట్టాలు ఉన్నాయి. ప్రధానమైనది కమ్యూమర్స్ ప్రొటెక్షన్ యాక్ట్ (సిపిఎ). వినియోగదారులు ఉపయోగించి వివిధ రకాల వస్తుఓవలను ఈ జాబితాలో చేర్చారు. అయితే, నాయవాదులు తమకు సంతృప్తికరమైన సేవలు అందించలేదని పేర్కొంటూ ఎవరైనా సిపిఎ కింద చర్య తీసుకోమని కోరే అవకాశం ఉందా? అంటే లేదనే సమాధానం చెప్పాలి. ఒక న్యాయవాది సేవలను ఇతర వ్యాపారం లేదా వాణిజ్యం కంటే భిన్నంగా చట్టం పరిగణిస్తుంది. వాణిజ్య పరమైన ఆసక్తిని సూచించే 'వ్యాపారం', 'వాణిజ్యం' అనే పదాల మధ్య వ్యత్యాసం, అభ్యాసం లేదా విజ్ఞాన శాస్త్ర ప్రత్యేక శాఖను కలిగి ఉన్న 'వృత్తి' అనే పదం చాలా ముఖ్యమైనది. న్యాయవాది చర్యలు క్లయింట్‌కు మాత్రమే కాకుండా మొత్తం న్యాయ వ్యవస్థను ప్రభావితం చేస్తాయి. 'సేవ' అనే పదాన్ని సిపిఎలో చాలా విస్తృతంగా నిర్వహించారు. కానీ ఉచిత సేవలు, వ్యక్తిగత సేవకు సంబంధించిన ఒప్పందాలను మినహాయించారు. న్యాయవాది, క్లయింట్ వ్యక్తిగత సేవా ఒప్పందంలోకి వస్తారు కాబట్టి సిపిఎ కింద సవాలు చేయడం సాధ్యం కాదు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వర్సెస్ వి. శాంత కేసు (1995)లో మెడికల్ ప్రాక్టీషనర్ల సేవలు సిపిఎ పరిధిలోకి వస్తాయని కోర్టు పేర్కొన్నది. అయితే, న్యాయవాద వృత్తి తప్పనిసరిగా ఇతర వ్యాపారాలు లేదా వ్యాపారాల నుండి వేరు చేయాలని, ఇతర వృత్తులలో కూడా, న్యాయవాదులకు ప్రత్యేక స్థానం ఉందని పేర్కొంటూ పిటిషన్లు దాఖలయ్యాయి. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రూల్స్ , 1961 ప్రకారం న్యాయవాదులు కోర్టుకు, వారి ప్రత్యర్థికి విధులను కలిగి ఉన్నందున న్యాయవాదులు రుసుము చెల్లించిన తర్వాత కూడా తమ క్లయింట్లకు 'మౌత్ పీస్' గా వ్యవహరించలేరని అందులో పిటిషనర్లు స్పష్టం చేశారు. కాగా, అనంతరం వచ్చిన సిపిఎలో పలు అంశాలను విస్తృతంగా చర్చించారు. న్యాయస్థానం పట్ల న్యాయవాది విధిలో భాగంగా, వారు తప్పనిసరిగా అన్యాయమైన మార్గాల కోసం పట్టుబట్టే ఖాతాదారులకు ప్రాతినిధ్యం వహించడానికి నిరాకరించాల్సిన విషయాన్ని గుర్తించారు. చట్టపరమైన సమస్యల సంక్లిష్టత కారణంగా న్యాయవాదులకు కేసు ఫలితంపై నియంత్రణ ఉండదని, ఇందులో క్లిష్టమైన శాసనాలు, కేసు



చట్టాలు ఉంటాయి కాబట్టి తరచుగా ఖచ్చితమైన సమాధానం ఉండదని వ్యాఖ్యానించారు. అందుకే పిసిఎ పరిధి నుంచి న్యాయవాదులను తప్పించారు. 2019లో వచ్చిన సిపిఎ చట్టం అంతకు ముందు ఉన్న 1986 చట్టంతో పోలిస్తే భిన్నంగానూ, విస్తృతంగానూ ఉంది. అందులో చేసిన విప్లవాత్మక మార్పుల్లో ఒక భాగమే న్యాయవాదులకు మినహాయింపు. అదే విధంగా, ఆ సమయంలోనే ఏర్పాటైన సెంట్రల్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ (సిసిపిఎ) అనేది వినియోగదారుల హక్కులను కాపాడడంతోపాటు వివిధ సేవల్లో ఉన్న వారి బాధ్యతలను పరిశీలించి, పరిమితులను విధించడం కూడా లక్ష్యంగా ఏర్పడింది. ఇలావుంటే, మధ్యవర్తిత్వం ప్రత్యామ్నాయ వివాద పరిష్కార విధానాన్ని కూడా ప్రోత్సహించే రీతిలో సమగ్ర చట్టం రూపొందింది. మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కారంపై అప్పీల్ ఉండదు. వినియోగదారుల వివాద పరిష్కార ప్రక్రియను సరళీకృతం చేయడానికే ఈ అవకాశాన్ని కల్పించారు. రాష్ట్ర మరియు జిల్లా కమిషన్లు తమ స్వంత ఆదేశాలను సమీక్షించుకునే అధికారం ఉంటుంది.

## జీవ వైవిధ్యాన్ని నిర్లక్ష్యం చేస్తే

# భారీ మూల్యమే!

**(22 మే 'అంతర్జాతీయ జీవ వైవిధ్య దినం' సందర్భంగా)**

కొన్ని బిలియన్ ఏండ్లకు పూర్వమే ఏర్పడిన భూగోళంపై నివసిస్తున్న 8 మిలియన్ల జీవరాసుల (వృక్షాలు, జంతువులు, ఫంగీ, బ్యాక్టీరియా, ఇతర సుక్ష్మ జీవులు) మనుగడకు భంగం కలుగకుండా పరిరక్షించుకుంటూ, పర్యావరణ (అడవులు, ఎడారులు, చిత్తడి నేలలు, పర్వతాలు, సరస్సులు, నదులు, చెరువులు, వ్యవసాయ భూములు) సమతుల్యతను సమర్థిస్తూ, మానవ మనుగడ సాగించడమే జీవ వైవిధ్యంగా అర్థం చేసుకోవాలి. సుస్థిర వ్యవసాయం, ఎడారీకరణ, నేల క్షీణత, మహాసముద్రాలు, గిరిజన జాతులు, ఆహార భద్రత, కరువులు, నీరు లభ్యత, పారిశుద్ధ్యం, ఆరోగ్యం, అంటువ్యాధులు, జీవనోపాధి, సుస్థిరాభివృద్ధి, శక్తి వనరులు, శాస్త్రసాంకేతికత, సృజనశీలత, విజ్ఞాన వినిమయం, పట్టణీకరణ, రవాణా, వాతావరణ మార్పులు, విపత్తు నిర్వహణ, అడవులు, పేదరికం లాంటి అనేక అంశాలు జీవ వైవిధ్యం మీదనే ఆధారపడి ఉంటాయి. ఐరాస నిర్దేశించిన 'సుస్థిర అభివృద్ధి లక్ష్యాల'లో జీవ వైవిధ్యానికి పెద్దపీట వేయడం జరిగింది. 1993 ఐరాస జనరల్ అసెంబ్లీ తీర్మానం ప్రకారం జీవ వైవిధ్య ప్రాధాన్యతను గుర్తించి ప్రతి ఏటా 29 డిసెంబర్ రోజున ప్రత్యేక అవగాహన కల్పించేందుకు 'అంతర్జాతీయ జీవ వైవిధ్య దినం' జరుపుకోవడం జరిగింది. 22 మే 1992 రోజున జరిగిన 'రియో ఎర్త్ సమ్మిట్'కు గుర్తుగా 22 మే రోజున జరుపుకోవాలని 20 డిసెంబర్ 2000 రోజున ఐరాస మరో నిర్ణయం తీసుకోవడం జరిగింది. అంతర్జాతీయ జీవ వైవిధ్య దినం 2024 నినాదంగా 'జీవవైవిధ్య పరిరక్షణ ప్రణాళికలో భాగం అవుదాం(బి పార్ట్ ఆఫ్ ది ప్లాన్)' అనే అంశాన్ని తీసుకోవడం జరిగింది. జీవ వైవిధ్యానికి విఘాతం కలగడంతో మానవజాతి ప్రతి 4 మాసాలకు ఒక నూతన కోవిడ్19 లాంటి మహా విపత్తు లేదా అంటువ్యాధికి లోనవడం జరుగుతున్నది. పర్యావరణ సమతుల్యత దెబ్బ తినడానికి కారణం మానవుడి అనాలోచిత, స్వార్థపూరిత చేష్టలే అని కళ్ళు తెరవాల్సిన సమయం ఆసన్నమైంది. జీవ వైవిధ్యానికి విఘాతం కలిగితే జరిగే అనేక అనర్థాలలో నేడు మనం అనుభవిస్తున్న మహమ్మారుల కల్లోలం కూడా ఒక ప్రధాన భాగమని గుర్తుంచుకోవాలి. జీవ వనరులను, ప్రపంచ జీవ వై ధ్యాన్ని పరిరక్షించడంతో భూత లం నివాసయోగ్యమైన సుందర నందన వనంలా మారుతుందని తెలుసుకోవాలి. ప్రకృతిలో ప్రధాన భాగాలైన వృక్ష సంపద, జంతు జాతులు, పలు రకాలైన సూక్ష్మ జీవులు, జన్యు వైవిధ్యంలాంటివి పర్యావరణ సురక్షకు సోపానాలుగానే కాకుండా జీవ వైవిధ్య సౌభాగ్యాలుగా కూడా దోహదపడతాయి. కాలానుగుణంగా మానవాళి ప్రమేయంతో జరుగుతున్న పర్యావరణ విధ్వంసంలో భాగంగా జీవ వైవిధ్యానికి తీవ్ర విఘాతం కలుగుతూనే ఉంది. భూమండలంపై 66 శాతం సము ద్రజలాలే ఉన్నాయని, మానవ అనాలోచిత కార్యాలతో సముద్ర జీవరాసుల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోందని గమనించాలి. ఇలాంటి పర్యావరణ విచ్ఛిన్న కార్యాల ద్వారా ఒక మిలియన్ జీవరాసులు అంతరించే దుస్థితి ఏర్పడటం విచారకరమే కాదు ప్రమాదకరం కూడా. ప్రపంచంలో 3 బిలియన్ల జీవులు జలాల్లో, 1.6 బిలియన్ జీవరాసులు అడవుల్లో మనుగడ సాగిస్తున్నాయి. సకల జీవుల మనుగడకు రక్షణ కలగాలన్నా, కరోనా లాంటి మహమ్మారుల ద్వారా సోకే అంటువ్యాధులను నియంత్రించాలన్నా జీవ వైవిధ్య పరిరక్షణ చర్యలు విధిగా జరగాల్సిందే. జీవ వైవిధ్యాన్ని విచ్ఛిన్నం చేస్తే 70 శాతం వరకు జంతు సంబంధ జునోటిక్ వ్యాధులు ప్రభలుతాయని తెలుసుకోవాలి. ప్రకృతిలో సహజసిద్ధంగా మనుగడ సాగిస్తున్న వృక్ష, జంతుజాల సమతుల్యతకు భంగం కలిగించే ఎలాంటి చర్యలు చేయరాదు. మానవ అకారణ, అనాలోచిత క్రియలతో కొన్ని జీవరాసులు అంతరించిన యెడల వాటిపై ఆధారపడే వ్యాధికారక సూక్ష్మ క్రిములు మనవాళికి సోకడంతో భయంకర అంటురోగాలు కలుగుతాయి. జీవ వైవిధ్యం విచ్ఛిన్నమైతే వాతావరణ ప్రతికూల మార్పులు కూడా కలుగుతాయి. ప్రపంచవ్యాప్తంగా ప్రతి గంటకు కనీసం 3 జీవ జాతులు, రోజుకు 100 150, ఏడాదికి 15,000 18,000 జీవ జాతులు అంతరిస్తున్నాయని తేలింది. బీడు భూములు పెరగడంతో 74 రకాల కప్ప జాతులు, ధృవాల వద్ద మంచు కరగడంతో 22 శాతం పోలార్ బేర్‌లు, అంటార్కిటికాలో ఉష్ణోగ్రతలు పెరగడంతో పెంగ్విన్‌లు, నెథర్‌లాండ్‌లో వాతావరణ మార్పులతో ఫ్లైకాచర్ పక్షులు లాంటి అనేక జీవ జాతులు అంతరించే సమయం ఆసన్నమైందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. యునెస్కో సూచనల ప్రకారం మానవ జాతికి, సహజ ప్రకృతికి సంబంధాన్ని స్థాపించడానికి పర్యావరణ పరిరక్షణ జరగాలి. పర్యావరణ సమతుల్యతకు బాటలు వేయడం, జీవ వైవిధ్య పరిరక్షణకు యువశక్తిని వినియోగించడం జరగాలి. ఈ క్రమంలో 1,121 ప్రపంచ వారసత్వ క్షేత్రాలు (వరల్డ్ హెరిటేజ్ సైట్స్), 714 జీవావరణ నిల్వలు (బయోస్పియర్ రిజర్వ్స్), 161 గ్లోబల్ జియో పార్కులు ఏర్పాటు చేస్తూ, 6 శాతం నేలను పరిరక్షించడం జరుగుతున్నది. అడవులను నరికివేయడం, వణ్యప్రాణుల్ని వేటాడడం, శిలాజ ఇంధనాలను వినియోగించడం, గాలి/నేల/నీటి కాలుష్యాలకు కారణం కావడం, ప్లాస్టిక్‌ను వినియోగించడం, విచక్షణారహితంగా రసాయన ఎరువులు/పురుగు మందులు వాడడం, ఆహారం/నీటిని దుర్వినియోగం చేయడం లాంటి అనేక మానవ క్రియలు జీవ వైవిధ్యానికి ప్రతిబంధకాలని తెలుసుకోవాలి. ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ, సకల జీవరాశులను రక్షించుకుంటూ, జీవ వైవిధ్యాన్ని కాపాడుకుందాం. జీవ వైవిధ్య సంపదలతో విరబూసే ధరణి మానవ నివాసానికి, భూగ్రహ స్థిరత్వానికి పునాది అవుతుంది. జీవ వైవిధ్య విఘాత సృష్టి కర్త మనిషే కాబట్టి మానవుడే దాని పరిరక్షణకు సమాధానం కూడా కావాలి. సమస్యకు కారణమైన వారే సమాధానం కూడా అందించాలి. ప్రకృతిలోని జీవులు అంతరించే దుస్థితి ఏర్పడితే, తిరిగి పూర్వపు స్థితికి రావడం వీలుకాదు. పరిస్థితులు మరింత చేయి దాటక పూర్వమే జీవ వైవిధ్యాన్ని పరిరక్షించే సత్కార్యాలు చేయటానికి విశ్వ మానవాళి, ముఖ్యంగా యువత నడుం బిగించాలి. ఇలాగే మరి కొంత సమయం నిర్లక్ష్యం చేస్తే ప్రపంచ మానవాళి భారీ మూల్యమే చెల్లించాల్సి ఉంటుందని తెలుసుకోవాలి.



## ఐటిఐ దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : ఐటిఐ 2024/25 విద్యా సంవత్సరానికి ఈనెల 16తేదీ నుండి జూన్ 10 తేదీ వరకు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటిఐ కళాశాలల్లో విద్యార్థులు చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ ఐటిఐ న్యూ కళాశాల ప్రిన్సిపల్ ఎస్ గోపాల నాయక్ కోరారు. ఆసక్తి గల విద్యార్థులు https:iti telangana.gov.in వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

## కలెక్టరేట్‌లో ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్

ప్రజాపక్షం/ సూర్యాపేట : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు, సిబ్బంది తమ పోస్టల్ బ్యాలెట్ ఓటును వినియోగించుకునేందుకు కలెక్టరేట్‌లో ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్ వెంకట్రావ్ తెలిపారు. ఎన్నికల నిర్వహణ సందర్భంగా అధికారులు, సిబ్బందికి ఇచ్చే శిక్షణకు వచ్చే ఉద్యోగులు, సిబ్బంది ఏదేని ఒక గుర్తింపు కార్డును చూపించి పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈనెల 22 నుండి 24తేదీ వరకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## గురుకుల కళాశాలలో ఇంటర్ ప్రవేశాలు ప్రారంభం

ప్రజాపక్షం/నందికొండ : నాగార్జునసాగర్ మహాత్మా జ్యోతిబాపూలే వెనకబడిన తరగతుల గురుకుల కళాశాల లో జూనియర్ ఇంటర్ విద్యార్థుల ప్రవేశ ప్రక్రియ ప్రారంభమైందని ప్రిన్సిపల్ రజనీకాంత్ తెలిపారు.ఈ ఏడాది మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల విద్యాలయ సంస్థ ద్వారా నిర్వహించిన ప్రవేశపరీక్షలో ఉత్తీర్ణత సాధించి సీటు పొందిన విద్యార్థులు ఈనెల 30వ తేదీలోపు జాయిన్ అవ్వాలని ఎంపికైన విద్యార్థులు తమ ఎంపికకు సంబంధించిన పత్రాన్ని మీసేవ ద్వారా పొంది మిగతా ధ్రువీకరణ పత్రాలతో కళాశాలకు హాజరుకావాలని కోరారు అదేవిధంగా ఇటీవల నిర్వహించిన స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ కు తమ పాఠశాల నుంచి ఎనిమిది మంది విద్యార్థులు ఎంపికైనట్టు ఆయన తెలిపారు.

## ఘనంగా శ్రీధర్‌రెడ్డి జన్మదిన వేడుకలు



ప్రజాపక్షం/కొండమల్లేపల్లి : కాంగ్రెస్ నాయకులు, మండల అభివృద్ధి ప్రధాత, ఎంపిపి దూదిపాల రేఖ భర్త అయినటువంటి దూదిపాల శ్రీధర్‌రెడ్డి 56వ జన్మదిన వేడుకలు మంగళవారం మండల కేంద్రంలోని మన కార్యాలయం మనందరి కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీధర్‌రెడ్డికి పలువురు నాయకులు, మిత్రులు, అభిమానులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి, బోకేలు ఇచ్చి శాలువాలతో ఘనంగా సన్మానించి ఆయనతో కేక్ కట్‌చేయించారు. అనంతరం భోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి కాసర్ల వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఊట్కూరి వేమన్ రెడ్డి, జెడ్పిటిసి సలహాదారుడు పసునూరి యుగేందర్‌రెడ్డి, ఎంపిటిసి జగన్ నాయక్, రమావత్ రాణిరాజునాయక్, మాజీ ఉప సర్పంచ్‌లు గంధం సురేష్, మంగ్యానాయక్, తిరందాసు రవి, కైసర్ ఖాన్, వరికుప్పల శ్రీను, బూడిద మల్లేష్‌యాదవ్, మాడ్గుల యాదగిరి, బొడ్డుపల్లి శంకర్, బక్కులయ్య, , జితేందర్, టిజేఎస్ కిరణ్, మురళి, అనిల్, నరేందర్, సిద్దు, కొండమల్లేపల్లి ప్రెస్ వేల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## పెగడపల్లి మండల కేంద్రంలో పట్టపగలు చోరీ

ప్రజాపక్షం/పెగడపల్లి : జగిత్యాల జిల్లా పెగడపల్లి మండల కేంద్రంలో మంగళవారం మధ్యాహ్నం దొంగతనం జరిగింది. పెగడపల్లి బస్టాండు దగ్గరలో గల మండల కేంద్రానికి చెందిన తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆరె దశరథం, బిసి ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఆరె మహేందర్‌కు చెదిన ఇంటిలో మంగళవారం మధ్యాహ్నం గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. బాధిత కుటుంబీకులు ఉద్యం 10.45 గంటలకు ఇంటికి తాళాలు వేసి మల్యాల మండల కేంద్రంలోని ఎల్లమ్మ టెంపుల్ వద్దకు దర్శనానికి వెళ్లి తిరిగి మధ్యాహ్నం రెండు గంటలకు వరకు ఇంటికి చేరుకోగా వేసిన తాళాలు పగలగొట్టి ఉండడంతో గమనించిన బాధిత కుటుంబ మల్యాల సిఐకి, పెగడపల్లి ఎస్సైకి సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు గాడ్ స్క్వాడ్ బృందంతో వచ్చి తనిఖీలు నిర్వహించారు. రూ.1,56,000 నగదుతో పాటు ఒక్కో సెల్‌ఫోన్, ఒప్పో ఏ5ఎస్, రెండు తులాల వెండి మొలతాడు దొంగిలించినట్లు పోలీసులు గుర్తించారు. డాగ్ స్క్వాడ్‌తో విచారణ చేపట్టగా మండల కేంద్రంలోని బాధిత కుటుంబీకుల ఇంటి నుంచి నేరుగా వెళ్లి మండల కేంద్రంలోని వైన్స్ దగ్గర డాగ్ స్క్వాడ్ ఆగింది. ఈ దొంగతనంపై పోలీసులు ఆధారాలు సేకరించి విచారణ చేపట్టారు. దొంగలను పట్టుకునే పనిలో స్థానిక పోలీసులతో పాటు ఫింగర్ ప్రింట్ ఐటి కోర్ సిబ్బంది నిమగ్నమై ఉన్నారు.

## శాతవాహన యూనివర్సిటీ ఇంచార్జి విసిగా సురేంద్రమోహన్



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : కరీంనగర్‌లోని శాతవాహన యూనివర్సిటీ ఇంచార్జి వైస్ చాన్స్‌లర్‌గా సీనియర్ ఐఏఎస్ అధికారి సురేంద్ర మోహన్‌కు ప్రభుత్వం బాధ్యతలు అప్పజెప్పింది. రాష్ట్రంలోని పది విశ్వవిద్యాలయాలకు ఇంచార్జి వైస్ చాన్స్‌లర్లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఉన్న శాతవాహన యూనివర్సిటీకి ఉన్న వీసి సంకశాల మల్లేషం పదవీకాలం ఇప్పటికే పూర్తయ్యింది. దీంతో కొత్త వీసీలు నియమితులయ్యేంత వరకు ఎస్‌యు ఇంచార్జి విసిగా ఐఏఎస్ సురేంద్ర మోహన్ బాధ్యతల్లో కొనసాగనున్నారు.

## ప్రశ్నించే గొంతుకను గెలిపించాలి



ప్రజాపక్షం /నల్లగొండ-టౌన్ : పట్టభద్రుల ఎన్నికలు అంటే మేధావులు ఉద్యోగులు యువత ఎంతో పరిణితి తో సమాజ శ్రేయస్సు దృష్టిలో ఉంచుకొని అభ్యర్థి ని ఎన్నుకున్న చరిత్ర ఈ నల్లగొండకు ఉందని ఈ ఎన్నికలలో ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారిని గెలిపించుకోవాలని మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు.నల్లగొండ,వరంగల్,ఖమ్మం పట్టభద్రుల ఎంఎల్ సి ఎన్నకల ప్రచారం లో భాగంగా బిఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి తరుపున నల్లగొండ బార్ అసోసియేషన్ లో ఏర్పాటు చేసిన సమావేశం లో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్,నాగర్ కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్,మాజీ ఎంఎల్ఎ కంచర్ల భూపాల్ రెడ్డి,ఎంఎల్ సి అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి లతో కలసి పాల్గొన్నారు. ఈసందర్బంగా జగదీష్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో నల్లగొండ బార్ అసోసియేషన్ తనను ముందుండి నడిపించిందని తనకు తల్లి లాంటిదని అన్నారు.రాకేష్ రెడ్డి మాట్లాడుతూ నిరుద్యోగ యువత కు అండగా ఉంటానని 27 తేదీ నాడు జరిగే ఎన్నికలలో సీరియల్ 3వ నెంబర్ లో తన పేరు పక్కన మొదటి ప్రాధాన్యత ఓటు 1 అంకె వేసి గెలిపించాలని కోరారు.ఈ సమావేశం లో బార్ అసోసియేషన్ వైస్ ప్రసిడెంట్ శ్రీనివాస చక్రవర్తి,కార్యదర్శి లింగయ్య గౌడ్,సీనియర్ న్యాయవాదులుము నగాల నారాయణ రావు,లోడంగి గోవర్ధన్, జి వెంకటేశ్వర్లు. కే. జవహర్ జి. జవహర్,శంకరయ్య, మంద నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

# లింగనిర్ధారణ పరీక్షలు, అబార్షన్లు చేస్తే కఠిన చర్యలు

### జిల్లా కలెక్టర్ ఎస్ వెంకట్రావ్

ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : పుట్టబోయేది ఆడ, మగ బిడ్డ అని లింగ నిర్ధారణ పరీక్షలు చేసిన, అబార్షన్లు చేసిన చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటాని జిల్లా కలెక్టర్ ఎస్ వెంకట్రావ్ అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశంలో జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో గర్భధారణ పూర్వ, గర్భస్థ పిండ లింగ నిర్ధారణ ప్రక్రియ నిషేధ చట్టంపై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ లింగ నిర్ధారణ ప్రక్రియ నిషేధ చట్టంపై జిల్లాలో అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. వైద్య అధికారులే కాకుండా ఆర్‌డిఓలు వారు పరిధిలో నిర్వహిస్తున్న అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్లను విరివిగా తనిఖీలు చేయాలన్నారు. జిల్లా సమాఖ్య, మండల సమాఖ్య సభ్యులు, జిల్లా గ్రామీణాభివృద్ధి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సమన్వయంతో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. జిల్లా విద్యాధికారుల సహకారంతో పాఠశాలలు, జూనియర్, డిగ్రీ, వైద్య కళాశాలల్లో, కెజిబివి పాఠశాలల్లో విద్యార్థులకు చట్టం ప్రాధాన్యతపై ప్రచారా సామాగ్రి, కళాజాతలతో ప్రచారం చేయాలన్నారు. డివిజన్ స్థాయిలో ఆర్‌డిఓలు చట్టాన్ని అమలు చేయాలని చెప్పారు.

### లింగనిర్ధారణ చేస్తే చర్యలు తప్పవు

### జిల్లా ఎస్‌పి రాహుల్ హెగ్డే

చట్టానికి విరుద్ధంగా ఎవరైన లింగ నిర్ధారణ పరీక్షలు, అబార్షన్లు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాని జిల్లా ఎస్‌పి రాహుల్ హెగ్డే అన్నారు. ఆడ పిల్లలకు, స్త్రీలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై, చట్టాలపై ప్రజారం చేయాలన్నారు. పోలీసుల సహకారంతో గ్రామాల్లో ఆర్ఎంపిలకు అవగాహన కల్పిస్తామన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కోటాచలం మాట్లాడుతూ లింగనిర్ధారణ చట్టం అమలు, తీసుకుంటున్న చర్యలపై వివరించారు. జిల్లాలో ప్రతి వెయ్యి మంది బాలురులకు 907 మంది బాలికలు మాత్రమే ఉన్నారని చెప్పారు. ఈ పరిస్థితి ఆందోళన కలిగిస్తుందని, ఆడ పిల్లలని కనాలని, ఎదగనివ్వాలని, చదివించాలని కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బిఎస్ లత, డిఎఫ్ఓ సతీష్ కుమార్, ఆర్‌డిఓలు సూర్యనారాయణ, శ్రీనివాస్, జిల్లా విద్యాధికారి అశోక్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మసూద్ రాజు, ఇండియన్ రెడ్ క్రాస్ చైర్ పర్సన్ ఇరిగి కోటేశ్వరి, వైద్య ఆరోగ్యశాఖ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ పి వెంకటరమణ, డాక్టర్ జయ శ్యాంసుందర్, డాక్టర్ నాజియా, డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, జిల్లా మీడియా అధికారి అంజయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.




## ప్రైవేట్ సంస్థల విద్యావ్యాపారాన్ని అరికట్టాలి

### ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామారాపు వెంకటేష్



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : తెలంగాణ రాష్ట్రంలో ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యను వ్యాపారం చేస్తూ ఫీజుల పేరుతో లక్షలాది రూపాయలు దోచుకుంటున్నారని, సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రంలో ప్రైవేట్ విద్యాంస్థలు చేస్తున్న ఫీజుల దోపిడీ అరికట్టే విధంగా చర్యలు తీసుకుని ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామారపు వెంకటేష్ అన్నారు. ఎన్నికల హామీలో విద్యార్థులకు ఇచ్చిన హామీలను విద్యాసంవత్సరం ప్రారంభం కాగానే అమలు చేయాలని కోరారు. హుజురాబాద్, జమ్మికుంట పట్టణ కేంద్రంలో ఉన్న ప్రైవేట్ విద్యాసంస్థలను ఆయా మండలాల శాఖల అధికారులు తనిఖీలు చేసి ప్రభుత్వ నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని పర్మిషన్ లేకుండా నడుస్తున్న ప్రైవేట్ కార్పోరేట్ విద్యా సంస్థలను గుర్తించి సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేయాలని, ప్రైవేట్‌విద్యా సంస్థలు చేస్తున్న ఫీజుల దోపిడీ అరికట్టే విధంగా ఫీజుల నియంత్రణ చట్టాన్ని కఠినంగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగ బలోపేతానికి ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు సంక్షేమ హాస్టళ్లు, యూనివర్సిటీలలో మౌళిక వసతులు కల్పించి ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్, పోస్టుల భర్తీ చేసి ప్రభుత్వ విద్యాలయాలలో విద్య ప్రమాణాలు పెరిగేలా కాంగ్రెస్‌ప్రభుత్వం కృషి చేయాలని,కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో విద్యార్థులకు, యువకులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, విద్యార్థులకు ఇస్తామన్న ఎలక్ట్రిక్ స్కూటీలు, ల్యాప్ టాప్స్, మండలానికో ఇంటర్నేషనల్ పాఠశాలలను ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులకు ప్రభుత్వ విద్యను మరింత అందుబాటులోకి తీసుకురావాలని, ఫీజు ల పేరిట ప్రైవేట్ విద్యాసంస్థలు చేస్తున్న ఫీజుల దోపిడీని అరికట్టాలని, ప్రభుత్వం విద్యాశాఖ ఫీజులు నియంత్రణకు కఠిన చట్టాలు అమలు చేసి నిబంధనలు పాటించని విద్యాసంస్థలను సీజ్ చేయాలని, లేని పక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆద్వర్యంలోమండల విద్యాశాఖ అధికారుల కార్యాలయాలు ముట్టడిస్తామని వెంకటేష్ హెచ్చరించారు.

## కనిలాల్ మృతి బాధాకరం

### సిపిఐ మాజీ ఎంఎల్ఏ పల్లా



ప్రజాపక్షం/దేవరకొండ : దేవరకొండ మాజీ ఎంఎల్ఏ రమావత్ రవీంద్రకుమార్ తండ్రి కనిలాల్ మృతి బాధాకరం అని సిపిఐ జాతీయ సమితి సభ్యులు, మాజీ ఎంఎల్ఏ పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం కనిలాల్ దశ దిన కర్మ కార్యక్రమంలో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి, జిల్లా సమితి సభ్యులు తూం బుచ్చిరెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మైనోద్దీన్, రవీంద్రశర్మ, పల్లా కర్ణాకర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## సబ్సిడి ఎరువులు, విత్తనాలు అందించాలి : సిపిఐ

ప్రజాపక్షం/గుండాల : రైతులకు సబ్సిడితో ఎరువులు, విత్తనాలను ప్రభుత్వం అందజేయాలని సిపిఐ మండల కార్యదర్శి అనంతుల రామచంద్రయ్య ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ వానాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం రైతులకు సబ్సిడితో ఎరువులు, విత్తనాలు పంపిణి చేసినట్లయితే రైతులకు ఎంతో మేలు చేసినట్లు ఉంటుందని, వరి, పెసర్లు, కందులు, మినుములు, వేరుశనగ రైతులకు అవసరాన్ని బట్టి ఎక్కువ మొత్తంలో విత్తనాలు అందజేయాలని, బ్లాక్ మార్కెట్‌లో విత్తనాలు విక్రయించకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, రైతులకు నకిలి విత్తనాల బెడద లేకుండా చూడాలని ఆయన కోరారు. వర్షాలు మొదలైన తరుణంలో త్వరితగతిన రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులను సబ్సిడిపై అందించాలని ఆయన కోరారు.

## ఉచిత టీకాను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : తొలకరిలో పశువులకు అంటువ్యాధులు రాకుండా ఈనెల 22 నుండి 30వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా ఉచిత టీకాను అందించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్ వెంకట్రావ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని పశుపోషకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వేసవి నుండి పచ్చిగడ్డి కనిపించక ఆబగా ఎదురు చూసే పశువులకు తొలకరి వర్షానికి పెరిగే గడ్డి పిలకలు కనిపించగానే పెదాలకి అంది అందని గడ్డిని మట్టితో సహా పశువులు తినటంతో మట్టిలో ఉన్న బ్యాక్టిరియా, వైరస్ పశువుల శరీరంలో వెళ్లి విష పదార్థాలను విడుదల చేయడంతో గేదెలు ప్రాణాంతక గురకా వ్యాధి, గిత్తలు పెయ్యలతో జబ్బవాపు, గొర్రెలలో చిటుకు రోగం ప్రబలుతాయన్నారు. టీకాల పంపిణీని పశువైద్య అధికారులు, వైద్య సిబ్బంది విస్తృత ప్రచారం నిర్వహించి పశుపోషకులకు అవగాహన కల్పించాలన్నారు. రైతులు జిల్లాలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో వారం రోజులు అందించే టీకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## యథేచ్ఛగా భుముల కబ్జా : అధికారుల వత్తాసు

### రాత్రికి రాత్రే మట్టి అక్రమ రవాణా

ప్రజాపక్షం/వేములపల్లి : మండల పరిధిలోని ఆమనగల్లు గ్రామంలో చెరువు కట్ట సమీపంలోని 739 సర్వే నెంబరు లో 70 ఎకరాల ప్రభుత్వ ఆధీనంలో ఉన్నటువంటి భూమిని చుట్టుపక్కల ఉన్న రైతులు సగానికి పైగా కబ్జా చేయడం జరిగింది.మిగిలిన భూమిని ఆమనగల్లు గ్రామంలోని కొంతమంది వ్యక్తులకు ఈ స్థలంపై కన్నుపడింది. ఎలాంటి అనుమతులు లేకుండా యథేచ్ఛగా జేసీబీతో మట్టిని రాత్రికి రాత్రే తవ్వి అక్రమంగా ట్రాక్టర్లతో తరలిస్తూ లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నా అడిగే వారే కరువయ్యారు.అక్రమ మట్టి రవాణాతో ప్రభుత్వ ఆదాయానికి పెద్ద ఎత్తున గండిపడుతున్నా గ్రామస్తులు పలుమార్లు వేములపల్లి మండల తాసిల్దార్ కు అనేకసార్లు ఫోన్ చేసిన రెస్పాండ్ కావడం లేదు సంబంధిత అధికారులకు సమాచారం అందించిన పట్టించుకోకపోవడంపై స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అధికార,ప్రతిపక్ష స్థానిక నేతల అండదండలతోనే మట్టి మాఫియా ఆగడాలకు అడ్డూ అదుపూ లేకుండా పోయిందని వాపోతున్నారు. తహసిల్దార్ చర్యలు తీసుకోకపోవడం వెనుక లంచాలే కారణం అని స్థానికులు ఆరోపిస్తున్నారు.ప్రభుత్వ భూమిని కాపాడాలని అధికారులకు ఫిర్యాదు చేసిన ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని పైగా ఫిర్యాదుదారులపై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని పలువురు తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఇప్పటికైన కలెక్టర్ ఉన్నతాధికారులు స్పందించి ఈ వ్యవహారంపై సమ విచారణ జరిపి భూకబ్జాదారులతో కుమ్మక్కైన అవినీతి అధికారులపై ఏసీబీ దాడులు చేపించి సస్పెండ్ చేసి ప్రభుత్వ రికార్డు ప్రకారం 739 సర్వే నెంబరులో 70 ఎకరాల భూమి కాపాడి చుట్టూ కంచె వేసి ప్రభుత్వ ఆదాయాన్ని గండి పడకుండా ప్రభుత్వ భూమిని కాపాడవలసిందిగా అదేవిధంగా మట్టి మాఫియా చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు ఏ మేరా స్పందిస్తారో వేచి చూడాల్సిందే. ప్రభుత్వ భూముల కబ్జాలను ప్రోత్సహిస్తున్న ప్రజా ప్రతినిధులు.అధికారులు స్పందించకపోవడం కబ్జాలను ప్రోత్సహించడమే.

**మట్టి మాఫియాలో మైనర్ ట్రాక్టర్ డ్రైవర్లు అత్యధికం :** నిత్యం యాక్సిడెంట్లు జరుగుతున్న అవేవీ పట్టించుకోకుండా మట్టి రవాణా చేసే ట్రాక్టర్ డ్రైవర్లలో ఎక్కువ శాతం మైనర్లు లైసెన్స్ లేని వారు ట్రాక్టర్లు నడపడం గమనార్హం.సంబధిత అధికారులు స్పందించి మైనర్లు,లైసెన్స్ లేని వారితో ట్రాక్టర్ నడిపించే యజమానిపై కఠిన చర్యలు తీసుకోవాలి స్థానిక ప్రజలు ప్రభుత్వాన్ని కోరారు.

## పశువులు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం (పాల్వంచ) : అకాలవర్షం కారణంగా పిడుగు పడి పశువులు కోల్పోయిన గిరిజన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా అన్నారు. పాల్వంచ మండల పరిధిలోని రేగులగూడెం పంచాయితీలోని రాళ్లచిలకలో సోమవారం కురిసిన వర్షానికి పిడుగులు పడి గిరిజన రైతులు పశువులు మృతి చెందడంతో మంగళవారం సిపిఐ బృంధంతో ఆ గ్రామానికి చేరుకుని రైతులు మడకం జోగయ్య, లక్కు, నరేష్‌లను పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా పాషా మాట్లాడుతూ నిరుపేదలైన గిరిజన రైతులను ప్రభుత్వం తక్షణమే స్పందించి నష్టపరిహారం చెల్లించాలన్నారు. ఆయ వెంట సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, పాల్వంచ మండల కార్యదర్శి వీశంశెట్టి పూర్ణచంద్రరావు, వేములపల్లి శ్రీనివాసరావు, ఎస్‌కె లాల్‌పాషా, జకరయ్య, దారా శ్రీనివాసరావు, కంటెం సత్యనారాయణ, ఆలెం సమ్మయ్య, వజ్జ నారాయణ, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

## మూడు రోజులు మద్యం దుకాణాలు బంద్

ప్రజాపక్షం/యాదాద్రి : ప్రశాంత వాతావరణంలో పారదర్శకమైన ఎన్నికల నిర్వహణలో భాగంగా ఈనెల 27వ తేదీన వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఉప ఎన్నిక పోలింగ్ పురస్కరించుకొని 25వ తేదీ సాయంత్రం 4.00 గంటల నుండి 27వ తేదీ సాయంత్రం 4.00 గంటల వరకు జిల్లాలో అన్ని వైన్ షాపులు, బార్లు, కల్లు దుకాణాలు, కల్లు డిపోలు బంద్ చేయబడతాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరు హనుమంతు కే.జెండగే నేడొక ప్రకటనలో తెలిపారు. అందుకు అనుగుణంగా ఎక్సైజ్ శాఖ అన్ని వైన్ షాపులు, బార్లు, కల్లు దుకాణాలు, కల్లు డిపోలను బంద్ చేయడం జరుగుతుందని, దీనిని ఎవరైనా ఉల్లంఘించినట్లయితే తెలంగాణ ఎక్సైజ్ యాక్ట్ 1968, సెక్షన్ 20 (1) ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన అట్టి ప్రకటనలో తెలిపారు.

## దేశాన్ని కంప్యూటర్ యుగంలోకి నడిపించిన రాజీవ్‌గాంధీ

### మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి



ప్రజాపక్షం / సూర్యాపేట : భారత దేశానికి కంప్యూటర్ యుగాన్ని పరిచయం చేసిన గొప్ప నాయకుడు మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ అని మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్ చార్జీ రాంరెడ్డి దామోదర్ రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాయంలో రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో పంచాయతీ వ్యవస్థ, టెలికాం రంగాన్ని తీసుకవచ్చారని అన్నారు. దేశం కోసం ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీలు తమ ప్రాణాలను త్యాగం చేశారని గుర్తు చేశారు. వారి స్ఫూర్తితో సోనియా గాంధీ తన పదవిని త్యాగం చేసి ఆర్థికవేత్త మన్మోహన్ సింగ్‌ను ప్రధానమంత్రిగా చేసి దేశాభివృద్ధికి కృషి చేశారన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి రాజ్యాంగాన్ని తిరగి రాయాలని, రిజర్వేషన్లను తొలగించాలని కుట్ర చేస్తుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాల్లో విజయం సాధించి రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావడం ఖాయమన్నారు. రాజీవ్ గాంధీ స్ఫూర్తితో పార్టీ బలోతం కోసం ప్రతి కార్యకర్త, నాయకులు ముందుకు సాగాలన్నారు. ఈనెల 27న జరిగే నల్గొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బహుజన నాయకుడు, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను గెలిపించేందుకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ రహీం, పట్టణ అధ్యక్షులు అంజద్ అలీ, సీనియర్ నాయకులు గోదాల రంగారెడ్డి, ధరావత్ వీరన్న నాయక్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్, కౌన్సిలర్లు ఎలిమినేటి అభినయ్, వేములకొండ పద్మ, అనంతుల యాదగిరి, లక్ష్మీ మకట్‌లాల్, నాయకులు చెంచల శ్రీనివాస్, పంతంగి దశరథ, పోలేబోయిన నర్సయ్య యాదవ్, గడ్డం వెంకన్న, రెబల్ శ్రీను, నాగుల వాసు, ఆలేటి మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

### రాజీవ్‌గాంధీ ప్రధానిగా ఎన్నో రాజకీయ మార్పులు తెచ్చారు

### శాసన సభ్యులు మందుల సామేల్

ప్రజాపక్షం/తిరుమలగిరి : రాజీవ్ గాంధీ ప్రధాని పని చేసిన సమయంలో ఎన్నో రాజీకయ మార్పులు తీసుకవచ్చారని తుంగతుర్తి శాసన సభ్యులు మందుల సామేల్ అన్నారు. మంగళవారం మున్సిపల్ కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో రాజీవ్ గాంధీ 33వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో త్యాగాల కుటుంబం అంటే ఇందిరా గాంధీ కుటుంబమన్నారు. రాజకీయంగా రాజీవ్ గాంధీని ఎదుర్కొలేక మానవ బాంబుతో రాజీవ్ గాంధీని హతమార్చడం దేశానికి తీరని లోటన్నారు. రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయితే దేశంలో తిరిగి ఇందీరమ్మ రాజ్యం వస్తుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాల్లో విజయం సాధించి రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేయడమే లక్ష్యంగా అగ్రనాయకత్వం పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఎల్సోజు నరేష్, మున్సిపల్ చైర్ పర్సన్ చాగంటి అనసూయరాములు, కౌన్సిలర్లు కన్నెబోయిన రేణుక, గిలకత్తుల ప్రియలత, జితేందర్, మాజీ మార్కెట్ చైర్మన్ మూల అశోక్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాలకుర్తి రాజయ్య, పట్టణ అధ్యక్షులు పేరాల వీరేష్, నాయుకలు సుంకరి జనార్ధన్, లక్ష్మయ్య, దానయ్య, రాములు, వెంకన్న, నవీన్, కిష్టు నాయక్, సుధాకర్, సాయి, వంశీ తదితరులు పాల్గొన్నారు.



## పిల్లలకు మద్యం, పొగాకు ఉత్పత్తులు అమ్మవద్దు

### జిల్లా ఎస్‌పి రాహుల్ హెగ్డే



ప్రజాపక్షం/ సూర్యాపేట : పిల్లలకు మద్యం, పొగాలు ఉత్పత్తులను అమ్మవద్దని జిల్లా ఎస్‌పి రాహుల్ హెగ్డే మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం, ధూమపానం చేయడం చట్టరీత్య నేరమని తెలిపారు. ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలపై జిల్లా వ్యాప్తంగా పటిష్టమైన నిఘా పెట్టినట్లు చెప్పారు. బహిరంగంగా మద్యం, పొగాలు ఉత్పత్తులు తాగడం చూసి పిల్లలు అలవాటుపడే అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతగా ఇలాంటి వాటిని మానుకోవాలని సూచించారు. పిల్లలకు మద్యం, పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తే వ్యసనాలకు అలవాటుపడి నేరాలకు పాల్పడే అవకాశం ఉందన్నారు. దీంతో పిల్లల భవిష్యత్తు అంధకారంగా మారుతుందన్నారు.

## నిరుద్యోగ యువత కోసం పోరాడేశక్తి ఇవ్వండి

### మాజీ మంత్రి కెటిఆర్



ప్రజాపక్షం/ హాలియా : నిరుద్యోగ యువతకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు రావాలంటే పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా తమ పార్టీ నుంచి బరిలో ఉన్న రాకేష్ రెడ్డిని గెలిపించి ప్రశ్నించే గొంతును శాసనమండలిలోకి పంపించాలని మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు యువతను కోరారు. త్వరలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బరిలో ఉన్న రాకేష్ రెడ్డి కి మద్దతుగా చేపట్టిన ప్రచారంలో భాగంగా మంగళవారం హాలియాలో పట్టభద్రులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు కావస్తున్న ఎన్నికల ముందు వారు ఇచ్చిన హామీలను విస్మరించారని ఆరోపించారు. నిరుద్యో యువతను పట్టించుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని తెలిపారు. త్వరలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా తమ పార్టీ నుంచి బరిలో నిలిచిన రాకేష్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని యువతను కోరారు. ప్రశ్నించే గొంతు శాసనమండలిలో ఉంటే నిరుద్యోగ యువతకు ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యల్ని విస్మరించి అరచేతిలో ప్రజలకు వైకుంఠం చూపిస్తుందని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను విస్మరించి అరచేతిలో ప్రజలకు వైకుంఠం చూపిస్తుందని ఆరోపించారు. తెలంగాణ అభివృద్ధిలో బారాస కీలకపాత్ర పోషించిందని గుర్తు చేశారు. తెలంగాణా మరింత అభివృద్ధి సాధించాలంటే అది ఒక్క కెసిఆర్ తోనే సాధ్యమవుతుందని తెలిపారు. ప్రజలను ఏ మార్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలకు ఆ తర్వాత వాటిని అమలు చేయడంలో చేస్తున్న జాప్యాన్ని ప్రజల గుర్తించాలని ఈ సందర్భంగా కోరారు. మాజీ మంత్రిలు గుంటకండ్ల జగదీశ్వర్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మంకెన కోటిరెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నోముల భగత్, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, కంచర్ల భూపాల్ రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ బండ నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సమన్వయంతోనే సత్ఫలితాలు

హన్మకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



**ప్రజాపక్షం/హన్మకొండప్రతినిధి :** ఈనెల 27ననిర్వహించేవరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల ప్రక్రియను పకడ్బంధీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, హన్మకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. మంగళవారం సమీకృత కలెక్టర్ కార్యాలయ సమావేశ హాలులో వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఉప ఎన్నికల్లో విధులు నిర్వహించే నోడల్ అధికారులు, పోలీసులు, పీఓలు, ఏపీఓలు, ఓపీఓలు, రూట్ అధికారులు, సెక్టార్ అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఈనెల 27న నిర్వహించే ఎమ్మెల్సీ ఉప ఎన్నికల పోలింగ్ ప్రక్రియను పకడ్బంధీగా నిర్వహించాలన్నారు. పట్టభద్రుల ఉప ఎన్నికల్లో 52మంది అభ్యర్థులు పోటీలో ఉన్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించుకోవాలని, ఇందు కోసం పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఉప ఎన్నికల సక్రమంగా నిర్వహించటంలో పీఓలు, ఏపీఓలు, ఓపీఓల విదులు చాలా కీలకమన్నారు. పట్టభద్రుల ఉప ఎన్నికలో పీఓలు,ఏపీఓలు, ఓపీఓలు ఎన్నికల నియమ నిబంధనల మేరకు తూచా తప్పక విదులునిర్వహించాలని, పట్టభద్రుల ఉప ఎన్నికను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బంధీగా, ప్రశాంతంగా నిర్వహించాలన్నారు. బ్యాలెట్ పేపర్‌ను ఓటరుకు ఇచ్చేటప్పుడు క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఓటర్లు ఓటుహక్కు వినియోగంలో పోలింగ్ సిబ్బంది ఇచ్చిన వాయిలెట్ కలర్ స్కెచ్ పెన్‌తో పోటీలో ఉన్న అభ్యర్థులకు ఎదురుగా క్రమ సంఖ్య వేయాలన్నారు. ఓటరు ఓటువేసే వ్యక్తి పేరు పక్కన 1 నుంచి నంబర్లు వేయాలని, నంబర్లు వేయకపోతే ఓటు చెల్లుబాటు కాదన్నారు. పీఓ ఇచ్చిన వాయిలెట్ పెన్ కాకుండా ఇతర రంగుల పెన్నులు వాడితే బ్యాలెట్ చెల్లుబాటు కాదన్నారు. ప్రతీ పోలింగ్ కేంద్రంలో పీఓతో పాటు ఏపీఓ, ఓపీఓ ఉంటారన్నారు. 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, సాధారణ ఎన్నికల మాదిరి మాక్ పోలింగ్ ఉండదని, పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో పోలింగ్ బాక్స్ ఓపెన్ చేసి చూపాలని, బాక్స్ మొత్తం ఖాళీగా ఉండాలని తెలిపారు. టెండర్, ఛాలెంజ్ ఓట్లు వేస్తే పీఓ ప్రత్యేక ఎన్వలప్‌లో భద్రపర్చాలని ఆ వివరాలు పీఓ డైరీలో నమోదుచేయాలన్నారు. ఓటరుకు ఎడమ చేతి మధ్య వేలుకు ఇండిబుల్ ఇంక్ పెట్టాలన్నారు. పట్టభద్రుల ఉప ఎన్నికలకు విధులు కేటాయించిన సిబ్బందికిఓటుహక్కువినియోగానికి ఫారం 12 ద్వారా పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. 26న హన్మకొండ కేడిసిలో మెటీరియల్ ఇవ్వడం జరుగుతుందని అదే రోజు పోలింగ్ కేంద్రాలకు చేరుకొని మరుసటి రోజు పోలింగ్ ప్రక్రియకుఏర్పాట్లుచేయాలన్నారు.

## టి-20 జట్టు ఎంపిక

**ప్రజాపక్షం/మహబూబాబాద్‌ప్రతినిధి:** వరంగల్‌లో జరకాబోయే ఎం.జయప్రకాశ్ మెమోరియల్ సీనియర్ ఇంటర్ డిస్టిక్ టి20 నాకౌట్ ఓపెన్ టోర్నమెంట్ కు మహబూబాబాద్ జట్టును అసోసియేషన్ ఇంచార్జ్ బి అజయ్ సారధి రెడ్డి ప్రకటించారు. ప్రకటించిన వారిలో 1 బి చరిత్ రెడ్డి (మహబూబాబాద్) 2 ఏ అనిర్వేశ్ (మహబూబాబాద్) 3 ప్రణయ్ కుమార్ (అమ్మాపురం) 4 బోడ శివ (తాట్య తండా) 5 శశి (అమ్మపురం )6 సాయి (ఇనుగుర్తి ) 7 రోషన్ (మహబూబాబాద్ ) 8 ప్రణయ్ గౌడ్ ( అప్ రాజ్ పల్లి )9 షరీఫ్ (కందికొండ )10 యశ్వంత్ (కేసముద్రం) 11 రాకీబ్ (మహబూబాబాద్ )12 రిషి వరుణ్ (కేసముద్రం) 13 అజయ్ (కేసముద్రం) 14తరుణ్ (అమ్మాపురం) 15 వంశీ (వావిలాల) 16 శ్రీరామ్ (మహబూబాబాద్) 16 శ్రీరామ్ (మహబూబాబాద్) 17 రాకేష్ (వీరారం తండా) 17 మంది తో మహబూబాబాద్ క్రికెట్ జట్టు ఆడనున్నట్టు బి.అజయ్ సారధి రెడ్డి తెలిపారు. మ్యాచ్‌లకు కోచ్ లుగా మెతుకు కుమార్ తోట వినయ్, సహాయకుడిగా అయిలి సంతోష్ పాల్గొంటారని తెలిపారు.

## పనుల్లో నాణ్యత తప్పనిసరి



**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధిః** అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి శ్రీజ అన్నారు. మంగళవారం కన్నాయిగూడెం మండలంలోని సింగారం, ఏటూరు, కంతనపల్లి గ్రామాలలోని పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను అదనపు కలెక్టర్ పి శ్రీజ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ తరగతి గదుల్లోని లైట్‌లు, ఫ్యాన్‌ల నిర్వహణను పర్యవేక్షించారు. మరుగుదొడ్లను పరిశీలించి, వాటిపై రూఫ్‌ను, తలుపుల మరమ్మత్తులను సరైన విధంగా అమర్చాలని సిబ్బందిని ఆదేశించారు. వచ్చే విద్యా సంవత్సరంలో పాఠశాలకు వచ్చే విద్యార్థులకు పాఠశాల వాతావరణం ఒక నూతన అనుభూతిని కలిగించే విధంగా పాఠశాల పరిసరాలను ఉంచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంగపేట మండల ప్రత్యేక అధికారి ఏపిడి వెంకటనారాయణ, ఎంపిడిఓ, ఎంఈఓ రాజేష్, పంచాయతీరాజ్ ఏఈ, ఎంపివో, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఆదర్శ పాఠశాలల పనులు పరిశీలన



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి :** జనగామ జిల్లా లింగాలఘనపురం మండలంలోని పటేల్‌గూడెం గ్రామంలోగల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ మంగళవారం సందర్శించి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా గుర్తించిన పనులను పరిశీలించారు. తరగతి గదుల్లోని లైట్‌లు,ఫ్యాన్‌ల నిర్వాహణను పర్యవేక్షించారు. మరుగుదొడ్లు పరిశీలించి వాటిపైరూఫ్‌ను వేయాలని, తలుపులు అమర్చాలని ఆదేశించారు. తాగు నీరు, ప్రహరీగోడ గేటు, మౌళిక వసతులపై అడిగి తెలుసుకున్నారు.

## ఎంపిపి కార్యాలయంలో తనిఖీ



**ప్రజాపక్షం/అల్లాదుర్గం:** మెదక్ జిల్లా అల్లాదుర్గం అల్లాదుర్గం మండల పరిషత్ కార్యాలయాన్ని మంగళవారం జిల్లా ముఖ్య కార్య నిర్వహణాధికారి శ్రీ ఎల్లయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో అన్ని రికార్డులను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. కార్యాలయంలో ఎంపీడీవో కే.శంకర్, జూనియర్ సహాయకులు ఎండి.సజ్జాద్ అలీ సిబ్బంది ఉన్నారు.

## ధాన్యం కొనుగోళ్లపై ఆరా



**ప్రజాపక్షం/పాలకుర్తి:** మండలంలోని ఎల్లరాయిని తొర్రూరు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తెలంగాణ వ్యవసాయ శాఖ డైరక్టర్ గోపి, జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్‌తో కలిసి మంగళవారం పర్యవేక్షించారు. ధాన్యం కొనుగోలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా డీసీవో రాజేందర్ రెడ్డి, డీసీఎస్‌వో రోజారాణి, సివిల్ సప్లై డీఎం ప్రసాద్, డీఏవో వినోద్‌కుమార్, ఘనపూర్ ఆర్డీవో వెంకన్న, తహశీల్దార్ వెంకటేశం, డీటీ దేవా, శ్రీనివాస్, ఏడీఏ పరుశరామ్, ఏఈఓలు ఎం సంధ్య, వెంకటేష్, సొసైటీ కార్యదర్శి ఎం రణదీర్, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు ముమ్మరం



**ప్రజాపక్షం/రేగోడు :** వరి ధాన్యం రైతుల నుంచి కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని వెంటనే డంపింగ్ చేయాలని తాసిల్దార్ బాల లక్ష్మి ఆదేశించారు. మంగళవారం రేగోడు కోత్వన్‌పల్లి గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్రాల వద్ద వడ్లు ఎందుకు ఉంచారని ప్రశ్నించారు. లారీలు లేకపోవడం వల్లే ధాన్యం నిలిచిపోతుందని, తెలపడంతో లారీల కొరత తీర్చాలని సంబంధిత అధికారులకు సూచించారు. రేగోడు రైస్ మిల్ కు ట్రాక్టర్ ద్వారా డంపింగ్ చేయాలని సూచించారు. ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బంది ఇబ్బందులకు గురి చేయవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పల్లె ప్రకృతి వనాలపై సంతృప్తి



**ప్రజాపక్షం/నిజాంపేట్ :** నిజాం పేట మండల పరిధిలో మంగళవారం రోజున మెదక్ జిల్లా డిఎల్‌పిఓ సతీష్ కుమార్ నందిగామ గ్రామంలో సందర్శించడం జరిగింది. గ్రామంలోని హరితహారాన్ని, నర్సరీ, పల్లెప్రకృతి వనాన్ని తెలంగాణ క్రీడ ప్రాంగణాన్ని, వైకుంతథామాన్ని, సెక్రిగేషన్ షెడ్, గ్రామ పంచాయతీ సంబంధించిన అధికారులను పరిశీలించడం జరిగింది. గ్రామ కార్యదర్శి హరీఫ్ హుస్సేన్, గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ ప్రేమలత, గ్రామ పరిస్థితి కార్మికులు నర్సరీ నిర్వాకులు తదితరులు పాల్గొన్నారు.

## రూ.409 కోట్లు రైతుల ఖాతాలో జమ చేశాం : భారతీహోళికేరి



**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** సిద్దిపేట వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సమస్యలను అధికమించేల చర్యలు చేపట్టాలని ఉమ్మడి మెదక్ జిల్లా ప్రత్యేకాధికారి భారతీ హోళీకేరి జిల్లా కలెక్టర్లకు సూచించారు. మంగళవారం సిద్దిపేట కలెక్టరేట్‌లో సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి కలెక్టర్లతో ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి ధాన్యం కొనుగోళ్లపై సమీక్షించారు. ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి, కొనుగోలు తీరును పరిశీలించారు. జిల్లాలో 10 రోజుల్లో మొత్తం ధాన్యం కొనుగోళ్లు పూర్తిచేయాలని ఆదేశించారు. అలాగే కొనుగోలు కేంద్రాలకు ఇంకా రావాల్సిన ధాన్యంపై జిల్లా వ్యవసాయాధికారి పూర్తి నివేదిక సమర్పించాలన్నారు. అలాగే సిఎంఆర్ డెలివరీపై సమీక్షించి రైస్‌మిల్లర్లందరు తమ కెపాసిటి ప్రకారం మిల్లింగ్ చేసి, ఎఫ్‌సిఐకి పంపే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రైస్‌మిల్లులతో స్థల సమస్య ఉన్నచో అందుబాటులో ఉన్న ఎఎంసి గోడౌన్లను వాడుకోవాలని ఆదేశించారు. హుస్నాబాద్ ప్రాం తంలో కొనుగోలు కేంద్రాలు తుదిదశకు వచ్చిందని, అక్కడ వాహనాలు కూడ ప్రస్తుతం ప్రస్తుతం అధిక ధాన్యం కొనుగోలు చేసేలా కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలన్నారు. అలాగే దుబ్బాక మండలం హాబ్షిపూర్ కేంద్రాన్ని, సిద్దిపేట జిల్లా ఇర్కోడ్ కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఏవైన సమస్యలున్నాయో రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతులు తాలు ధాన్యం శుద్ధి చేసిన తర్వాతనే మిల్లులకు తరలించాలన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 50.953 రైతుల నుండి 2.23.198 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రూ.491 కోట్లకు గాను ఇప్పటివరకు రూ.409 కోట్లు రైతుల ఖాతాల్లో జమచేసినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ మనుచౌదరి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, సివిల్ సప్లయ్ అధికారితనుజ, మేనేజర్ హరీష్, డిఆర్‌డిఓ జయదేవ్, జిల్లా మార్కెటింగ్ అధికారి నాగరాజు, వ్యవసాయాధికారి శివప్రసాద్, జిల్లా రవాణాధికారి వేణు, లీగల్‌మెట్రాలజీ అధికారి, రైస్‌మిల్లర్లు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రైతుల్ని మోసం చేయడమే కాంగ్రెస్ లక్ష్యం

దొడ్డు ధాన్యానికి బోనస్ ఇవ్వాల్సిందే

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** ఎన్నికల సందర్భంగా రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా వారిని మోసం చేయడమే కాంగ్రెస్ లక్ష్యంగా పెట్టుకుందని రైతు బంధు సమితీ రాష్ట్ర మాజీ అధ్యక్షులు, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి విమర్శించారు. 24 గంటల విద్యుత్, రైతు బంధు ఇవ్వకపోగా ఇప్పుడు సన్న ధాన్యానికి మాత్రమే బోనస్ ఇస్తామని రేవంత్‌రెడ్డి మాటమార్చడం సరియైంది కాదని పల్లా మండిపడ్డారు. మంగళవారం జనగామలోని తన క్యాంప్ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. 2014 ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత తెలంగాణలో వరి పంట సాగు గణనీయంగా పెరిగిందన్నారు. ప్రతి ఏటా 3లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి కాగా ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా చేయడే కాకుండా సకాలంలో రైతు బంధు,రైతు భీమా అందించామన్నారు. కాంగ్రెస్ మాటలు నమ్మి ఓట్లు వేసిన ప్రజలు డిసెంబర్ 9 వరకు రెండు లక్షల రుణమాఫీ జరుగుతుందని ఆశించగా ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లో కూడా ఆశ నిరాశగానే మిగిలిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఆగస్టులో రుణమాఫీ చేస్తామన్న ప్రభుత్వం కార్పొరేషన్ వేస్తామని చెబుతుందని, కార్పొరేషన్ ఏర్పాటు చేసినా ఎఫ్ఆర్‌బిసి నిబంధల ప్రకారం నిధులు రావనే విషయం అధికారులు, ప్రభుత్వానికి తెలియదాఅని ప్రశ్నించారు. కార్పొరేషన్ ఏర్పాటు రైతుల్ని మోసం చేయడానికే అని మండిపడ్డారు. తెలంగాణలో సన్న ధాన్యం దిగుబడి తక్కువగా ఉంటుందని, బార్డర్ ప్రాంతాల్లోనే సాగు జరుగుతుందన్నారు. అయినా సన్న ధాన్యాన్ని వ్యాపారులే 3వేలకు పైగా కొనుగోలు చేస్తుంటే మీరిచ్చే బోనస్ ఏం ఉపయోగపడుతుందనిమండిపడ్డారు.గ్రాడ్యుయేట్స్ ఎన్నికల్లో ఒక వైపు స్వచ్ఛమైన అభ్యర్థి ఎనుగుల రాకేష్‌రెడ్డి ఉంటే మరో వైపు 51 కేసులు 76 రోజులు జైల్లో ఉన్న వ్యక్తి తీన్మార్‌మల్లన్న ఉన్నారన్నారు. స్వచ్ఛమైన రాజకీయాలు చేసే ఎనుగుల రాకేష్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కోరారు.మున్సి పల్ ఛైర్ పర్సన్ పోకల జమున, మార్కెట్ మాజీ ఛైర్మన్ బాల్నె సిద్దిలింగం, మున్సిపల్ మాజీ ఛైర్ పర్సన్ గాడిపెల్లి ప్రేమలతారెడ్డి, ఇర్రి రమణారెడ్డి, గద్దల నర్సింగరావు, పసుల ఎబెల్, యాదవరెడ్డి, సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ నిర్వహణలో అధికారులే కీలకం

జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** ఈ నెల 27 న నిర్వహించే వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల శాసనమండలి ఉప ఎన్నిక పోలింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అన్నారు. మంగళవారం సమీకృత కలెక్టర్ కార్యాలయ సమావేశపు హాలులో వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఉపఎన్నికలో విధులు నిర్వహించు నోడల్ అధికారులు, పోలీస్, పిఓలు, ఎపివోలు, ఓపిఓలు, రూట్ అధికారులు, సెక్టార్ అధికారులు, తహసిల్దార్లు, ఎంపీడీఓలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విధులు నిర్వహణపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 27 న నిర్వహించే వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల శాసనమండలి ఉపఎన్నిక పోలింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు. పట్టభద్రుల ఉపఎన్నికలో 52 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నట్లు తెలిపారు. భూపాలపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా 12,535 మంది పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారని, ఇందు కొరకు 16 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందనితెలిపారు. వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఉపఎన్నిక పోలింగ్ సక్రమంగా నిర్వహించుటలో పిఓలు, ఏపిఓలు, ఓపిఓల విధులు చాలా కీలకమని అన్నారు. పట్టభద్రుల ఉప ఎన్నికలో 19 మంది పీఓలు, 19 మంది ఏపిఓలు, 38 మంది ఒపిఓలకు విధులు కేటాయించామన్నారు. అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, సిబ్బంది శిక్షణ నోడల్ అధికారులు అవినాష్, శామ్యూల్, ఆర్డీవో మంగిలాల్, డీపీఓ సంపత్‌రావు పాల్గొన్నారు.

## మోసపూరిత మాటలతో రైతన్న ఆగమాగం

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

**ప్రజాపక్షం/తొర్రూరు :** అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే రైతులకు రుణమాఫీ చేస్తామని, పండిన పంటలకు రూ.500ల బోనస్ ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు రైతులను మోసం చేసిందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మంగళవారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి దయాకర్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత మాటలతో రైతులను ఆగం చేస్తుందని అన్నారు. కేసీఆర్ హయాంలో రైతులు సంతోషంగా ఉన్నారని చెప్పారు. రెండు పంటలు పండేలా కేసీఆర్ ఎంతో కృషి చేశారని చెప్పారు. రైతులకళ్లల్లో ఆనందంచూడాలన్నదే కేసీఆర్ లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే డిసెంబర్ 9న రూ.రెండు లక్షల రుణమాఫీ అవుతుందని, పండించిన వరి పంటకు రూ.500 బోనస్ ఇచ్చి కొనుగోలు చేసే బాధ్యత మాది అని చెప్పి రేవంత్‌రెడ్డి నిన్న జరిగిన కేబినేట్ సమావేశం తరువాత సన్న వడ్లు పండించిన వారికి మాత్రమే రూ.500లు బోనస్ ఇస్తామన్న ప్రకటనతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 90శాతం మంది రైతులు దొడ్డు వడ్లు మాత్రమే సాగు చేస్తారని, కేవలం పది శాతం మంది మాత్రమే వారి కుటుంబ అవసరాల కోసం ఉంచుకొని మిగిలింది అమ్ముకునే వారని చెప్పారు. అప్పుడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రేవంత్‌రెడ్డి తెలంగాణలో అధిక శాతం దొడ్లు వడ్లే పండుతాయని, దొడ్డు వడ్లకు మద్దతు ధర ఇవ్వాలని అన్నాడని, ఇప్పుడు అధికారంలోకి రాగానే సన్న వడ్లకు మాత్రమే మద్దతు ధర ఇస్తామని అనడం బోగస్ మాటలకు నిదర్శనమన్నారు.

## వరంగల్ పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రభంజనం



**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ యూనివర్సిటీ, ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో నేరుగా రెండవ సంవత్సరంలో ప్రవేశం కోసం జరిగిన ఈసెట్ 2024 పరీక్షలో ప్రభుత్వ పాలిటెక్నిక్, వరంగల్ విద్యార్థులు సత్తా చాటారు. వివిధ ఇంజనీరింగ్ విభాగాలలో రాష్ట్ర స్థాయిలో మొదటి 10ర్యాంకులలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో 3, 4, 9 ర్యాంకులు, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్ విభాగంలో 1, 2, 5, 6, 7 ర్యాంకులు, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగంలో 2, 4 ర్యాంకులు, మెకానికల్ ఇంజనీరింగ్ లో 2,6,10 ర్యాంకులు కైవసం చేసుకొని ప్రభంజనం సృష్టించారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో ఎన్. దీక్షిత్ 3వ ర్యాంక్, పి.వివేక్ 4వ ర్యాంక్, బి.హేమశ్రీ 9వ ర్యాంక్, పి.నాగ సాయి యశ్వంత్ 19వ ర్యాంక్ సాధించగ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ లో రాష్ట్ర స్థాయిలో ఎం.నవ్య శ్రీ 1వ ర్యాంక్, వి.వైష్ణవ్ 2వ ర్యాంక్, వి.అర్పిత 5వ ర్యాంక్, కె.హర్షిత 6వ ర్యాంక్, పి.హారిక 7వ ర్యాంక్, ఎండీ.సోహైల్ 11వ ర్యాంక్ సాధించగ, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగంలో టి.శ్రీవాత్సవ్ 2వ ర్యాంక్, ఎం.కౌశిక్ కుమార్ 4వ ర్యాంక్ సాధించగ, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో కె.చందు 2వ ర్యాంక్, కె.అఖిల్ 6వ ర్యాంక్, బి.నిఖిల్ 10వ ర్యాంక్, ఓ.గౌతమ్ 12వ ర్యాంక్ సాధించారని ప్రభుత్వ పాలిటెక్నిక్, వరంగల్ ప్రిన్సిపాల్ డా.బైరి ప్రభాకర్ తెలిపారు. అద్భుతమైన ఫలితాలు సాధించిన విద్యార్థులకు, కళాశాల విభాగ అధిపతులను, అధ్యాపకులను ప్రభుత్వ పాలిటెక్నిక్, వరంగల్ ప్రిన్సిపాల్ డా॥ బైరి ప్రభాకర్ అభినందించారు.

# క్రికెట్ స్టేడియం కోసం వినతి



**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** హైదరాబాద్ తర్వాత అతిపెద్ద తెలంగాణ రెండవ రాజధానిగా పిలవబడే పాత ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రత్యేకంగా క్రికెట్ స్టేడియం కోసం స్థలం చూసి నిర్మాణానికి సహకరించాలని వరంగల్ డిస్టిక్ క్రికెట్ అసోసియేషన్ డబ్ల్యుడిసిఏ జిల్లా కార్యవర్గ సభ్యుడు మహబూబాబాద్ సమ్మర్ క్రికెట్ కోచింగ్ క్యాంప్ ఇంచార్జ్ బి.అజయ్ సారదిరెడ్డి కోరారు. వరంగల్ లో జరిగిన సమ్మర్ క్రికెట్ కోచింగ్ క్యాంపుల ముగింపు సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహన్ రావుకు వరంగల్ డిస్టిక్ క్రికెట్ అసోసియేషన్ డబ్ల్యుడిసిఏ జిల్లా కార్యవర్గ సభ్యుడు మహబూబాబాద్ సమ్మర్‌క్రికెట్ కోచింగ్ క్యాంప్ ఇంచార్జ్ బి.అజయ్ సారదిరెడ్డి పలు క్రికెట్ సంబంధిత సమస్యలను దృష్టికి తెచ్చి ప్రస్తావించారు. గతంలో కాజీపేట జక్కలొద్దీలో క్రికెట్ స్టేడియం నిర్మాణం చేస్తామని గతంలో హెచ్‌సీఏ పెద్దలు చెప్పారని గుర్తు చేశారు. అన్ని విధాల వెనుకబడిన హైదరాబాద్ యేతర వరంగల్ తోపాటు తొమ్మిది జిల్లాల క్రికెట్ అసోసియేషన్లకు అన్ని విధాల మౌలిక వసతులతో పాటు అసోసియేషన్ ల బలోపేతం చేయాలని క్రీడాకారులకు వివిధ లీగ్ రంజీ టోర్నమెంట్లలో అవకాశం కల్పించాలని కోరారు. ఈ సమ్మర్ క్యాంపు ల ద్వారా తెలంగాణ వ్యాప్తంగా పాల్గొన్న క్రీడాకారుల వారి తల్లిదండ్రులకు ప్రోత్సాహకంగా ఉండేలా హెచ్‌సీఏ హైదరాబాదులో జరిగే ఐపీఎల్ టి20 వన్డే టెస్ట్ మ్యాచ్ ల ఏదో సందర్భంగా వీక్షించే అవకాశం ఇవ్వాలని మహబూబాబాద్ తోపాటు కొత్త జిల్లాలకు హెచ్‌సీఏ గుర్తింపు ఇవ్వాలని కోరారు. స్పందించిన హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్ మోహన్ రావు మాట్లాడుతూ వరంగల్లో క్రికెట్ స్టేడియం ఏర్పాటుకు కృషి చేస్తానని, ఐపీఎల్ ఇతర అంతర్జాతీయ మ్యాచ్లకు వెయ్యి మంది వీక్షించే అవకాశం కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ సి ఏ డబ్ల్యూడిసిఏ పెద్దలతోపాటు మెతుకు కుమార్, తోట వినయ్, అయిలి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ధూల్మిట్టలో రేణుకాఎల్లమ్మ పండుగ



**ప్రజాపక్షం/మద్దూరు/ధూల్మిట్ట :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టే పండుగలలో గౌడ కులస్థులు జరుపుకునే రేణుకాఎల్లమ్మ తల్లి పండుగ ఒక్కటి. చారిత్రాత్మక గ్రామం ధూల్మిట్ట మండల కేంద్రంలో గౌడ కులస్థుల ఆధ్వర్యంలో '' రేణుకా ఎల్లమ్మ తల్లి పండుగ వేడుకలు'' కనుల పండుగగా నిర్వహించారు. ధూల్మిట్ట గౌడ కులస్థుల ఆధ్వర్యంలో మొట్ట మొదటి సారి అమ్మ వారి విగ్రహ ప్రతిష్టాపనను పురస్కరించుకుని జరుగుతున్న బోనాల పండుగతో మంగళవారం గ్రామంలో సంబరాలు అంబరాన్ని అంటాయి. డప్పు చప్పుళ్ళ, డోలు వాయిద్యాలు, జల్దీబోనాలతో గౌడ కులస్థులు మహిళలు గ్రామంలోని పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించి, అమ్మవారికి బోనాలు సమర్పించారు. ప్రజలు, పాడి పంటలు సుభిక్షంగా ఉండాలని నిర్వహిస్తున్న పండుగను, గ్రామస్తులందరితో పాటుగా, గ్రామ ప్రముఖులు, పరిసర గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గౌడ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పండుగలో పలువురు మండల ప్రముఖులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని మహిళలు మంగళ హారతులతో నిరాజనాలు పలుకుతూ, రేణుకా ఎల్లమ్మ అమ్మవారికి తొలి బోనాలతో నైవేద్యం సమర్పించారు. ఈ అద్భుతమైన ఘట్టంలో గ్రామంలోని వివిధ కులకులసంఘాల ప్రతినిధులు, మాజీ సర్పంచ్‌లు, విద్యావేత్తలు, యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా గౌడ సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ గ్రామం, మండలం సుభిక్షంగా ఉండాలని, ప్రతిఒక్క ఇంటిల్లి పాదిని చల్లగా చూడాలని, ప్రతి ఒక్కరిని ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆ రేణుకా ఎల్లమ్మ తల్లిని కోరుకుంటున్నట్లు వారు తెలిపారు.

## 'ధాన్యాన్ని మిల్లులకు వెంటనే తరలించాలి'

**ప్రజాపక్షం /సంగారెడ్డి ప్రతినిధిః** మిల్లుల వద్ద దాన్యం త్వరగా ఆన్‌లోడ్ చేయించాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు సివిల్ సప్లై అధికారులకు ఆదేశించారు. కలెక్టర్ మంగళ వారం అందోల్ డివిజన్‌లోని మన్సాన్ పల్లి, కన్సాన్ పల్లి గ్రామాలల్లో కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వాతావరణ, మార్పుల కనుగుణంగా ఉదయమే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని, తెలిపారు. రోజు ఐదు లారీలకు తక్కువ కాకుండా కొనుగోలు కేంద్రాలకుఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆకాల వర్షాలు పడుతున్నందున వేగవంతం కొనుగోలు చేసిన దాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. చివరి గింజ వరకు దాన్యం కొనుగోలు చేయాలని సెంటర్ ఇన్చార్జీకి సూచనలు జారీ చేశారు. గన్నీ బ్యాగ్ల సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తేవాలని తెలిపారు. మిల్లుకు ఇచ్చిన కెపాసిటీని పూర్తి చేయాలని రైతుల నుండి కొనుగోళ్లకు ఏలాంటి ఇబ్బందులు లేకుండా రైతుల శ్రేయస్సు దృష్టిలో ఉంచుకొని మిల్లులలో స్పేస్ పెంచుకొని దాన్యం లారీలను త్వరగా ఆన్ లోడ్ చేయించాలని, ఆ వెంటనే ఆన్ లైన్ నమోదు చేయాలని ఆదేశించారు. సమావేశంల సివిల్ సప్లయి జిల్లా మేనేజర్ కొండల్‌రావు, జిల్లా పౌర సరఫరాల అదికారి వనజాత, మెప్మా, పిడి గీత ఆర్డీఓ పాండు సంబందిత అదికారులు రైతులు పాల్గొన్నారు.

## విధులు నిర్లక్ష్యం చేస్తే షోకాజ్ నోటీసులు ఖాయం

జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు



**ప్రజాపక్షం /సంగారెడ్డి ప్రతినిధిః** విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన అదికారులకు షోకాజ్ నోటీసులుఅందజేస్తామనిజిల్లాకలెక్టర్ క్రాంతి వల్లూరు తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమం పనుల పురోగత సరిగా లేనందున విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన కారణంగా హెఛ్ ఏం లకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ జిల్లా విద్యాశాఖ అదికారికి ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించే అధికారుల పై చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. మంగళ వారం అందోల్ డివిజన్ లోని జిల్లా పరిషత్ బాల బాలికల ఉన్నత పాఠశాల జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేసారు. అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలలో చేపట్టిన కనీస మౌళిక వసతులు కల్పన అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. మౌళిక వసతుల కల్పన అభివృద్ధి పనులు దగ్గర ఉండి చేయించుకునే భాద్యత ప్రధాన ఉపాద్యాయులదేనని అన్నారు. పాఠశాలలో ఉపాద్యాయులు లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. వారికి షోకాజ్ నోటీసులు జారీచేయాలని జిల్లా విద్యాధికారి ఆదేశించారు. పాఠశాలల పునః ప్రారంభం నాటికి అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా ప్రభుత్వం మంజూరు చేసిన అభివృద్ధి పనులను తప్పనిసరిగా పూర్తి చేసి నివేదికలు సమర్పించాలని విద్యా శాఖ అధికారులను ఈఈపి ఆర ఇంజనీర్లను ఆదేశించారు. జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు ఈఈసిఆర్ అంజయ్య ఆర్డిఓ రాజు ఎంఇఓ కృష్ణయ్య ఏంపిలు సంబందిత అధికారులు పాల్గొన్నారు.

## ఇసుక అక్రమ రవాణాపై దాడులు



**ప్రజాపక్షం/రఘునాథ-పల్లి:** ఎన్నికలకోడ్ అమల్లో ఉన్నా ఇసుకాసురుల ధన దాహానికి అడ్డు అదుపు లేకుండా పోతుంది. అధికారుల ఆదేశాలు బేఖాతర్ చేస్తూ ఇసుకను అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మండలంలోని రఘునాథపల్లి, నిడిగొండ , బాణాజీపేట, శ్రీమన్నారాయణపురం, ఖిలాషాపురం, మండెలగూడెం, వెల్ది గ్రామాల శివారు వాగుల నుండి ఇసుకను దర్జాగా తరలిస్తున్నారు. టిప్పర్లను, ట్రాక్టర్లను ఎవరు ఆపలేరనే ధీమాతో అక్రమార్కులు ఉన్నట్లు తెలుస్తుంది. మండలంలో ఇసుక మాఫియా చీకటి పడిందంటే చాటు ఆయా గ్రామాల్లోని వాగులో నుండి రాత్రి 11 గంటల నుండి ఉదయం 9 గంటల వరకు జేసీబీలు, డోజర్‌ల సహాయంతో ఇసుకను తోడేస్తూ లక్షలు గడిస్తున్నారు ఇసుకాసురులు. దీంతో వారిపై పోలీసులు గత రెండు రోజులుగా దాడులు చేస్తూ ట్రాక్టర్లను సీజ్ చేస్తూ, కేసులు నమోదు చేస్తున్నారు. దీనిలో భాగంగానే గత రాత్రి ఎల్లారెడ్డిగూడెం గ్రామానికి చెందిన పర్వత సుమన్ అక్రమంగా ఇసుకను రఘునాథపల్లి గ్రామశివారులో గల కాండ్ల వాగు నుండి తరలిస్తుండగా పోలీసులు పట్టుకోవడం జరిగింది. అదేవిధంగా మండెలగూడెం గ్రామానికి చెందిన చింతకాయల నరేష్ సైతం అనుమతులు లేకుండా ట్రాక్టర్ ద్వారా ఇసుకను తరలిస్తుండగా పోలీసులు పట్టుకొని ట్రాక్టర్‌ను సీజ్‌చేసి కేసు నమోదుచేశారు. ఎవరైనా మండలంలో ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే దాడులు తప్పవని, ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వారిపై కేసులు నమోదుచేసి చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ నరేష్ హెచ్చరించారు.

## విలేఖరిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

టియుడబ్ల్యుజె- ఐజెయు జిల్లా ప్రధాన కార్యదర్శి సంపత్ కుమార్

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ ప్రతినిధి :** కాగజ్ నగర్ పట్టణానికి చెందిన ఆదాబ్ హైదరాబాద్ విలేఖరి అంగల తిరుపతి పై సోమవారం దాడి చేసిన అక్రమ మైనింగ్ నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని, విలేకరుల పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని టియుడబ్ల్యుజె ఐజెయు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. సంపత్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కాగజ్ నగర్ మండలం చారిగాం దారిలో అక్రమంగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయనే సమాచారంతో వార్త సేకరణలో భాగంగా ఫోటోలు తీయడానికి అక్కడికి వెళ్లిన విలేకరిపై మైనింగ్ నిర్వాహకులు ఇష్టం వచ్చినట్లు తిడుతూ దాడి చేయడం ఏమాత్రం సరికాదన్నారు నిందితులను తక్షణమే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు.

## ‘టిఎస్’ స్థానంలో ‘టిజి’ని తక్షణమే అమలు చేయాలి

జగిత్యాల జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా



**ప్రజాపక్షం/జగిత్యాల జిల్లా ప్రతినిధి :** టిఎస్ స్థానంలో టిజిని తక్షణమే అమలు చేయాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అధికారులను ఆదేశించారు. టిఎస్ స్థానంలో టిజిని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు జిల్లాలలోని అన్ని శాఖల అధికారులు తక్షణమే అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటి వరకు తెలంగాణ రాష్ట్ర అబ్రియేషన్స్ సూచించే టిఎస్ స్థానంలో టి.జి ని వినియోగించేందుకు కేంద్రం అనుమతిస్తూ గెజిట్ జారీ చేసిన దృష్ట్యా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుండి శుక్రవారం ఉత్తర్వులు వెలువడ్డాయని అన్నారు. జిల్లాలలో ఇకపై అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలు, ఏజెన్సీలు, పబ్లిక్ సెక్టార్‌యూనిట్లు, స్వయం ప్రతిపత్తి గల సంస్థలు, వెబ్‌సైట్లు, ఆన్‌లైన్ ప్లాట్‌ఫాం లు ఏవైనా ఇతర అధికార కమ్యూనికేషన్లు సైతం తెలంగాణ కోడ్‌ను టిఎస్‌కు బదులుగా టిజిని వాడాలని కలెక్టర్ కోరారు. లెటర్ హెడ్లు, రిపోర్టులు, నోటిఫికేషన్లు, అధికారిక వెబ్‌సైట్లు, ఆన్‌లైన్ ఫ్లాట్‌ఫాం, పాలసీ పేపర్లు, జీవోలు ఇతర అధికారిక కమ్యూనికేషన్లు అన్నింటిపై టిఎస్ స్థానంలో టిజి గా మార్చాలని కలెక్టర్ పేర్కొన్నారు.

## అభివృద్ధి పనుల పరిశీలన

అదనపు కలెక్టర్ దీపక్ తివారి



**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** వచ్చే విద్యా సంవత్సరంలో పాఠశాలలు పునః ప్రారంభం అయ్యేలోగా అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి, మరమ్మత్తు పనులు పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. మంగళవారం జిల్లాలోని ఆసిఫాబాద్ మండలం వావుదం గ్రామపంచాయతీ ఖప్రి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన పనులను జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, టిఎస్ఇడబ్ల్యుఐడిసి ఎఇ శశిధర్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ద్వారా అన్ని ప్రభుత్వ పాఠశాలలో అభివృద్ధి పనులను చేపట్టడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలలో తరగతులు ప్రారంభం అయ్యేలోగా పాఠశాలలలో చేపట్టిన అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కల్పన, మరమ్మత్తు పనులు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం జిల్లా కేంద్రంలోని బజార్ వాడిలో ఆసిఫాబాద్ మండల సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఏకరూప దుస్తుల గుట్టు కేంద్రాన్ని సందర్శించారు. పాఠశాలల ప్రారంభం రోజునే విద్యార్థిని, విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందించేందుకు సిద్ధం చేయాలని, ప్రభుత్వం అందించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా దుస్తుల తయారీ కొరకు 78 కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, అధికారులు ఆయా కేంద్రాలను పర్యవేక్షిస్తూ పనులను వేగవంతం చేసే దిశగా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సమస్యలు గాలికి వదిలేస్తున్న ప్రభుత్వం

బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు

**ప్రజాపక్షం/వేములవాడ :** రైతుల సమస్యలు ప్రభుత్వం గాలికి వదిలేసి రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అమెరికాకు, దుబాయ్‌కి ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ వెళ్లారని వేములవాడ బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ చల్మెడ లక్ష్మీనరసింహారావు అన్నారు. మంగళవారం వేములవాడ పట్టణంలోని ఆయన నివాసం లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం క్యాబినెట్ సమావేశం నిర్వహించి రైతులకు అందించబోయే సంక్షేమ పథకాలు వివరించడంలో వి ఫలమైందని విమర్శించారు. రైతుబంధు ను రైతు భరోసాగా అందజేస్తామని ఎన్నికల హామీ ఇచ్చి ఇప్పుడు మంత్రులు మాట దాటవేసే సమాధానం ధోరణిపై ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. ప్రకృతి కనికరిస్తే తప్ప రైతులకు వేరే మార్గం లేనట్లుగా ప్రభుత్వం వ్యవహరిస్తుందని కాళేశ్వరం జలాలపై స్పష్టత రైతులకు ఇవ్వాల్సిన ఉందని ఆయన డిమాండ్ చేశారు. వేములవాడ సహకార సంఘం పరిధిలోనే ఇంకా 60 వేల క్వింటాళ్లు కల్లాలలోనే ఉన్నాయన్నారు. తూకం వేసిన పదవేల బస్తాలు కూడా కల్లాలలోనే ఉన్నాయని వీటిపై అధికారులు నిలదీస్తే 4, 5వేల బస్తాలకు మాత్రమే వాహనాలను సమకూర్చారని అన్నారు. మళ్లీ అకాల వర్షాలు వస్తే రైతుల పరిస్థితి ఏమిటని ఆయన ప్రశ్నించారు. కొనుగోలులో జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మరో 30 శాతం ధాన్యం ఇప్పటికే కొనుగోలు కేంద్రాల్లో ఉందని వెంటనే వాటిని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశా రు. ముంపు గ్రామాల ప్రజలకు ఐదు లక్షల 4వేలు ఎ ప్పుడిస్తారని ఆయన డిమాండ్ చేశారు. వంద రోజుల్లో అమలు చేస్తామన్న ఆరు గ్యారెంటీలో మీరు ఎన్ని ప్రజలకు నెరవేర్చారు ప్రజలకు బాహాటంగా చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ ప్రధాన కార్యదర్శి కందుల క్రాంతి కుమార్, కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్, జోగని శంకర్, సిరిగిరి రామచందర్, నరాల శేఖర్, గోలి మహేశ్, నాయకులు కమలాకర్ రెడ్డి, వెంగళ శ్రీకాంత్, ఈర్లపల్లి రాజు, సందీప్ మైలారపు రాము తదితరులు ఉన్నారు.



# మాసాంతంలోగా కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలి

రాష్ట్ర ప్రత్యేక కార్యదర్శి కృష్ణఆదిత్య




**ప్రజాపక్షం/ మంచిర్యాల ప్రతినిధి :** ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల వద్ద నుండి నిబంధనల మేరకు నాణ్యమైన ధాన్యం కొనుగోలు ప్రక్రియను మాసాంతంలోగా పూర్తి చేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని రాష్ట్ర ప్రత్యేక కార్యదర్శి, కార్మికశాఖ అధికారి కృష్ణఆదిత్య అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో మంచిర్యాల, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్లు బదావత్ సంతోష్, వెంకటేష్ ధోత్రే, మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి.రాహుల్, జిల్లాల అదనపు కలెక్టర్లు (రెవెన్యూ) సబావత్ మోతిలాల్, దాసరి వేణులతో కలిసి వరిధాన్యం కొనుగోలు ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రత్యేక కార్యదర్శి మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వ ఆదేశాల మేరకు వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, నిబంధనల మేరకు రైతుల వద్ద నుండి నాణ్యమైన వరిధాన్యం కొనుగోలు చేసి రైతులకు మద్దతు ధర చెల్లించాలని తెలిపారు. అకాల వర్షాల నుండి ధాన్యాన్ని రక్షించుకోవడానికి అవసరమైన టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. ధాన్యం తూకం చేయడానికి ముందే సంబంధిత రైతు వద్ద నుండి కూపన్, బ్యాంక్ పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం నకలు ప్రతులను తీసుకోవాలని, ఇట్టి వివరాలను ట్యాబ్లలో నమోదు చేసి ధాన్యం కొనుగోలు చేసిన రశీదు జారీ చేయాలని తెలిపారు. ఆయా కేంద్రాల పరిధిలో మిగిలి ఉన్న రైతుల వద్ద నుండి ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కొనుగోలు వివరాలను తప్పనిసరిగా రిజిస్టర్లలో నమోదు చేయాలని, జిల్లా అదనపు కలెక్టర్లు (రెవెన్యూ), రాజస్వ మండల అధికారులు, ప్రత్యేక అధికారులు, తహాశిల్దార్లు తమ పరిధిలోని కనీసం 2,3 కొనుగోలు కేంద్రాలను సందర్శించి వివరాలతో నివేదిక అందించాలని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ట్యాగింగ్ చేయబడిన రైస్ మిల్లులకు సామర్థ్యానికి అనుగుణంగా తరలించాలని, అవసరమైన లారీలను సమకూర్చాలని తెలిపారు. నిబంధనలను ఉల్లంఘించిన కొనుగోలు కేంద్రాలను బ్లాక్ లిస్టులో నమోదు చేసి సీజ్ చేసి సంబంధిత వ్యక్తులపై తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 136, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో 89, మెప్మా ఆధ్వర్యంలో 10, డిసిఎంఎస్ ఆధ్వర్యంలో 51 వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి నిబంధనల మేరకు రైతుల వద్ద నుండి నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. మంచిర్యాల నియోజకవర్గ పరిధిలో 68 కేంద్రాలలో కొనుగోలు ప్రక్రియ పూర్తి చేసి ఆయా కేంద్రాలను మూసి వేయడం జరిగిందని తెలిపారు. 99 వేల మెట్రిక్ టన్నుల వరిధాన్యం కొనుగోలు చేసి 76 శాతం ట్యాబ్ ఎంట్రీ ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందని, మిగిలిన వివరాలను 10 రోజులలో పూర్తి చేసే విధంగా జిల్లా గ్రామీణాభివృద్ధి, పౌర సరఫరాల శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలిపారు. క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించేందుకు మండలాల వారిగా అధికారులను నియమించడం జరిగిందని, కొనుగోలు వివరాలను ప్రతి రోజు ట్యాబ్లలో తప్పనిసరిగా నమోదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాల రాజస్వ మండల అధికారులు, జిల్లా అధికారులు, ప్రత్యేక అధికారులు, తహాశిల్దార్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సహాయం



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఎఆర్‌హెడ్ క్వార్టర్స్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తు ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదంలో మరణించిన హెడ్ కానిస్టేబుల్ గంగాధర అంజయ్య కుటుంబానికి 1995 బ్యాచ్ ఉమ్మడి కరీంనగర్‌కి చెందిన ఆర్మ్‌డ్ రిజర్వ్ సిబ్బంది బాసటగా నిలిచి స్వచ్ఛందంగా 1,80,000/ రూపాయలు కుటుంబా సభ్యులకు జిల్లా ఎస్‌పి అఖిల్ మహాజన్ చేతుల మీదుగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఇవ్వడం జరిగింది. పోలీసుల కుటుంబాలకు పోలీస్ శాఖ అన్ని రకాలుగా అండగా నిలుస్తుందని, ప్రభుత్వం ద్వారా వారికి రావాల్సిన అన్ని రకాల లబ్ధి సాధ్యమైనంత త్వరగా ఇప్పించేలా కృషి చేస్తామని ఎస్‌పి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ యాదగిరి, హెడ్ కానిస్టేబుల్ రవీందర్, మల్లేశం, ప్రభాకర్, బాలు, మనోజ్ కుమార్, అంజయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# గడువులోగా ఏకరూప దుస్తుల పంపిణీ చర్యలు

కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



**ప్రజాపక్షం/నిర్మల్ ప్రతినిధి :** నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పూర్తి చేయాలనీ జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక ఎన్‌టిఆర్ స్టేడియం సమీపంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో చేపటిన పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపట్టిన పనులను నాణ్యత ప్రమాణాలు పాటించి బడుల పునః ప్రారంభానికి ముందే పూర్తి చేయాలని ఆదేశించారు. మహిళా సంఘాలు,విద్యాశాఖ అధికారులు పనులను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. అనంతరం సోఫీనగర్‌లోని గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన జిల్లా కేంద్రం నుండి మండలాలకు సరఫరా కానున్న ఏకరూప దుస్తుల పంపిణీని కలెక్టర్ పరిశీలించారు. జిల్లాలోని 52,264 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు టిస్కో ద్వారా ఒక జత ఏకరూప దుస్తుల వస్త్రం దాదాపు 1,12,600 మీటర్లు జిల్లా కేంద్రానికి చేరిందని తెలిపారు. మండలాల వారీగా ఏకరూప దుస్తుల వస్త్రాన్ని అందించడం జరుగుతుందని, మండల ఎంఇఒలు, నోడల్ అధికారులు, ఏపీఎంల ఆధ్వర్యంలో స్వయం సహాయ సంఘాల (గ్రూపుల ద్వారా జూన్ 5వ తేదీ లోపు విద్యార్థులందరికీ ఒక జత ఏకరూప దుస్తులు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం మంజులాపూర్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి, ధాన్యం కొనుగోళ్లను నిరంతరం చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అవసరమైన గన్నీ బ్యాగ్స్, టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని అన్నారు. రోజువారీ ధాన్యం వివరాలను ట్యాబ్ ఎంట్రీ చేయాలని ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యం వెంటనే మిల్లులకు తరలించాలని ,నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమాలలో డి.ఈ.ఓ రవీందర్ రెడ్డి, చేనేత శాఖ ఏడి రమ్య, సిఎంఓ ప్రవీణ్, సివిల్ సప్లయిస్ డీఎం శ్రీకళ, అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# బాసర గోదావరిలో విషాదం

ప్రమాదవషాత్తు మునిగి ఒకరి మృతి



**ప్రజాపక్షం/బాసర :** నిర్మల్ జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం బాసర గోదవరి నదిలో అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రమాదవశాత్తు మునిగి ఎందరో మంది భక్తులు చనిపోతున్నా అధికారులు కనువిప్పు కలగడం లేదు. తాజాగా బాసర గోదావరి నదిలో బావ బామ్మర్దులు దర్శనానికి వచ్చి గోదావరి నదిలో పుణ్య స్నానం అచరించడానికి వెళితే ఒకరు ప్రమాదవశాత్తు మునిగి మృతి చెందిన ఘటన వెలుగులోకి వచ్చింది. బాసర ఎస్ఐ గణేష్ తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా దెగ్లూర్ మండలం చక్లూర్ గ్రామానికి చెందిన కృష్ణ పాటిల్, కామారెడ్డి మండలం జుక్కల్‌కు చెందిన లడ్డుశ్రీహరి బావ బామ్మర్దులు. మంగళవారం ఉదయం షిరిడిలో దర్శనం అనంతరం బాసర అమ్మవారి దర్శనానికి మధ్యాహ్నం 12 గంటలకు బాసర చేరుకున్నారు. పవిత్ర గోదావరి నదిలో కృష్ణ పటిల్ ప్రమాదావషాత్తు గోదావరి నదిలో మునగడం గమనించిన లడ్డు శ్రీహరి కేకలు వేయదంతో అక్కడే ఉన్న భక్తులు స్థానిక గంగ పుత్రుల సహాయంతో పోలీసుల సహకారంతో మృతదేహాన్ని వెలికి తీసారు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు బాసర ఎస్ఐ గణేష్ తెలిపారు. ఏదేమైనప్పటికి పవిత్ర గోదావరి నదిలో అధికారుల నిర్లక్షం వల్ల ఇంకెందరు ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుందో అని భక్తులు దిగ్భ్రాంతి వ్యక్త పరుస్తున్నారు. ఇప్పటికైనా బాసర గోదావరి నదిలో మొదటి ఘాట్ నుండి రెండవ ఘాట్ వరకు ఎల్లవేలలా గజ ఈతగాళ్ళను అందుబాటులో ఉంచి ప్రమాద సూచికలతో పాటు జాలిలను ఏర్పాటు చేయాలని నిరంతరం భక్తులకు మైక్ సెట్ ద్వారా అవగాహన కల్పించాలని భక్తులు వేడుకుంటున్నారు.

# చివరిగింజ వరకూ కొనుగోలు చేస్తాం

ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**ప్రజాపక్షం/ధర్మపురి :** రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని, రైతులు అధైర్యపడ వద్దని ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. మండలంలోని దోనూర్ గ్రామంలో వరి కొనుగోళ్లు పూర్తయిన సందర్భంగా కాంగ్రెస్ నాయకులు నర్సింహులు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హాయాంలో 45 నుండి 50 రోజులు సాగదీసిన వరి ధాన్యం కొనుగోళ్లు దోనూర్‌లో కేవలం 28 రోజులకే పూర్తచేయడం జరిగిందన్నారు. నిరంతరం కష్టపడి పూర్తి చేసిన హామాలీలను, రైస్‌మిల్లర్లను లక్ష్మణ్ కుమార్ చేతుల మీదుగా శాలువాతో సన్మానించారు. కాంగ్రెస్ ఇచ్చిన వాగ్దానాలను తప్పక నెరవేర్చుతుందని గడిచిన 4 మాసాల్లో ఎన్నో అభివృద్ధి పనులు చేశామని, మరెన్నో చేయాల్సి ఉందని అన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం ఖజానా మొత్తం ఖాళీ చేసి, ఖాళీ బీరువాను అప్పజెప్పి పోయారని ఎద్దేవా చేశారు. అయినప్పటికి ప్రజలకిచ్చిన వాగ్దానాలను తప్పక నెరవేర్చుతామని రైతులకు పంటలు, విత్తనాల విషయంలో ఎలాంటి ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని, రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్. దినేష్, వేముల రాజు, చిలుముల లక్ష్మణ్, రైస్‌మిల్లరు రంగ శంకరయ్య, వెంకటేశ్వర్ రావు, రైతులు తదితరులు ఉన్నారు.

**రాజీవ్ గాంధీ ఆశయ సాధనకు కృషి**

దివంగత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ ఆశయ సాధనకు కృషి చేయాలని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ధర్మపురి పట్టణంలో నంది కూడలి వద్ద మంగళవారం రాజీవ్ గాంధీ 33వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ 40ఏండ్ల వయస్సులో భారత యువ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన గొప్ప నాయకుడిని అన్నారు. పేదరికాన్ని పారద్రోలడానికి సమసమాజ స్థాపన కోసం ఆయన చేసిన సేవలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్. దినేష్, వేముల రాజు, సింహారాజు ప్రసాద్, చిలుముల లక్ష్మణ్, రాందేని మొగిలి తదితరులు ఉన్నారు.

## పెండింగ్ భూసేకరణ పూర్తిపై ప్రత్యేక దృష్టి

అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** జిల్లాలో వివిధ ప్రభుత్వ ప్రాజెక్టుల క్రింద చేపట్టాల్సిన పెండింగ్ భూసేకరణ ప్రక్రియ పూర్తి చేయడంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్ సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో పెండింగ్ భూ సేకరణపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, పెద్దపల్లి, మంథని డివిజన్‌కు సంబంధించి జాతీయ రహదారుల నిర్మాణం, సింగరేణికి సంబంధించి ఆర్.జీ 1, 2, 3లలో పెండింగ్‌లో ఉన్న భూ సేకరణ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయడంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. భూ సేకరణ ప్రక్రియ పూర్తి చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అదనపు కలెక్టర్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సమీక్షా సమావేశంలో మంథని,పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారులు హనుమా నాయక్, బి గంగయ్య, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ జిల్లా అధికారి శ్రీనివాస్, సింగరేణి అధికారులు, తహాసిల్దార్ లు, డిప్యూటీ తహాసిల్దార్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# టాస్క్ భవనం ఆధునీకరణ

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** కార్పోరేట్ లుక్ వచ్చేలా సకల సౌకర్యాలతో టాస్క్ భవనం ఆధునీకరణకు ప్రతిపాదనలను రివైజ్ చేసి సమర్పించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సంబంధిత అధికారులను సూచించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పెద్దపల్లి ఎంపిడిఓ కార్యాలయ ప్రాంగణంలోని టాస్క్ భవనాన్ని పరిశీలించి టాస్క్ భవనం ఆధునీకరణ ప్రతిపాదనలపై అధికారులకు పలు సూచనలు చేశారు. పెద్దపల్లి టాస్క్ భవన ప్రతిపాదనలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ దివ్యాంగులకు కల్పించాల్సిన సౌకర్యాలు, గ్లాస్ డోర్, ఇతర ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ కార్పొరేట్ లుక్ వచ్చే విధంగా సకల సౌకర్యాలతో టాస్క్ భవనం ఆధునీకరణ జరగాలని, ఎంట్రెన్స్‌లో టాస్క్ చిహ్నంతో కూడిన గ్లాస్ డోర్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ తెలిపారు. టాస్క్ భవనం వద్ద దివ్యాంగుల కోసం అవసరమైన సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. విద్యుత్ సరఫరాకు సంబంధించి మంచి నాణ్యతతో కూడిన ఎలక్ట్రిక్ ప్యానెల్ బోర్డులను వినియోగించాలని కలెక్టర్ తెలిపారు. టాస్క్ భవనం ప్రాంగణాన్ని నిర్దేశించుకొని కాంపౌండ్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ తెలిపారు. కాంపౌండ్ ఫెన్సింగ్ లోపల టాస్క్ భవన ప్రాంగణంలో గార్డెనింగ్, టాయిలెట్ లు ఏర్పాట్లు చేయాలనీ, బయట ఉడెన్ టేబుల్స్ ఏర్పాటు చేయాలని, ఉడెన్ టేబుల్స్ శిక్షణా తరగతుల నిర్వహణకు ఉపయోగపడే విధంగా ఉండాలని కలెక్టర్ తెలిపారు. దివ్యాంగుల కోసం అవసరమైన సదుపాయాలు కల్పించే విధంగా ప్రతిపాదనలు రివైజ్ చేసి సమర్పించాలని కలెక్టర్ సూచించారు. జిల్లా కలెక్టర్ వెంట ఉమ్మడి కరీంనగర్ జిల్లా టాస్క్ మేనేజర్ గంగా ప్రసాద్, పి.ఆర్. డి. ఈ. శంకరయ్య, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా పాలిసెట్, సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు

అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు, పాలిసెట్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆయా శాఖల అధికారులను అదనపు కలెక్టర్ రెవెన్యూ ఖీమ్యా నాయక్ ఆదేశించారు. ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు, పాలిసెట్ నిర్వహణపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని తన చాంబర్లో వివిధ శాఖల అధికారులతో అదనపు కలెక్టర్ మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ మాట్లాడారు. పరీక్ష కేంద్రాలను శుభ్రం చేయించాలని, తాగునీటి వసతి కల్పించాలని, పరీక్ష పత్రాలు పోలీస్ బందోబస్తు మధ్య తరలించాలని, చీఫ్ సూపరింటెండెంట్ గదిలో సిసి కెమెరాలు ఉండాలని అదనపు కలెక్టర్ తెలిపారు. ఇంటర్ పరీక్షలు జిల్లాలోని జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలకు చెందిన విద్యార్థులు ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరు కానున్నారు. ఫస్ట్ ఇయర్ పరీక్షలకు 2222 మంది, సెకండ్ ఇయర్ పరీక్షలకు 1412 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 24 వ తేదీ నుంచి వచ్చే నెల జూన్ 1 వ తేదీ దాకానిర్వహించనున్నారు. జిల్లాలో మొత్తం 14 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. పాలిసెట్ నిర్వహణకు 7 కేంద్రాలు ఈ నెల 24 వ తేదీన జిల్లాలో పాలిసెట్ నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ తెలిపారు. జిల్లాలో మొత్తం 7 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని వివరించారు. 1645 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారని తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల దాకా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 144 సెక్షన్ అమలు ఇంటర్ పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు 144 సెక్షన్ అమలు చేయనున్నారు. సమావేశంలో డీఈఐఓ మోహన్, డీఈఓ రమేష్ కుమార్, డీఎంహెచ్ఓ సుమన్ మోహన్ రావు, ఎస్ఎస్ఆర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రాజీవ్ గాంధీ వర్ధంతి

**ప్రజాపక్షం/మంథని:** దేశ మాజీ ప్రధాని దివంగత రాజీవ్‌గాంధీ వర్ధంతి వేడుకలను మంథనిలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. మంథని ఎమ్మెల్యే, మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు పట్టణంలోని ఆయన నివాసంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం దేశ ప్రధానిగా రాజీవ్ గాంధీ చేసిన సేవలను వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఐలి ప్రసాద్, మున్సిపల్ చైర్ పర్సన్ పెండ్రి రమాసురేష్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ సీపతి బానయ్య, జిల్లా అధికార ప్రతినిధి ఇనుముల సతీష్, మాజీ సర్పంచ్ వొడ్నాల శ్రీనివాస్, నాయకులు అజీంఖాన్, రాంరాజశేఖర్, ఆకుల శ్రీనివాస్, మంథని సత్యం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# దిలావర్పూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల పంచాయితీ

జిల్లా కలెక్టర్ ఆదేశంతో ఇందిరమ్మ ఇళ్ల ఖాళీ



**ప్రజాపక్షం/దిలావర్పూర్ :** మండల కేంద్రంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. గ్రామంలో నిర్మించిన 32 ఇందిరమ్మ ఇళ్ళను ఎలాంటి అధికారిక ఆదేశాలు లేకుండానే ఇల్లు లేని బాధితులు 20 రోజుల క్రితం ఆక్రమించుకొని అందులో నివాసం ఉంటున్నారు. కొంతమంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు జిల్లా కలెక్టర్, స్థానిక ఎంఆర్ఓ సంబంధిత అధికారులకు ఇంద్రమ్మ ఇళ్లలో ఉన్న మహిళను వెంటనే ఖాళీ చేయించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో మంగళవారం స్థానిక ఎంఆర్ఓ తగిన పోలీస్ బలగాలతో ఇంద్రమ్మ ఇళ్ల వద్దకు చేరుకొని అక్రమంగా ఇళ్లను ఆక్రమించుకొని ఉంటున్న వారు ఇళ్లను ఖాళీ చేయాలని సూచించిన వారు పట్టించుకోకుండా ఘర్షణలకు దిగారు. అధికారులు బాధితుల మధ్య సుమారు గంటన్నర పాటు వాదోపవాదాలు జరిగాయి. పోలీస్ బలగాలతో ఎంఆర్ఓ ఇండ్ల నుండి బాధిత కుటుంబాల సామాగ్రిని బయటకు తీసి సదర్ ఇండ్ల తాళాలు వేసేందుకు అధికారిక పద్ధతులను ముందుకెళ్లగా వారిని బాధిత కుటుంబాలు అడ్డుకొని ఆందోళనకు దిగాయి.

**అసలు ఏమి జరిగింది...!**

గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి స్థానిక అధికారులు పాలకుల ప్రత్యేక కృషితో గ్రామంలో 32 డబుల్ బెడ్ రూమ్‌ల నిర్మాణాలకు పునాదులు వేశారు. నిర్మాణ పనులు దాదాపు అనగా 80 శాతం వరకు పూర్తయ్యాయి. అయితే శాసనసభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అప్పటి ప్రభుత్వం అర్హులైన వారికి ఇంద్రమ్మ ఇండ్ల పంపిణీ కోసం దరఖాస్తులను స్వీకరించింది. మూడు దఫాలుగా అర్హులైన వారి నుండి దరఖాస్తులను స్వీకరించిన సంబంధిత శాఖల అధికారులు అర్హులైన వారి జాబితా కోసం పలు మార్లు సర్వేలు కూడా నిర్వహించారు. అర్హులైన వారికి 32 ఇళ్ల పంపిణీ కోసం తగిన ఏర్పాటు చేస్తున్న తరుణంలోనే శాసన సభ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. దీంతో లాంఛనంగా నిర్వహించుకోవలసిన ఇంద్రమ్మ ఇళ్ల పంపిణీ కార్యక్రమం వాయిదా పడింది, దిలావర్పూర్ మండల కేంద్రంలో ఇల్లు లేని అర్హులైన ఆయా సామాజిక వర్గాల వారు సుమారు 75కు పైగా కుటుంబాలు ఉండగా 32 ఇండ్ల నిర్మాణాలు చేపట్టడంతో ఇండల్ల పంపిణీ స్థానిక అధికారులు ప్రజా ప్రతినిధులకు తలనొప్పిగా ఉండిపోగా సమస్యాత్మకంగా మారిందని, పేదరికంతో అష్ట కష్టాల మధ్య కుటుంబ భారాలను మోసుకెళ్తున్న మేము శాశ్వత పక్కా సొంత గృహాలు లేక 20 యేళ్ళుగా అద్దె ఇళ్లలోనే ఉంటున్నాం. గత ప్రభుత్వంలో తమకు ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని నాలుగైదు సార్లు దరఖాస్తులు తీసుకున్న సంబంధిత శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు అది ఇవ్వకపోవడం బాధను కలగజేస్తుంది. సర్వేల ద్వారా ఎంపిక చేసిన అధికారులు అర్హులైన వారికి ఇల్లా పంపిణీ చేయకపోవడంలో చేస్తున్న జాప్యంతోనే బలవంతంగా ఇళ్లలోకి వచ్చి ఉంటున్న తమకు బలవంతంగా ఖాళీ చేయించడం సరికాదని వారు వాపోయారు.

## దేశంలో సంస్కరణలకు ఆద్యుడు రాజీవ్‌గాంధీ : మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/ములుగు జిల్లా ప్రతినిధి :** దేశంలో సంస్కరణలకు ఆద్యుడు మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ అని మంత్రి సీతక్క అన్నారు. హైదరాబాద్ లోని మంత్రి సీతక్క క్యాంపు కార్యాలయంలో రాజీవ్‌గాంధీ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ కంప్యూటర్ విద్యను అమలు చేసి దేశంలోని యువతకు ఉపాధి అవకాశాలు కల్పించిన ఘనత మాజీ ప్రధాని దివంగత రాజీవ్‌గాంధీదన్నారు. గాంధీ కుటుంబం మొత్తం దేశానికి, దేశ ప్రజల సేవకే అంకితమైందన్నారు. రాజీవ్‌గాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు అనేక సంస్కరణలు తెచ్చి దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించారని కొనియాడారు. గ్రామ స్వరాజ్యం తీసుకురావాలని 73, 74 అమెండ్మెంట్ ద్వారా పంచాయతీరాజ్ సంస్థలను బలోపేతం చేయడానికి కేంద్రం నుండి గ్రామ పంచాయతీలకు నేరుగా నిధులను పంపించే వ్యవస్థను ఆనాటి ప్రధానిగా రాజీవ్‌గాంధీ చేసిన విషయాన్ని దేశంలో ఉన్న స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు గుర్తు చేసుకోవాలన్నారు. గ్రామ స్వరాజ్యానికి పునాదులు వేసిన గొప్ప మహనీయుడు రాజీవ్‌గాంధీ ఆలోచనలను ముందుకు తీసుకెళ్ళాలని సీతక్క అన్నారు.

## మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలిపించాలి

### పట్టభద్రులకు ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఖాద్రీ వినతి



**ప్రజాపక్షం/హన్మకొండ ప్రతినిధి :** వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోటీచేస్తున్న తీన్మార్ మల్లన్నకు కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి, యువజన సంఘాలు సంపూర్ణ మద్దతు తెలిపింది. ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వల్లి ఉల్లా ఖాద్రీ, యూనివర్సిటీ విద్యార్థి నాయకుడు ప్రేమ్, కేయూ జాక్ నాయకులు దుర్గం సారయ్య, కన్నం సునీల్, టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, యూత్ కాంగ్రెస్ నాయకుడు కార్తీక్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు పల్లకొండ సతీష్, కాకతీయ యూనివర్సిటీ మొదటి గేట్ వద్ద కరపత్రాలు విడుదల చేసి తీన్మార్ మల్లన్నకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తీన్మార్ మల్లన్న గెలిపించడం వల్ల విద్యావంతులు, నిరుద్యోగులు, ప్రజల పక్షాన కాక తెలంగాణలో సబ్బండ వర్గాల ప్రశ్నాన ప్రశ్నించడాన్ని పోరాడటానికి మండలికి పంపించినట్లు అవుతుందన్నారు. ప్రశ్నించే గొంతుక, నిత్యం ప్రజల సమస్యలపై పోరాడే వ్యక్తి, గత ప్రభుత్వంలో జరిగిన అవినీతి అక్రమాలు, అరాచకాలను ఎప్పటికప్పుడు ప్రజల ముందు ఉంచి నికార్సైన జర్నలిస్టుగా పేరొందిన తీన్మార్ మల్లన్నను మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలిపించాలని పట్టభద్రులను కోరారు. సమావేశంలో రామంచ శ్రీను, టీఎస్ఎఫ్ సిటీ ప్రెసిడెంట్ నాగారం మణి తేజ, సునీత, రాజేశ్వరి, మనిలా గని తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారమే సిపిఐ ఎజెండా

### భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా

### పార్టీలో 20 కుటుంబాలు చేరిక



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం(పాల్వంచ) :** ప్రజా సమస్యల పరిష్కారమే సిపిఐ ఎజెండా అని భారత కమ్యూనిస్టు పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా అన్నారు. మంగళవారం పాల్వంచ మండల పరిధిలోని ఉల్వనూరు గ్రామపంచాయితీలో సుమారు 20 కుటుంబాల వారు పార్టీలో చేరారు, వారికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం సాబీర్‌పాషా మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కరించేందుకు సిపిఐ అనునిత్యం పనిచేస్తుందన్నారు. పార్టీని నమ్ముకుని ఉన్న కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామన్నారు. ప్రజలకు సేవలందించే పార్టీలనే ప్రజా క్షేత్రంలో ప్రజలు ఆదరిస్తారని, సిపిఐ సేవలను గుర్తించి ఇటీవల వందలాది మంది వివిధ పార్టీల నుండి చేరుతున్నారన్నారు. వారినమ్మకాన్ని ఒమ్ముచేయని, ఏ సమస్య వచ్చినా దగ్గరుండి పరిష్కరిస్తామన్నారు. పార్టీలో చేరినవారిలో వజ్జా వాసు, పాయం నగేష్, వజ్జా కృష్ణ, కాలం నర్సింహారావు, అంబటి బాబుతో పాటు 20 కుటుంబాల వారు ఉన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, పాల్వంచ మండల కార్యదర్శి వీశంశెట్టి పూర్ణచంద్రావు, వేములపల్లి శ్రీనివాసరావు, కంటెం సత్యనారాయణ, ఆలెం సమ్మయ్య, వజ్జ నారాయణ, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలులో అలసత్వం వద్దు : కలెక్టర్ జెండగే



**ప్రజాపక్షం/బొమ్మలరామారం :** ధాన్యం కొనుగోళ్లను వేగంగా పూర్తి చేయాలని, కొనుగోలు విషయంలో అలసత్వం వద్దని యాదాద్రి జిల్లా కలెక్టరు హనుమంతు కే.జెండగే అధికారులను అదేశించారు. మంగళవారం మండలంలోని మర్యాల గ్రామం ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీ ప్యాక్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి కొనుగోళ్లను పరిశీలించారు. రిజిష్టర్లను, లారీల రవాణ వివరాలను పరిశిలించారు. సెంటర్లో రైతులకు సరైన సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ధాన్యం త్వరగా లారీలకు ఎత్తి మిల్లులలో త్వరగా అన్ లోడ్ చేయాలని, కొనుగోళ్ల వేగం గా పూర్తిచేయాలని ఆదేశించారు. అనంతరం రైతులతో మాట్లాడారు. ప్రతి గింజ కొనుగోలు చేయడం జరుగుతుందని, రైతులు ఎలాంటి ఆందోళనలు చెందవద్దని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దారు శ్రీనివాస్, సెంటర్ నిర్వాహకులు బాబు తదితరులు ఉన్నారు.

# కాంగ్రెస్, కమ్యూనిస్టుల కలయికతో మల్లన్న విజయం ఖాయం

### సిపిఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి



**ప్రజాపక్షం/దేవరకొండ :** కమ్యూనిస్టులు, కాంగ్రెస్‌ల కలయికతో నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న విజయం ఖాయమని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. దేవరకొండలోని పల్లా పర్వత్‌రెడ్డి భవన్ సిపిఐ కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో పల్లా వెంకట్‌రెడ్డి మాట్లాడారు. ఎమ్మెల్సీ ఉపఎన్నికకు సిపిఐ రాష్ట్ర సమితి సంపూర్ణ మద్దతు ప్రకటించిందన్నారు. అసెంబ్లీ ఎన్నికల తరహాలోనే, ఉపఎన్నికల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీ గెలవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో సిపిఐగా సంపూర్ణ మద్దతు ప్రకటించి కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటుకు సహకరించామని, అదే తరహాలో పట్టభద్రుల ఎన్నికల్లో సిపిఐ మద్దతుతో ఎమ్మెల్సీగా మల్లన్నను గెలిపిస్తామన్నారు. ప్రభుత్వానికి శాసనసభలో ఉన్న బలం మండలిలో ఉండాలని, అందుకోసం సిపిఐ, సిపిఐఎంలు మద్దతు ప్రకటించాయన్నారు. మల్లన్న బిఆర్ఎస్ ప్రభుత్వంపై చేసిన ఆరోపణలన్నీ ఆధారాలతో చేసినవి తప్పా, అకారణంగా చేసినవి కావన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులు పెట్టిన భయపడకుండా ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో ప్రధానపాత్ర మల్లన్న పోషించాడన్నారు. ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల్లో కాంగ్రెస్, కమ్యూనిస్టులు కలిస్తే మల్లన్న విజయం తథ్యం అని, ప్రశ్నించే గొంతుక మల్లన్నను గెలిపించడం కోసం సిపిఐ, కాంగ్రెస్ శ్రేణులు సమాయత్తం కావాలని సూచించారు. ఉద్యోగులు, నిరుద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, విద్యార్థులు తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి ఎమ్మెల్సీగా గెలిపించాలని పల్లా కోరారు. దేవరకొండ ఎంఎల్ఎ బాలునాయక్ మాట్లాడుతూ పదేళ్ల బిఆర్ఎస్ ప్రభుత్వంలో నిరుద్యోగులను మోసం చేసిన విధంగా గతంలో ఏ ప్రభుత్వాలు చేయలేదన్నారు పదేళ్ల పాలనలో బిఆర్ఎస్ నాయకులు రాష్ట్రాన్ని గజ దొంగల్లా దోచుకున్నారన్నారు. 317జిఒ సాకుగా చూపి ఉపాధ్యాయ బదిలీల్లో భార్యభర్తలను ఇబ్బందులకు గురి చేసి, 20 మంది టీచర్ల చావుకు కారణమైన బిఆర్ఎస్, ఇప్పుడు టీచర్ల గురించి మాట్లాడడం దయ్యాలు వేదాలు వల్లించినట్లేనన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తీన్మార్ మల్లన్న విజయం ఖాయం అని, అందుకోసం సిపిఐ, కాంగ్రెస్, సిపిఎం శ్రేణులు కలిసి పనిచేయాలన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలిపించాలని ఉద్యోగులు, నిరుద్యోగులు, విద్యార్థులను ఆయన కోరారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే డా.కుడుదుల నగేష్, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహా రెడ్డి, జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, జిల్లా నాయకులు వెంకటరమణ, బుచ్చిరెడ్డి, రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు మైనోద్దీన్, లక్ష్మ మ్మ, వల్లపురెడ్డి, పట్టణ అధ్యక్షులు యూనుస్, రవీంద్రశర్మ, రామస్వామి, వెంకట్రాములు, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, జ్యోతిబస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల గొంతుకను గెలిపించండి

### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** సమస్యల పరిష్కారం కోసం ప్రజల పక్షాన ప్రశ్నించే గొంతుకైన తీన్మార్ మల్లన్నను అత్యధిక మెజార్టీతో ఎంఎల్‌సి ఉప ఎన్నికల్లో గెలిపించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఖమ్మం నగరంలోని ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో వరంగల్ నల్గొండ ఖమ్మం పట్టభద్రుల ఉప ఎన్నికల ఎంఎల్‌సి అభ్యర్థి తీన్మార్ మల్లన్న విజయాన్ని కాంక్షిస్తూ ఏర్పాటు చేసిన ఖమ్మం నియోజక వర్గ స్థాయిలో సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ రాబోయే ఎంఎల్‌సి ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను పట్టభద్రులు అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. మల్లన్న గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదని గత 10 ఏళ్లుగా ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోరాటం సాగించారన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ అరాచకాలను, నియంత పోకడలను ప్రశ్నించినందుకే మల్లన్న పై అక్రమ కేసులు బనాయించారన్నారు. బిజెపి, బిఆర్ఎస్ లకు ఓటు అడిగే నైతిక హక్కు లేదన్నారు. కాంగ్రెస్ పరిపాలన పట్ల విమర్శలు చేస్తున్నారని గత ప్రభుత్వ హయాంలో వ్యవస్థలన్ని నిర్వీర్యం చేశారని వాటిని గాడిలో పెట్టి సుపరిపాలనను అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని తప్పకుండా అమలు చేస్తుందన్నారు. ధాన్యానికి రూ. 500 బోనస్ కూడా సన్న రకానికి ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. తీన్మార్ మల్లన్నను గెలిపిస్తే పట్టభద్రులు, నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తారని ఆయన తెలిపారు. పట్టభద్రులు ఆలోచించి తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి అభ్యర్థి తీన్మార్ మల్లన్న, పార్లమెంటు అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నగర అధ్యక్షులు మహ్మద్ జావిద్, సిపిఐ నగర అధ్యక్షులు ఎస్‌కె జానిమియా, మేయర్ పునుకొల్లు నీరజ, మాజీ ఎంఎల్‌సి బాలసాని లక్ష్మి నారాయణ, నూకల నరేష్‌రెడ్డి, బాలగంగాధర్ తిలక్, యువజన నాయకులు సంతోష్, పలువురు ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

## పట్టభద్రులు ఆలోచించండి

### మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** ఖమ్మం, నల్లగొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తీన్మార్ మల్లన్న గెలుపును కెసిఆర్ ముక్కు నెలకు రాసినా ఆపలేదని రాష్ట్ర రెవిన్యూ, గృహనిర్మాణం, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఖమ్మం రూరల్ మండలంలోని టీసీవీరెడ్డి ఫంక్షన్‌హాల్‌లో జరిగిన పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి ప్రసంగించారు. తీన్మార్ మల్లన్నపై వంద కేసులు ఉన్నాయని బిఆర్ఎస్ నాయకులు అంటున్నారని, గత ప్రభుత్వ నియంత పోకడలను, అరాచకాలను ప్రశ్నించినందుకే మల్లన్నపై కేసులు బనాయించారన్నారు. పైశాచికానందం పొందడానికి మల్లన్నను జైల్లో పెట్టి హింసించారన్నారు. తీన్మార్ మల్లన్న లక్షా పాతిక వేల మెజారిటీతో ఘనవిజయం సాధిస్తారన్నారు. తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కెసిఆర్, కెటిఆర్‌లు నాపై కక్షపూరితంగా వ్యవహరించారన్నారు. రోజుల తరబడి జైల్లో పెట్టి, నా భార్యాబిడ్డలకు మనశ్శాంతి లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ పట్టభద్రులను రోడ్డున పడేసిందని, వారి స్వార్థానికి ఈ ఉపఎన్నిక వచ్చిందన్నారు. నన్ను గెలిపిస్తే ప్రజలు, పట్టభద్రుల పక్షానా చట్టసభలో గళం వినిపిస్తానన్నారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ మాట్లాడుతూ ప్రభుత్వాలను ప్రశ్నించడానికి తీన్మార్ మల్లన్నకు పట్టభద్రులు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాల్సిన బాధ్యత ఉందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఖమ్మం లోక్‌సభ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి, ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌ఛార్జ్ రఘునాథ్‌యాదవ్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్, రాష్ట్ర విద్యా, మౌలిక వసతుల కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయబాబు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మి నారాయణ, సిపిఐ నాయకులు లింగా వెంకటనారాయణ, కొనకటి కృష్ణరెడ్డి, తిరుమలాయపాలెం జెడ్పిటీసీ బెల్లం శ్రీను, ఎంపీపీలు బోడా మంగీలాల్, బానోత్ శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు కళ్లెం వెంకట్‌రెడ్డి, మద్ది కిషోర్‌రెడ్డి, అజ్మీర అశోక్, బ్రహ్మానందరెడ్డి, బానోత్ భాస్కర్, రైట్‌ఛాయిస్ అధినేత మెండెం కిరణ్, చావా శివ రామకృష్ణ, నెల్లూరి భద్రయ్య, కొడాలి గోవిందరావు, కొప్పుల అశోక్, ధరావత్ రామ్మూర్తి నాయక్, భైరు హరినాథ్‌బాబు, మద్ది మల్లారెడ్డి పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిఆర్ఎస్, బిజెపి కుట్ర

### ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్



**ప్రజాపక్షం/నల్లగొండ :** బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు కుమ్మక్కై తీన్మార్ మల్లన్నను ఓడించేందుకు కుట్రలు చేస్తున్నారని ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఆరోపించారు. మంగళవారం నల్లగొండలోని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి క్యాంపు కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్‌కుమార్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బల్మూరి వెంకట్ మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టిన ప్రతి హామీని నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే అన్ని సంక్షేమ పథకాలు ప్రారంభమవుతాయని స్పష్టం చేశారు. అదేవిధంగా జాబ్ క్యాలెండర్‌తో పాటు నోటిఫికేషన్‌పై సంపూర్ణ స్పష్టత ఇస్తామని వెల్లడించారు. జీవో నెంబర్ 46,317, ఇతర ఉద్యోగుల సమస్యలపై తమ ప్రభుత్వం క్యాబినెట్ సబ్ కమిటీ వేసి పరిష్కరిస్తుందన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో తీన్మార్ మల్లన్న గెలుపు కోసం ప్రతి కాంగ్రెస్ పార్టీ కార్యకర్త కృషి చేయాలని కోరారు. కపిలవాయి దిలీప్‌కుమార్ మాట్లాడుతూ బిజెపి, బిఆర్ఎస్ ప్రభుత్వాలు గత పది సంవత్సరాలుగా నిరుద్యోగులను అన్ని విధాలుగా మోసం చేశాయని విమర్శించారు. మాజీ ఎమ్మెల్సీ ఎన్నికలలో ప్రశ్నించే గొంతుక అయిన తీన్మార్ మల్లన్నను గెలిపించాలని కోరారు. సమావేశంలో డిసిసి అధ్యక్షుడు కేతావత్ శంకర్ నాయక్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, జెడ్పిటిసి వంగూరి లక్ష్మయ్య, మాజీ జెడ్పిటిసి గుంజ రేణుక సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఐకెపి సెంటర్‌లో ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి : సిపిఐ



**ప్రజాపక్షం/బొమ్మలరామారం :** ఐకెపి సెంటర్లలో ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని సిపిఐ మండల కార్యదర్శి అన్నేమైన వెంకటేశం అన్నారు. మంగళవారం సిపిఐ ఆధ్వర్యంలో మండల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాస్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అకాల వర్షాలతో రైతులు పండించిన పంటను నష్టపోతున్నారన్నారు. ఐకెపి సెంటర్లలో రైతులు తెచ్చిన ధాన్యాన్ని సమయానికి కొనుగోళ్లు చేయక పోవడంతో అకాల వర్షాలకు ధాన్యం తడిసి రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం రైతుల పండించిన పంటలు త్వరగా కొనుగోలు చేయాలని, రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రాజప్ప, మురళి భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## విత్తనాలపై రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన

### వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి :** ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున విత్తనాలపై రైతులకు క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ డైరెక్టర్, జనగామ జిల్లా ప్రత్యేక అధికారి బి గోపి అధికారులను ఆదేశించారు. మంగళవారం 'రైతు నేస్తం' కార్యక్రమంలో భాగంగా జనగామ జిల్లాలోని గానుగ పహాడ్ రైతు వేదిక నుండి అన్ని జిల్లాల వ్యవసాయ శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వయించి మాట్లాడారు. వానాకాలం పంటకు ప్రభుత్వం అత్యంత ప్రధాన్యత ఇస్తుందన్నారు. గ్రామ స్థాయిలో ఎప్పటికప్పుడు విత్తనాలు, ఎరువుల కేంద్రాలను పరిశీలించాలని, ఎదైనా సమస్య ఎదురైతే వెంటనే స్పందించాలన్నారు. విడి విత్తనాలు ఎట్టి పరిస్థితిలో కొనుగోలు చేయకూడదని, ప్యాక్ చేసిన విత్తనాలను మాత్రమే కొనుగోల చేయాలని, లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని రైతులకు సూచించారు. క్షేత్ర స్థాయిలో రైతులకు విత్తనాలు, ఎరువులపై షార్ట్‌ఫిల్మ్స్ ద్వారా పల్లెల్లో రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రైతులు అవగాహన పొందేందుకు గాను రైతువేదికల్లో పోస్టర్లు, బ్యానర్లు ఏర్పాటు చేయాలని, కొనుగోలు చేసిన విత్తనాల ఫ్యాకింగ్ కవర్, రసీదును రైతులు జాగ్రత్తగా భద్రపర్చాలన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఎరవుల డీలర్లు తప్పనిసరిగా రైతుల వారీగా మూడు రిజిస్టర్లు సక్రమంగా నిర్వయించాలని, లేదంటే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. గ్రామ స్థాయిలో ఏఎంఓలు ఏఈవోలు విత్తనాలు, ఎరువుల డీలర్ కేంద్రాలను సందర్శించి అత్యంత జాగ్రత్తగా పర్యవేక్షించాలని, క్షుణంగా రిజిస్టర్‌లను తనిఖీ చేయాలని, రోజువారి నివేదికలు సమర్పించాలన్నారు. అనంతరం పాలకుర్తి మండలంలోని ఎల్లలరాయిని తొర్రూర్ గ్రామ పంచాయితీలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్‌తో కలిసి పరిశీలించారు. ధాన్యం తేమ శాతం, కొనుగోళ్లపై వివరాలను సంబంధిత అధికారుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. ధాన్యం బస్తాలను లారీల్లోకి త్వరితగతిన లోడింగ్ చేసి మిల్లులకు వెంటనే తరలించాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్ల వివరాలు ఎప్పటికప్పుడు ఓపిఎంఎస్‌లో నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌డిఓ వెంకన్న, డిఏఓ వినోద్‌కుమార్, డిసిఎస్ఓ రోజారాణి, డిఎం సివిస్ ప్రసాద్, పాలకుర్తి తహసీల్దార్ వెంకటేశం, డిటిలు శ్రీనివాస్, దేవా పాల్గొన్నారు.

## కఠోర శ్రమతోనే లక్ష్యసాధన

### కలెక్టర్ పమేలా సత్పతి



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** అనుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు విద్యార్థులు కఠోరంగా శ్రమించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. మంగళవారం కరీంనగర్‌లోని జిల్లా గ్రంథాలయాన్ని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా వారధి సొసైటీ ఆధ్వర్యంలో గ్రూప్–1 అభ్యర్థులకు ఏర్పాటు చేసిన మాక్ టెస్ట్‌ను పరిశీలించారు. ఎంతమంది అభ్యర్థులు హాజరయ్యారు. ఎన్నిటెస్టులు పెడుతున్నారు? అని పలు వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. 270మంది గ్రూప్ 1 మాక్ టెస్ట్ రాస్తున్నారని, ఐదు టెస్టులు ఏర్పాటు చేశామని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు ప్రతి రోజు గ్రంథాలయానికి వచ్చి ప్రిపేర్ కావచ్చని తెలిపారు. జూన్ 9న జరుగనున్న గ్రూప్ 1 ప్రిలిమ్స్ ఎగ్జామ్‌కు అభ్యర్థులంతా తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. అనుకున్నలక్ష్యాన్ని సాధించేందుకు ఎంత కష్టమైనా వెనుకడుగు వేయవద్దని పేర్కొన్నారు. క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకెళ్లాలని పేర్కొన్నారు. తద్వారా లక్ష్యాన్ని త్వరగా చేరుకోవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా గ్రంథాలయానికి సంబంధించిన పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రంథాలయంలో చేపట్టిన పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, వారధి సొసైటీ మెంబర్ సెక్రటరీ జి.ఆంజనేయులు, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సరిత తదితరులున్నారు.

## సిఎం ప్రభృతుల నివాళి

(మొదటి పేజీ తరువాయి)

తీర్చడంలో రాజీవ్‌గాంధీ మార్గాన్ని రాష్ట్ర ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తుందని తెలిపారు. గాంధీభవన్‌లో జరిగిన కార్యక్రమం లో రవాణా, బిసి సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ భారతదేశాన్ని 21వ శతాబ్దంలోకి తీసుకుపోవడానికి ఆనాడు చేపట్టిన కార్యాచరణలో భాగంగానే నేడు భారతదేశం సాంకేతికరంగంలో విప్లవాత్మకమైన మార్పులు సాధించడానికి కారణమైందన్నారు. అదే విధంగా గ్రామీణ ప్రాంతాల్లో గ్రామ స్వరాజ్యం తేవడానికి కూడా నేరుగా ఢిల్లీ నుండి పల్లె వరకు నిధులను తీసుకురావడానికి కార్యాచరణను తీసుకున్న గొప్పవ్యక్తి రాజీవ్ గాంధీ అని పేర్కొన్నారు. పల్లెలు బాగుండాలని ఆశించిన వ్యక్తుల్లో రాజీవ్‌ను విస్మరించలేమని, అటువంటి వ్యక్తిని కొనియాడి నివాళులు అర్పించడం మన బాధ్యత అని పొన్నం ప్రభాకర్ అన్నారు. కాగా, ఈ సందర్భంగా ఉగ్రవాదానికి వ్యతిరేకంగా శాంతిని కాపాడడానికి కాంగ్రెస్ కార్యకర్తలు బాధ్యత తీసుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. రాజీవ్ గాంధీ వర్ధంతిని ఉగ్రవాద వ్యతిరేక దినంగా పాటించాలని, ఆయన అడుగుజాడల్లో నడుస్తామని వారు పిలుపునిచ్చారు. విదేశాల్లోనూ రాజీవ్ వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించారు. న్యూయార్క్‌లోని టైమ్స్ స్క్వేర్ వద్ద మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించారు.

## పంచాయతీ ఎన్నికలకు కసరత్తు

(మొదటి పేజీ తరువాయి)

నిధుల కూడా పాలకవర్గం ఉంటనే గ్రామపంచాయితీలకు రానున్నాయి. ప్రభుత్వం తీసుకునే నిర్ణయం ఆధారంగానే గ్రామపంచాయితీలకు, మండల పరిషత్, జిల్లా పరిషత్‌లకు ఎన్నికలు జరిగే అవకాశముంది.

**రంగంలో ఆశావహులు ...**ఈ గ్రామపంచాయితీ, మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికలపై ప్రధాన పార్టీల గ్రామ,మండల స్థాయి నేతలు ఆశలు పెట్టుకున్నారు. ఇప్పటి వరకు పదవులు అనుభవించిన వారితో పాటు కొత్తగా పోటీ పడే వారు కూడా ముందస్తు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించే ఆలోచనలో ఉండటంతో ఆశావాహులు గ్రామస్తులను ఆకట్టుకునే పనిలో పడ్డారు. పదేళ్లుగా పదవులకు దూరంగా ఉన్న కాంగ్రెస్ నాయకులు ఎలాగైనా స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధపడుతున్నారు. తమ ప్రభుత్వం అధికారంలో ఉండటంతో ఫలితాలు తమకు అనుకూలిస్తాయని ఆశిస్తున్నారు. ప్రభుత్వం పాత రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికలు నిర్వహించినా, కొత్త రిజర్వేషన్లు ప్రకటించి ఎన్నికలు పెట్టినా పోటీకి సిద్దంగా ఉన్నారు. కాంగ్రెస్ నేతలతో పాటు బిఆర్ఎస్, బిజెపి నేతలు కూడా పోటీకి సై అంటున్నారు. కాగా ఎప్పట్నుంచో కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్న నేతలకు ఈ మధ్య కాలంలో పార్టీలో చేరిన వారితో తలనొప్పి ఎదురయ్యే అవకాశం లేకపోలేదు. దీంతో గ్రామ పంచాయితీల ఎన్నికల్లో గట్టిపోటీ నెలకొనే అవకాశం ఉండగా, ఇక ప్రభుత్వం తీసుకునే నిర్ణయమే తరువాయి.

**ఎటూ తేలని పంచాయితీ...** భద్రాచలం, సారపాక గ్రామపంచాయితీల పంచాయితీ ఎటూ తేలడం లేదు. వీటిని మున్సిపాలిటీలుగా చేసే క్రమంలో గత ప్రభుత్వం గ్రామపంచాయితీల లిస్టులో నుండి తప్పించింది. అయితే వీటిని గ్రామపంచాయితీలుగానే కొనసాగించాలని గిరిజన సంఘాలు కోర్టును ఆశ్రయించాయి. ఇదిలా ఉండగా గత బిఆర్ఎస్ ప్రభుత్వం భద్రాచలం గ్రామ పంచాయితీని భద్రాచలం, శాంతినగర్ , సీతారాంనగర్ పంచాయితీలుగా మూడు ముక్కలు చేసింది. అయితే ఈ ఫైల్‌ను గవర్నర్ తమిళ సై వద్దకు పంపినప్పటికి ఆమె తిరస్కరించడంతో పెండింగ్‌లో పడింది. కాంగ్రెస్ ప్రభుత్వం పంచాయితీ ఎన్నికలు నిర్వహిస్తే భద్రాచలం, సారపాకలను తిరిగి గ్రామపంచాయితీల లిస్టులో చేర్చి ఎన్నికలు నిర్వహిస్తారా, మున్సిపాలిటీగా చేసేందుకే మొగ్గు చూపుతారా అనేది తేలాల్సింది. కాగా భద్రాచలం గ్రామపంచాయితీకి 1968లో తొలిసారి ఎన్నికలు నిర్వహించారు. ఆ తర్వాత వివాదాల కారణంగా నిలిచిపోయాయి. మరోసారి 1987లో జరిగాయి. అప్పట్నుంచి చోటు చేసుకున్న పరిణామాల వల్ల ఆగిపోయాయి. తిరిగి 2013లో ఆఖరి సారి భద్రాచలం గ్రామపంచాయితీకి ఎన్నికలు జరిగాయి. అప్పట్నుంచి ఇప్పటివ వరకు పాలక మండలికి ప్రజలు నోచు కోవడం లేదు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR - 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com

## రూ.50 వేలు ఇస్తే.. కేసు నుంచి తప్పిస్తాం..!

### డిజిపి రవిగుప్తా పేరుతో వాట్సాప్‌లో బెదిరింపులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర డిజిపి రవిగుప్తా ఫొటోతో వాట్సాప్‌లో కేటుగాళ్లు సైబర్ నేరాలకు పాల్ప డుతున్న ఉదంతం మంగళవారం వెలుగు చూసింది. డిపిపి ఫొటో వాట్సప్ డిపిగా పెట్టి ఓ వ్యాపారవేత్తకు అగంతకులు వాట్సాప్ కాల్ చేశాడు. వ్యాపారవేత్త కూతురుకు సైతం ఫోన్ చేసి బెదిరించాడు. డ్రగ్స్ కేసులో అరెస్ట్ చేస్తామని బెదిరించి.. కేసు నుంచి తప్పించేందుకు రూ.50 వేలు డిమాండ్ కూడా చేశాడు. అనుమానం వచ్చిన సదరు వ్యాపారవేత్త పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ ఉదంతం వెలుగు చూసింది. +92 కోడ్ తో వచ్చిన ఈ వాట్సాప్ కాల్.. పాకిస్తాన్ కోడ్ అని సైబర్ పోలీసులు అంటున్నారు.



## కూలీలందరికీ ఉపాధి పని కల్పించాలి : అంజయ్య



**ప్రజాపక్షం/యాచారం :** పని అడిగిన ప్రతికూలీకి ఉపాధి పని కల్పించాలని వ్యకాస రంగారెడ్డి జిల్లా అధ్య క్షుడు పి.అంజయ్య డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని చింతపట్ల గ్రామంలో ఉపాధి పను లను ఆయన పరిశీలించారు. కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడు తూ గ్రామాల్లో పనులు లేక కూలీలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కూలీలందరికి పని కల్పించాల్సిన భాధ్యత అధికారులపై ఉందన్నారు. కూలీలకు పని కల్పించక పోతే నిరుద్యోగ భృతి ఇవ్వాలన్నారు. కార్య క్రమంలో ప్రభాకర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర గీతం సిద్ధం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రం అవతరించి పది సంవత్సరా లు పూర్తవుతున్న నేపథ్యంలో రాష్ట్ర గీతం రూపకల్పనకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తును పూర్తి చేసింది. ప్రముఖ కవి అందెశ్రీ రాసిన ‘ జయ జయ జయహే’ గీతానికి కొన్ని మార్పులు చేసి, ఒకటిన్నర నిమిషం నిడివిలో ద చేశారు. ఈగీతాన్ని సినీ సంగీత దర్శకుడు కీరవాణితో కంపోజింగ్ చేయిం చారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డితో సంగీత దర్శకుడు, ఆస్కార్ అవార్డ్ గ్రహిత ఎం.ఎం.కీరవాణి, రచయిత, నేపథ్య గాయకుడు అందెశ్రీ మంగళ వారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. వారితో పాటు ముఖ్యమంత్రి ముఖ్య సలహాదారులు వేం.నరేందర్‌రెడ్డి, సిఎం సిపిఆర్ఓ బోరెడ్డి అయోధ్యరెడ్డి, అద్ధంకి దయాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డికి గీతాన్ని వినిపించారు. రాష్ట్ర గీతాన్ని జూన్ 2న ఎఐసిసి అగ్ర నాయకురాలు సోనియాగాంధీ చేతుల మీదుగా ఆవిష్కరించనున్నారు. ఈ గీతంలో రెండు చరణాల్లో తెలంగాణ అవిర్భావం ఎలా జరిగింది, రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలను గుర్తుకొచ్చేలా రూపొందించారు.

## దేశానికి సాంకేతికరంగాన్ని తీసుకువచ్చిన ఘనత రాజీవ్‌గాంధీదే

### షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** భారత దేశానికి సాంకేతిక రంగాన్ని తీసుకువచ్చి పరిచయం చేసిన మహావ్యక్తి దివంగత రాజీవ్‌గాంధీ అని షాద్‌నగర్ శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం షాద్‌నగర్‌లో రాజీవ్ గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశా రు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ నేడు భారత దేశం శాస్త్ర సాంకేతిక రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందంటే అది రాజీవ్ గాంధీ పుణ్యమేనన్నారు. రాజీవ్‌గాంధీ ఆశయాలను ప్రతి కాంగ్రెస్ కార్య కర్త కొనసాగించాలన్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ పార్టీ అనేక సంక్షేమ పథకాలను అందుబాటులోకి తీసుకువచ్చి నట్లు తెలిపారు. పేదల అభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో టిపిసిసి సభ్యులు బాబర్‌ఖాన్, ఎంపిపి ఇద్రీస్, జడ్పిటిసి వెంకట్‌రాంరెడ్డి, పట్టణ అధ్యక్షుడు చెన్నయ్య, మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అందె మోహన్, అందె శ్రీకాంత్, సత్తయ్య, కొత్తూరు మండల పార్టీ అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, కేశంపేట మండల అధ్యక్షుడు వీరేష్, లింగారెడ్డిగూడ అశో క్‌తోపాలు కార్యకర్తలు పాల్గొన్నారు.

### రాజీవ్‌గాంధీ సేవలు మరువలేనివి

**జిల్లెడు చౌదరిగూడలో..**షాద్‌నగర్ నియోజకవర్గంలోని జిల్లేడు చౌదరి గూడ మండల కేంద్రంలో సరాజీవ్‌గాంధీ వర్ధంతి నిర్వహించారు. మండ ల పార్టీ అధ్యక్షుడు రాజు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ప్రధాని భారతరత్న ఆవార్డు గ్రహిత రాజీవ్‌గాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్ళు అర్పించారు. దేశానికి రాజీవ్‌గాంధీ చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో తాలుకా బీసిసెల్ అధ్య క్షుడు చంద్రశేఖర్, ఎంపిటిసిల సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ రెడ్డి, ఎంపిటిసి సభ్యురాలు రజిత వెంకటయ్య, కిసాన్ కాంగ్రెస్ పార్టీ అధ్య క్షుడు వెంకట నర్సింహ్మారెడ్డి, ఎస్సీసెల్ అధ్యక్షుడు రవికుమార్, ఎస్టిసెల్ అధ్యక్షుడు చందునాయక్ ఉన్నారు.

**హయత్ నగర్ :** ఎల్.బినగర్ అసెంబ్లీ సెగ్మెంట్ లో హయత్ నగర్ డివిజ నల్ లో భారత మాజీ ప్రధాని భారతరత్న రాజీవ్ గాంధీ వర్ధంతి సంద ర్భంగా హయత్ నగర్ డివిజన్ అధ్యక్షుడు చెన్నగొని రవీందర్ గౌడ్ ఆధ్వ



ర్యంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు. కార్య క్రమంలో నాయకులు రెంటాల కృష్ణయ్య, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ దాసరిముని శ్రీనివాస్ ముదిరాజ్, వేముల శ్రీనివాస్ ముదిరాజ్, చుక్క వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

### రాజీవ్‌తోనే కంప్యూటర్ యుగానికి పునాదులు

**రంగారెడ్డి ప్రతినిధి :** దేశానికి సాంకేతికతను పరిచయం చేసిన ఘనత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీకే దక్కుతుందని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చల్లా నరసింహారెడ్డి అన్నారు. మంగళవారం మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ ర్ధంతి సందర్భంగా రంగారెడ్డి జిల్లా డిసిసి అధ్యక్షులు చల్లా నరసింహారెడ్డి అధ్వర్యంలో మందమల్లమ్మ చౌరస్తా దగ్గర ఉన్నటు వంటి రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆఫీస్‌లో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్యకర్తలను ఉద్దే శించి డిసిసి అధ్యక్షులు చల్లా నరసింహారెడ్డి మాట్లాడుతూ సాంకేతిక తో భారతదేశాన్ని ప్రపంచ దేశాలతో పోటీపడే విధంగా దేశంలో కంప్యూటర్ యుగానికి పునాదులు వేసిన ఘనత స్వర్గీయ రాజీవ్ గాంధీ కి చెందుతుం దని తెలిపారు.అలాంటి మహనీయులు మన మధ్యలో లేకపోవడం దురదృ ష్టకరం అని అన్నారు.రాజీవ్ గాంధీ ఆశయాలకు అనుగుణంగా కాంగ్రెస్ పార్టీని మరింత ముందుకు తీసుకుపోయేందుకు ప్రతి కార్యకర్త కృతనిచ్చే యంతో పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో మీర్పేట్ కార్పొరేటర్ చల్లా కవిత బాల్ రెడ్డి,జిల్లా ఉపాధ్యక్షులు దేవగోని కృష్ణ,జనరల్ సెక్రెటరీ ఎరుకల వెంకటేష్ గౌడ్,నాయకులు కీసరి యాదిరెడ్డి,యూత్ కాంగ్రెస్ నాయకులు ఆళ్ళ శ్రీనివాస్ రెడ్డి,పరుశురాం, జిల్లా సోషల్ మీడియా కన్వీ నర్ ఐతరాజు భాస్కర్,ఆనంద్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రాణవాయువును ఇచ్చే చెట్లే ప్రాణాలు తీస్తున్నాయి

### చిన్న గాలివానాలకే పడిపోతున్న వృక్షాలు

### కూలుతున్న బతుకులు

### చేష్టలుడిగి చూస్తోన్న బల్దియా







**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహానగరంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిన తిరిగి సురక్షితంగా ఇంటికి తిరి గొచ్చే పరిస్థితులు లేకుండా పోయాయి. అడుగడుగున గండాలను తప్పించుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నా యి. ప్రాణావాయువును ఇచ్చే వృక్షాలే మృత్యుగాతాలు గా మారుతున్నాయి. ఒకవైపు వృక్షాలు కూలిపోయి ప్రాణాలు హరిస్తుండగా, మరోవైపు వర్షం కురిసినప్పు డు నోర్లు తెరుచుకున్న మ్యాన్‌హోళ్లు మింగేస్తున్నాయి. గాలిదుమారం చెలరేగినా, వర్షం పడిన నగర వాసులు చిగురుటాకులా వణికిపోయే పరిస్థితులు నెలకొన్నాయి. ప్రమాదకరంగా మారిన వృక్షాలను తొలగించడంలో ఘనత వహించిన మహానగర పాలక సంస్థ(జిహెచ్ ఎంసి) చేష్టలుడిగి చూస్తోంది. ఎంతో విలువైన ప్రజల ప్రాణాలు పోతున్న కనీస చర్యలకు ఉపక్రమించకపో వడం సర్వత్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. హైదరా బాద్ నగరంలోని బొల్లారంలోని కంటోన్మెంట్ ఆస్పత్రి లో మంగళవారం విషాద ఘటన చోటు చేసుకుంది. చికిత్స నిమిత్తం వచ్చిన దంపతులపై ఆస్పత్రి ఆవరణలో ఉన్న చెట్టు విరిగి పడింది. ఈ ఘటనలో భర్త రవీందర్ అక్కడిక్కడే మృతిచెందారు. ఆయన భార్య సరళాదేవి తీవ్రగాయాలతో గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందు తుంది. ఈ సంఘటనకు సంబంధించిన సిసిటివి దృశ్యా లు అందరినీ కలచివేస్తున్నాయి.

### గతంలో హైదర్‌గూడలో సిగ్నల్ కోసం చూస్తున్న ఆటోడ్రైవర్ మృతి

గత ఏడాది హైదర్‌గూడ పాత ఎంఎల్‌ఎ క్వార్టర్స్ సమీ పంలోని జంక్షన్‌లోని సిగ్నల్ వద్ద భారీ వృక్షం కూలి, సిగ్నల్ కోసం ఎదురుచూస్తున్న ఆటోపై పడింది. ఈ ఘ టనలో రాజ్‌భవన్ రోడ్డులోని ఎంఎస్‌మక్తాకు చెందిన ఆటోడ్రైవర్ అక్కడిక్కడే మృతిచెందాడు. అప్పట్లో ఈ సంఘటన నగరవాసులను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిం ది. ఇంతపెద్ద సంఘటన జరిగినా ఘనత వహించిన జిహెచ్‌ఎంసి అర్బన్ బయోడైవర్సిటీ(యుబిడి) అధికారు లు మాత్రం చర్యలు చేపట్టలేదు. ప్రతి సంవత్సరం చెట్లు కూలిన సంఘటనల్లో ప్రజల ప్రాణాలు గాలిలో కలిసిపో తున్నాయి. నగరంలో ఇటీవల కురిసిన వర్షాలకు దాదా పు 80కిపైగా చెట్లు కూలాయి. అదృష్టవశాత్తు ప్రాణహానీ జరగలేదు. కానీ, కార్లు, ద్విచక్ర వాహనాలు దెబ్బతిని ఆస్తినష్టం జరిగింది. ప్రతి సంవత్సరం వృక్షాలు కూల డం, ప్రమాదాలు చోటు చేసుకోవడం జరుగుతున్నా, ప్రమాదాల నివారణపై అధికారులు చర్యలు తీసుకోకపో వడం విస్మయం కలిగిస్తోంది.

### బలహీనంగా వేర్లు.. కూలిపోతున్న చెట్లు..

గత ప్రభుత్వ హయంలో వివిధ పథకాల ద్వారా హైదరా బాద్ మహానగరంలో విస్తృతంగా మొక్కలు నాటారు. మొక్కలు నాటేందుకు ప్రభుత్వాలు లక్ష్యాలు నిర్ధేశించ డంతో ఇబ్బంది మబ్బడిగా లెక్కలు చూపించుకునేందుకు మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టారు. నగరంలో ఖాళీ స్థలాలు లేకపోవడం, ఉన్న ప్రైవేట్ స్థలాలు ఉండటంతో రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమాలు చేప ట్టారు. చెట్ల వేర్లు విస్తరించకుండా ఒకవైపు భవనాల కాంక్రీట్ నిర్మాణాలు, మరోవైపు బిటి, సిసి రోడ్లు అడ్డుకుం టున్నాయి. వేర్లు భూమిలోకి వెళ్లి నాటుకుంటేనే చెట్లు బలంగా ఉంటాయి. చెట్ల వేర్లు భూమిలోకి వెళ్లి బలంగా ఉండేందుకు అవకాశం లేకపోవడంతో చిన్న చిన్న గాలి వానాలకే కూలుతున్నాయి. విద్యుత్ తీగల వెంట ఉండే వృక్షాలను టిఎస్ ఎస్‌డిపిసిఎల్ సిబ్బంది కేవలం ఒకవైపు కొమ్మలను తొలగించడంతో మరోవైపు బరువు ఎక్కువై కూడా చెట్లు కూలుతున్నాయి. శాస్త్రీయ పద్ధతిలో చెట్ల కొమ్మలను తొలగించాల్సిన విద్యుత్ సిబ్బంది ఇష్టారా జ్యంగా కొట్టేయడంతో కూడా చెట్లు ప్రమాదకరంగా మారుతున్నాయి. జిహెచ్‌ఎంసి, టిఎస్ ఎస్‌పిడిసిఎల్ మధ్య సమన్వయ లోపంతో చెట్ల కొమ్మల కొట్టేయడం ఇష్టారాజ్యంగా సాగుతోంది. వర్షం కురిసిన ప్రతిసారి నగరంలో ఎదో ఒక ప్రాంతంలో చెట్లు కూలడం, ఈవి డిఎం సహాయ బృందాలు తొలగించడం దృశ్యాలను చూస్తునే ఉన్నాం. అయితే రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న చెట్ల విషయాన్ని జిహెచ్‌ఎంసి యుబిడి అధికారు లు గాలికి వదిలేశారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. నగర వ్యాప్తంగా రోడ్లకు ఇరువైపులా చెట్ల వేర్లు దెబ్బ తిని, ప్రమాదకరంగా మారుతున్నాయి. దీంతో ఎప్పుడు ఏ చెట్టు పడిపోతుందోనని రాకపోకలు సాగించే వాహన దారులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.

## వైభవంగా వెంకటేశ్వరస్వామి కల్యాణం

**ప్రజాపక్షం/కేశంపేట:** కేశంపేట మండలం ఎక్లాస్‌ఖాన్‌పేటలోని శ్రీవెంక టేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో మంగళవారం స్వామి వారి కళ్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఎంపిపి రవీందర్‌యాదవ్‌కవిత, మురళీయాద వ్‌హిమబిందు దంపతులు పట్టువస్త్రాలను సమర్పించారు. మాజీ ఎంఎల్‌ఎ అంజయ్యయాదవ్, లక్ష్మి నారాయణగౌడ్, నర్సింగ్‌రావు, జమాల్‌ఖాన్, మురళీధర్‌రెడ్డి, అంజిరెడ్డి, పర్వత్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, శేఖర్‌రెడ్డి, వెంక న్నయాదవ్, వెంకట్‌నారాయణరెడ్డి, వేణుగోపాలచారి, పల్లాటి లక్ష్మి నారా యణ, భూపాల్‌రెడ్డి, సురేష్‌యాదవ్ భక్తులు పాల్గొన్నారు.

### భక్తిశ్రద్ధలతో అనంత పద్మనాభస్వామి కల్యాణం



**కొత్తూరు :** కొత్తూరు మండల పరిధిలోని పెంజర్ల గ్రామంలో మంగళ వారం అనంత పద్మనాభ స్వామి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహిం చారు. షాద్‌నగర్ ఎంఎ ల్‌ఎ వీర్లపల్లి శంకర్‌తో పాటు మాజీ ఎంఎల్‌ఎ చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, ఎంఎల్‌సి అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డి, మాజీ జడ్పిటిసి మామిడి శ్యాంసుందన్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. నంది గామ మండల పరిధిలోని అంతిరెడ్డిగూడ గ్రామంలో ఈదుల ఎల్లమ్మ తల్లి దేవాలయంలో కల్యాణోత్సవాన్ని నిర్వహించారు.

# వైద్యుల నిర్లక్ష్యంతో నిండు ప్రాణం బలి

### హాస్పిటల్ ఎదుట మృతదేహంతో బంధువుల ఆందోళన

### యాజమాన్యంపై కేసు నమోదు చేయాలని డిమాండ్



**ప్రజాపక్షం/వనస్థలిపురం:** వైద్యుల నిర్లక్ష్యంతో నిండుప్రాణం పోయింది. ఈ ఘటన ఎల్బీనగర్ పరిధిలోని ఆరెంజ్ హాస్పిటల్లో మంగళవారం చోటుచేసు కుంది. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.... నల్లగొండ జిల్లా చింతపల్లి మండలానికి చెందిన కాసరపు రమేష్ (38) కాళ్ల వాపుతో ఎల్బీన గర్‌లోని ఆరెంజ్ హాస్పిటల్లో చికిత్స కోసం సోమవారం వచ్చాడు. మంగళ వారం కొన్ని టెస్టులు చేసి ఈసీజీలో హార్ట్‌కు సంబంధించిన ప్రాబ్లం ఉందని వైద్యులు బాధ్యుడి బంధువులకు తెలిపారు. హార్ట్ సంబంధించి ఆంజియో గ్రామ్ టెస్ట్ చేయగా అందులో స్టంట్ వేయాలని వైద్యులు తెలిపారు. చికిత్సకు రూ.2 లక్షలు అవుతుందని తెలపడంతో, దానికి సంబంధించిన లక్ష రూపా యలు రోగి బంధువులు చెల్లించారు. కానీ స్టంట్ వేయక ముందే, బాధితుడికి సీరియస్‌గా ఉందని, మరొక హాస్పిటల్‌కు చికిత్స కోసం తరలించాలని ఆరెంజ్ ఆస్పత్రి వైద్యులు రోగి బందువులకు తెలిపారు. దీనికి వారు నిరా కరించడంతో హాస్పటల్ యజమాన్యం పోలీసులకు సమాచారం ఇచ్చి పిలిపిం చుకున్నారు. ఆరెంజ్ హాస్పిటల్ నుంచి బాధితుడిని మలక్‌పేట యశోద హాస్పి టల్‌కు తరలించగా అక్కడి వైద్యులు పేషెంట్‌ని పరిశీలించి చనిపోయాడని తెలిపారు. దీంతో రోగి బంధువులు మృతిదేహంతో ఆరంజ్ హాస్పిటల్ ఎదుట పెట్టి ఆందోళన దిగారు. హాస్పిటల్ యాజమాన్యం, వైద్యులు పరారీలో ఉండ డంతో మృతిదేహంతో బాధితులు ఆందోళన దిగారు. కాగా వైద్యులు, హాస్పి టల్ యజమాన్యం కనీసం బాధిత కుటుం బానికి సమాచారం లేకుండా పరారీ కావడం ఏంటని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నా రు. వైద్యుల తప్పు ఉండడంతోనే హాస్పటల్ సంబంధించిన వైద్యులు, యజమాన్యం పరా రయ్యారని ఆరోపిస్తున్నారు. వైద్యం కోసం వస్తే ప్రాణాలు తీసే ఇలాంటి హాస్పిటల్స్‌పై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవాల ని, ఆస్పత్రిని సీజ్ చేసి మరొకరికి బలికాకుం డా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నద ని బంధువులు, ఆందోళనకారులు డిమాండ్ చేస్తున్నారు. బాధితుడికి భార్యతో పాటు కుమారుడు కుమార్తె ఉన్నారు.



# పరిశ్రమలలో స్థానిక యువతకు ఉద్యోగాలు

### రంగారెడ్డి జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనిత



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** పరిశ్రమలు స్థాపించే ప్రాంతాలలో స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని రంగారెడ్డి జెడ్‌పి చైర్ పర్సన్ డాక్టర్ తీగల అనిత హరినాథ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఖైరతాబాద్ లోని రంగారెడ్డి జిల్లా పరిషత్ కార్యాలయంలో స్థాయి సంఘ సమావేశాలు జెడ్‌పి చైర్‌పర్సన్ అధ్యక్షతన జరిగాయి. సమావేశంలో గ్రామీణ అభివృద్ధి, విద్య, వైద్యం, పనులు, ప్రాణాళిక, ఆర్థిక అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల వివరాలు తెలుసుకున్నారు. కొత్త రేషన్ కార్డుల దరఖాస్తు ఎంతవరకు వచ్చిందని, ఇప్పటి వరకు జిల్లాలో ఎన్ని దరఖాస్తులు వచ్చాయని లెక్కలు అడిగి తెలుసుకున్నారు. భూగర్భ జలాల అధి కారులు వేసవి కాలం కారణంగా ప్రజలకి గ్రామాలలో ఏమైనా ఇబ్బందులు ఉంటే వాటిని త్వరగా చేపట్టేలా చూడాలని తెలిపారు. కొండాపూర్, వనస్థలి పురం స్టాఫ్ నర్స్ డాక్టర్స్ అందుబాటులో ఉండేటట్టు చూడాలన్నారు. వర్షాకా లంలో తగిన మాత్రలు, ఇంజక్షన్స్ అందుబాటులో ఉండేటట్టు చూడాలని డిఎం హెచ్‌ఓకి తెలిపారు. విద్యుత్ అధికారులు రైతులతోపాటు గృహ అవసరాలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని, వర్షా కాలంలో అధికారులను అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కార్యక్రమం లో జెడ్‌పి వైస్ చైర్మన్ ఈట గణేష్, జడ్పిటిసిలు బొక్క జంగారెడ్డి, మహిపాల్, నిత్య నిరంజన్‌రెడ్డి, అనురాధ, పత్య నాయక్, రాగమ్మ, శ్రీలత సత్యనారా యణ, వెంకట్ రామ్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు అలీ అక్బర్ ఖాన్, పట్నం అవి నాష్ రెడ్డి, సిఇఒ కృష్ణారెడ్డి, డిప్యూటీ సిఇఒ రంగారావు, పాల్గొన్నారు.

## పల్లెలో బెల్టుషాపులు నియంత్రించండి

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** పల్లె సీమల్లో బెల్టు షాపులను నియంత్రించేం దుకు చర్యలు తీసుకోవాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల మూరు విష్ణువర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కందివనం గ్రామంలో బెల్టు షాపులను బంద్ చేసేం దుకు కృషిచేసిన చిన్నారులు నవీన్, సుశాంత్, అఖిల్, కార్తీక్, పూజా, అనూష, రాంచరణ్, ఆనంద్‌లను సత్కరించారు. ఈ సందర్భంగా విష్ణు వర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో బెల్టుషాపులను నియంత్రించేందుకు యువత ఉద్యమించాలని కోరారు. కార్యక్రమంలో విజయభాస్కర్, ఇస్నాతి శ్రీనివాస్, పసుల నర్సింహ్మా యాదవ్, ఆకులప్రదీప్,బలవంత్ రెడ్డి, లక్ష్మీ కాంత్‌రెడ్డి, సుధాకర్, బోయ శంకర్, భీమయ్య పాల్గొన్నారు.



# దళారులను ఆశ్రయించి నష్టపోవద్దు

### రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కె.శశాంక





**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోవద్దని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కె.శశాంక సూచించారు. మంగళవారం ఇబ్రహీంపట్నం మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ను అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ శశాంక సంద ర్శించారు. ఇబ్రహీంపట్నం మండలం, మెట్టీళ్లలోని ప్రైమరీ అగ్రికల్చర్ క్రెడిట్ సొసైటి, పటేల్ గూడలో రైతుల సౌకర్యార్థం కేంద్రాల్లో అందుబాటులో ఉన్న సదు పాయాలను పరిశీలించారు. ధాన్యం తీసుకువచ్చిన రైతు లను పలకరించి, కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు ఉన్నాయా..? ధాన్యాన్ని తరుగు పేరా ఏమైనా తీస్తు న్నారా అని ఆరా తీశారు. కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులు ఉంటే అధికారులకు తెలియచేయాలని, జిల్లాస్థాయిలో జిల్లా సివిల్ సప్లయ్ అధికారి మొబైల్ నెంబర్: 7995050714కు, రాష్ట్ర స్థాయి లో అందుబా టులో ఉన్న టోల్ ఫ్రీ నెంబర్లు 1967కు ఫోన్ చేసి ఫిర్యా దులు, సలహాలు, సూచనలు చేయవచ్చునని రైతులకు సూచించారు. రైతులు ధాన్యం తీసుకువచ్చిన వెంటనే తూకం జరిపించాలని, సేకరించిన ధాన్యాన్ని వెంటనే లారీలలో లోడ్ చేయించి రైస్ మిల్లులకు తరలించాలని కేంద్రం నిర్వాహకులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద సరిపడు సంఖ్యలో హమాలీలను నియ మించాలని, రైస్ మిల్లుల వద్ద ధాన్యం లోడ్‌లతో లారీలు నిలిచిఉండకుండా ఎప్పటికప్పుడు దిగుమతి చేసుకునేలా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలన్నారు. అకాల వర్షాలు కురుస్తున్నందున ధాన్యం తరలింపులో జాప్యానికి తావు లేకుండా చూడాలని, వాతావరణం అనుకూలించిన వెం టనే ధాన్యం నిల్వలు లిఫ్టింగ్ జరిగేలా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రాలలో రైతులు తీసుకువచ్చిన ధాన్యానికి సరిపడా టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అకాల వర్షాలను చూసి ఆందోళనకు గురి కావద్దని, ప్రభుత్వం ప్రకటిం చిన విధంగా ధాన్యానికి పూర్తి స్థాయిలో మద్దతు ధర చెల్లించడం జరుగుతుందని రైతులకు భరోసా కల్పించా రు. వర్షాలతో ధాన్యం తడిచిపోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వాతావరణ పరిస్థితుల గురించి రైతులకు ఎప్పటికప్పుడు సమాచారం అంది స్తూ ముందస్తుగా వారిని అప్రమత్తం చేయాలని, తద్వారా ధాన్యం తడవకుండా వారు జాగ్రత్తలు చేపట్టేం దుకు వీలుంటుందన్నారు. రంగారెడ్డి జిల్లావ్యాప్తంగా ప్రస్తుత సీజన్‌లో 33 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన, మరో 17 కేంద్రాల ద్వారా వరి ధాన్యం సేకరణ జరుపుతున్నామని, ఎక్కడ కూడా తరుగు వంటివి లేకుండా చర్యలు చేపట్టడం జరి గిందన్నారు. కేంద్రాలలో రైతులకు అవసరమైన అన్ని సదుపాయాలూ అందుబాటులో ఉంచామని, ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైతే రైతులు నేరుగా జిల్లా అధికారుల దృష్టికి తేవచ్చని, జిల్లా స్థాయిలో ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. కలెక్టర్ వెంట డిసిఒ ధాత్రిదేవి, జిల్లా సివిల్ సప్లయ్ అధికారి మనోహర్ కుమార్ రాథోడ్, సివిల్ సప్లైస్ డిఎం విజయలక్ష్మి ఉన్నారు.

### పొరపాట్లు లేకుండా ధరణి దరఖాస్తుల పరిశీలన

పెండింగ్ ధరణి దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయ డంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా బాధ్యతగా పని చేయాలని సంబంధిత రెవెన్యూ అధికారులకు జిల్లా కలె క్టర్ కె.శశాంక సూచించారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయాల సమావేశ మందిరంలో కలెక్టర్ శశాంక ధరణి దరఖాస్తుల పరిశీ లన, ప్రభుత్వ భూములు రక్షణపై రెవెన్యూ అధికారు లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భం గా కలెక్టర్ మాట్లాడుతూ గడువు లోపల పెండింగ్ ఉన్న సమస్యలను పరిష్కరించాలని చెప్పారు. ప్రతి దరఖాస్తు ను క్షుణ్ణంగా పరిశీలించి, అవసరమైతే ఫీల్డ్ ఇన్స్పెక్షన్ చేసి ఆన్లైన్ లోనే కాకుండా ఫైల్స్ రూపంలో కూడా నిర్వ హించాలని ఆదేశించారు. రిపోర్టులను పరిశీలించి సంబంధిత నివేదికలతో పూర్తిస్థాయిలో సమర్పించాలని తెలిపారు. ప్రతి మండలంలోని గ్రామాల వారీగా ప్రభు త్వ భూముల వివరాలు ప్రతి తహసీల్దార్ వద్ద ఉండా లని, ధరణి దరఖాస్తులను అందుబాటులో ఉన్న రికార్డుల ద్వారా పరిశీలించి పూర్తి చేయాలన్నారు. కార్యక్రమం లో జిల్లా అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.





## దేశం కోసం ప్రాణాలర్పించిన రాజీవ్

### ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**ప్రజాపక్షం / మహబూబ్‌నగర్ :** రాజీవ్ గాంధీ దేశం కోసం తన ప్రాణాలను అర్పించారని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం స్వర్గీయ శ్రీరాజీవ్ గాంధీ 33వ వర్ధంతి సందర్భంగా మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ అతి పిన్న వయసులోనే దేశంలోనే అత్యున్నత పదవిని చేపట్టి ఎన్నో వినూత్నమైన కార్యక్రమాలకు శ్రీకారం చుటారు అని ఆయన చెప్పారు. అందులో భాగంగానే 25 సంవత్సరాలకు ఉన్న ఓటు హక్కు ను 18 సంవత్సరాలకే కల్పించి దేశ నిర్మాణంలో యువతను భాగస్వామ్యం చేశారని ఆయన తెలిపారు. ఐటి, కంప్యూటర్, టివి, సెల్ ఫోన్లు సామాన్యుడి చెంతకు చేరుటలో రాజీవ్ గాంధీ కృషి ఎంతో విలువైనది అని ఆయన సేవలను కొనియాడారు. ముఖ్యంగా టెలికమ్యూనికేషన్స్ రంగాల్లో , రైల్వే,విమానయాన సంస్థల పురోగతి సాధించింది. ముందుచూపు తో దేశాన్ని ముందుకు నడిపిస్తున్న తరుణంలో విదేశీ శక్తులు ,అంతర్జాతీయ కుట్రలో భాగంగా ఎల్టీటీ ఈ తీవ్రవాద దాడుల వల్ల దారుహత్యకు గురికావడం జరిగిందని ఆయన అన్నారు . దేశంలో మళ్ళీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రాజీవ్ స్ఫూర్తిని కొనసాగిస్తూ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెంచుతామని ఆయన చెప్పారు . ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్ , పీర్ మహ్మద్ సాదిక్, మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్ ,మున్సిపల్ వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్ , అబుబాకర్ ,డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్, ఖాద్రీ ,ఫయీమ్ ,మారేపల్లి సురేందర్ రెడ్డి, మహ్మద్ ఫయీజ్, పెద్ద విజయ్ కుమార్ ,మల్లు నర్సింహ్మారెడ్డి, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్ యాదవ్ , ఆజ్మత్ అలి ,కౌన్సిలర్స్ సయ్యద్ మోసిన్, ఖాజా పాషా, తదితరులు పాల్గొన్నారు.



### గద్వాల జిల్లా కేంద్రంలో...

**ప్రజాపక్షం / మల్దకల్ :** గద్వాల జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటాన్నికి జెడ్పిచైర్ పర్సన్, కాంగ్రెస్ పార్టీ గద్వాల నియోజకవర్గ ఇంచార్జీ సరిత తిరుపతయ్య. మున్సిపల్ చైర్మన్ బి.ఎస్. కేశవ్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సరితమ్మ మాట్లాడుతూ దేశానికి దిశ నిర్దేశం చూపిన మార్గదర్శకుడని, ఆధునిక భారతదేశానికి పునాదులు వేసి, అణగారిన బతుకుల్లో వెలుగులు నింపి ఆఖరి క్షణం వరకు దేశం కోసమే బ్రతికిన మహనీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మధుసూదన్ బాబు, లత్తిపురం వెంకట్రామి రెడ్డి, మహ్మద్ ఇసాక్, అమరావాయి కృష్ణా రెడ్డి, శెట్టి ఆత్మకూరు లక్ష్మణ్, గోనుపాడు శ్రీనివాస్ గౌడ్, అల్వాల రాజశేఖర్ రెడ్డి, మహేష్, జనార్ధన్, నాగ శంకర్, స్వామి నాయుడు, పాతపాలెం ఆనంద్ గౌడ్, ధరూర్ కుర్వ శ్రీనివాసులు, డి. ఆర్. శ్రీధర్, గువ్వల గోపాల్, ఉప్పేరు సుబాస్, బ్రహ్మానంద రెడ్డి, కరాటే సత్యం, కిఫాయిత్, మ్యడం రామకృష్ణ, షాషు, రాము యాదవ్, కమ్మరి రాము, మేస్త్రీ కృష్ణ, నాగరాజు, గంజి రాము తదితరులు ఉన్నారు.



### పెబ్బేరు..

**ప్రజాపక్షం/పెబ్బేరు :** మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ 33వ వర్ధంతి సందర్భంగా పెబ్బేరు మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక సుభాష్ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి మండల కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ యువకులకు 18 సంవత్సరాలకు ఓటు హక్కును కల్పించారని, ప్రస్తుతం మనం ఉపయోగిస్తున్న కంప్యూటర్ రంగంలో ఎన్నో విప్లవత్మాక మార్పులకు శ్రీకారం చుట్టారని, చిన్న వయసులో ప్రధానిగా సేవ చేసిన రాజీవ్ గాంధీ ఉగ్రవాదుల చేతుల్లో హతమయ్యారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్ సాగర్ , జిల్లా ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షులు గంధం రాజశేఖర్, జిల్లా ఎస్సీ సెల్ నేత దూపం సర్వేష్ , మండల సీనియర్ నాయకులు దయాకర్‌రెడ్డి, కౌన్సిలర్ అశ్విని సత్యానారాయణ, టౌన్ ఉపాధ్యక్షులు సునీల్ కుమార్ , రాములు, వెంకటేష్ , నాయకులు వినయ్ , శివ, ఎల్లారెడ్డి, శివసాయి, నర్సింహ, రాము, వడ్డే ఆంజి, శ్రీను, రాజు తదితరులు పాల్గొన్నారు.

### కొత్తకోట...



కొత్తకోట మండల కేంద్రంలో రాజీవ్ గాంధీ 33వ వర్ధంతి పట్టణ , మండల కాంగ్రెస్ అధ్యక్షులు మేస్త్రీ శ్రీనివాస్ , బీచుపల్లి యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక గాంధీ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి మండల, పట్టణ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పీజే బాబు, రాంమోహన్ రెడ్డి, కో ఆప్షన్ నంబర్ ఎంఎ లతీఫ్ , మున్సిపాల్టీ కో ఆప్షన్ నంబర్ జెఎం మీషేక్ , మాజీ సర్పంచ్ బాలస్వామి, మాజీ వార్డు మెంబర్లు సలీంఖాన్ , బాల్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, సుభాష్ , రాఘవేందర్ గౌడ్ , సయ్యద్ లాల్ , రెడ్డి జగన్ , రాములు యాదవ్ , హరీష్ రెడ్డి, వెంకటేష్ , సాయిల్ యాదవ్ , గోకరయ్య నాయుడు, సుల్తాన్ , బాలకొండయ్యయాదవ్ , కురుమూర్తి నాయుడు, రాంలాల్ నాయక్ , గఫార్ , నవీన్ , బాబన్న, ఇమ్రాన్ ఖాన్ , లక్ష్మయ్య యాదవ్ , సిరాజోద్దీన్ , అంజన్న యాదవ్ , నవీన్ రెడ్డి, దిలీప్ రెడ్డి, కురుమయ్య, వెంకటయ్య నాయుడు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



### కల్వకుర్తి..

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** భారతరత్న మాజీప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని జివిఎస్ఆర్ కార్యాలయంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, మాజీసర్పంచ్ సుదర్శన్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు చిమ్ములశ్రీకాంత్‌రెడ్డి, శానవాజ్‌ఖాన్, మాజీసర్పంచులు లింగారెడ్డి, జిల్లెలరాములు, రాకేష్, రవిగౌడ్, మహిళా నాయకురాలు రేష్మబేగం పాల్గొన్నారు.

# ఆధునిక పద్ధతులతో అధికలాభాలు

### నాగర్‌కర్నూల్ కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** నాగర్‌కర్నూల్ జిల్లాలోని మామిడిరైతులు ఆధునిక పద్ధతులతో మామిడిపండ్లను ఎగుమతులుచేసి, మంచిసాగుపద్ధతులు పాటించి మరింతదిగుబడితోపాటు నాణ్యమైన పండ్ల ఉత్పత్తులతో మామిడి రైతులు అధిక లాభాలుపొందాలని జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ అన్నారు. మంగళవారం నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ సమావేశమందిరంలో నాగర్‌కర్నూల్ జిల్లా ఉద్యానశాఖ ఆధ్వర్యంలో మామిడిసాగులో యాజమాన్య పద్ధతులతో మామిడి ఎగుమతులు అధికలాభాలపై జిల్లా రైతులకు ఒక రోజు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ ప్రాంతం అన్ని పంటలసాగుకు అనుకూలమని రైతులు ఉద్యాన, మామిడిపంటలు సాగుచేస్తూ ఆర్థికంగా ఎదగాలన్నారు. కొల్లాపూర్ మామిడికి ప్రపంచదేశాల్లోనే మంచి గుర్తింపు ఉందని అందుకు అనుగుణంగా రైతులు నూతన వ్యవసాయ పద్ధతులద్వారా మార్కెట్‌కి అనుగుణంగా ఉత్పత్తులుచేసి అధికలాభాలు గడించాలని సూచించారు. ప్రభుత్వం ఉద్యానవన పంటలసాగుకై అధికప్రాధాన్యం ఇస్తుందన్నారు. ఇప్పటికే జిల్లాలో 14,419మంది రైతులు 33వేల523 ఎకరాల విస్తీర్ణంలో మామిడి తోటలు సాగుచేస్తున్నారన్నారు. జిల్లాలో స్వయం సహాయక మహిళా సంఘాల ఆధ్వర్యంలో రైతులనుండి మామిడికాయలు కొనుగోలుచేసి వివిధదేశాలకు ఎగుమతులుచేస్తూ లాభదాయకమైన మార్కెట్లను నిర్వహిస్తున్నారని తెలిపారు. జిల్లాలో ఉద్యాన పంటలపై అధికారులు కల్పిస్తున్న అవగాహనలను రైతులు సద్వినియోగం చేసుకొని తమపంటల దిగుబడులతోపాటు అధిక లాభాల మార్కెటింగ్ మెళుకువలను తెలుసుకొని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉద్యాన అధికారులు శాస్త్రవేత్తలు సూచించిన పద్ధతులను అమలుచేసినప్పుడు అధికదిగుబడితోపాటు రైతులకు లాభసాటిగా ఉంటుందన్నారు. మామిడి రైతుకుమంచి దిగుబడులతోపాటు నాణ్యమైన పండ్లను ఎలా ఎగుమతులుచేసి అధికలాభాలు గడించాలనే విషయంపై ఉద్యానవనశాఖ అధికారులు మామిడి రైతులకు అవగాహన సదస్సులో అవగాహన కల్పించారు. అనంతరం ఈసదస్సును విజయవంతంగా నిర్వహించిన అధికారులను జిల్లా కలెక్టర్ శాలువాతో సత్కరించి మెమెంటోను బహుకరించారు. ఈమామిడి రైతుల సదస్సులో రాష్ట్ర ఉద్యానశాఖ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రేమ్‌సింగ్, నాబార్డు ఎజిఎం ఆర్‌పినాయుడు, జిల్లా ఉద్యానపట్టుపరిశ్రమ అధికారి చక్రపాణి, వనపర్తిజిల్లా ఉద్యానశాఖ అధికారి సురేష్, వికారాబాద్ ఉద్యానఅధికారి కమల, రాష్ట్ర ఉద్యానశాఖ అధికారి మహేష్, నాబార్డుడిడిఎం మనోహర్‌రెడ్డి, డిఆర్‌డిఓ చిన్న ఓబులేష్, ఎల్‌డిఎండి కౌశల్‌కిశోర్‌పాండే, కెవికెపాలెం ఉద్యానశాస్త్రవేత్త ఆదిశంకర్, ఉద్యానశాఖ కొల్లాపూర్ అధికారి లక్ష్మణ్, కల్వకుర్తి ఉద్యానశాఖ అధికారి ఇమ్రాన్, మామిడి రైతులు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

### ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ

# పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

### అదనపు కలెక్టర్ సీతారామారావు



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** ఈనెల 24నుండి జూన్3వరకు నిర్వహించనున్న ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ సీతారామారావు అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ తనచాంబర్‌లో ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షపై సంబంధిత విభాగాలతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ సీతారామారావు మాట్లాడుతూ ఈనెల 24నుండి జూన్ 3వరకు నిర్వహించనున్న ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లను చేయాలని ఆదేశించారు. పరీక్షలు రెండు సెషన్లలో జరుగుతాయని ప్రతిరోజు ఉదయం 9గంటలనుండి మధ్యాహ్నం 12గంటలవరకు తిరిగి 2.30గంటలనుండి సాయంత్రం 5.30వరకు కొనసాగుతాయని అన్నారు. ప్రశ్నాపత్రాలను ఆయారూట్‌లవారిగా పోలీస్‌బందోబస్తు మధ్య తీసుకెళ్లాలని అన్నారు. పరీక్షాకేంద్రాల వద్ద 144సెక్షన్ అమలుచేస్తూ తగిన పోలీసుబందోబస్తు ఉండేలా చూడాలన్నారు. పరీక్షలు జరిగే సమయంలో పరిసరప్రాంతాల్లోని జిరాక్సుసెంటర్‌లను మూసి ఉంచాలని ఆదేశించారు. వేసవితీవ్రత దృష్ట్యా ప్రతిపరీక్షాకేంద్రంలోని తప్పనిసరిగా రక్షితమంచినీటి వసతి అందుబాటులో ఉంచాలని, పరిశుభ్రమైన వాతావరణం నెలకొనేలా చర్యలు తీసుకోవాలని , తగినంతగాలి , వెలుతురు ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఫస్ట్‌ఎయిడ్‌కిట్లతో ఆశా వర్కర్లు, ఎఎన్ఎంలు పరీక్ష సెంటర్లలో అందుబాటులో ఉంచాలని సూచించారు. పరీక్షలు కొనసాగే సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు రవాణపరంగా ఎలాంటి అసౌకర్యం కలగకుండా పరీక్షసమయాలకు అనుగుణంగా బస్సులు నడిపేలా చర్యలు తీసుకోవాలని ఆర్‌టిసి అధికారులకు సూచించారు. జిల్లాలో 6548మంది విద్యార్థులు హాజరుకానుండగా, మొదటి సంవత్సరం 4037మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరం 2511 ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు రాస్తున్నారని ఆయన తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లాపరిధిలో 21 పరీక్ష కేంద్రాలను చేయడం జరిగిందని ప్రతి పరీక్షకేంద్రానికి ఒకచీఫ్ సూపరింటెండెంట్ , ఒక డిపార్టుమెంటల్ అధికారిని నియమించడం జరిగిందని అన్నారు. ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలని ఇంటర్మీడియట్ విద్యాధికారిని ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి వెంకటరమణ, వివిధశాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

## రైతులకు అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు

**ప్రజాపక్షం / పెబ్బేరు :** పెబ్బేరు మండలంలోని రైతు సోదరులకు వ్యవసాయ కార్యాలయం జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. కావాల్సిన రైతులు ఎవరైనా ఉంటే తప్పనిసరిగా రైతు సోదరులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి చంద్రమౌళి తెలియజేశారు. అదేవిధంగా రైతులకు 60 శాతం సబ్సిడిపై జీలుగ విత్తనాలు ఇవ్వడం జరుగుతుంది. కావాల్సిన రైతులు పొలం పాస్ బుక్ , ఆధార్ , జిరాక్స్ లను తీసుకొని వ్యవసాయ కార్యాలయం వద్దకు వచ్చి పర్మిట్ తీసుకోవాలని వ్యవసాయ అధికారి చంద్రమౌళి తెలియజేశారు. ఒక ఎకరాకు 12 కేజీల విత్తనాలు వేయాలి, పూత సమయం లేదా 45 రోజుల భూమిలో కలియ దున్నాలి, ఈ విధంగా చేయడం ద్వారా ఒక ఎకరాకు 1 బస్తా యూరియా, సగం బస్తా డిఏపి, 8 కేజీల పోటాష్ తక్కువ వేసుకోవచ్చు అని వ్యవసాయ అధికారి తెలియజేశారు. జీలుగ నెలలో కలియ దున్నడం వలన నేల చౌడు లక్షణాలు తగ్గి , భూసారం పెరిగి, సూక్ష జీవులు వృద్ధి చెంది, ఎన్‌పికె, సూక్ష పోషకాలు లభ్యత పెరుగుతుందని వ్యవసాయ అధికారులు తెలియజేశారు. జీలుగ 30 కేజీల బస్తా , 2.20 ఎకరాలకు వస్తుందన్నారు. 30 కేజీల బస్తా ధర రూ. 2790 ప్రభుత్వ సబ్సిడీ రూ. 1674 రైతు చెల్లించవాల్సిన ధర రూ. 1116 అదేవిధంగా పైన తెలిపిన జిరాక్స్ ప్రతులు తీసుకొని వ్యవసాయ విస్తరణ అధికారి వద్ద జీలుగు విత్తనాలు పర్మిట్ చేసుకుంటే సరిపోతుందని మండల వ్యవసాయ అధికారి చంద్రమౌళి తెలియజేశారు.



## ధాన్యాన్ని వేగంగా మిల్లలకు తరలించాలి

### అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎం. నగేష్

**ప్రజాపక్షం / వనపర్తి ప్రతినిధి :** వనపర్తి జిల్లా ఆకాల వర్షాల నేపథ్యంలో వరి కొనుగోలు కేంద్రాల్లో సేకరించిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు వేగంగా మిల్లులకు తరలించాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎం. నగేష్ ఆదేశించారు. మంగళవారం వీపనగండ్ల మండలంలోని తూంకుంట, పాన్‌గల్ మండలంలోని వెంగలయాపల్లి , చిన్నంబావి మండలంలోని చిన్నంబావి, వెల్గొండ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలు చేసిన తర్వాత వేగంగా ట్యాబు ఎంట్రీ పూర్తి చేసి, రైతుల ఖాతాల్లో నగదు జమ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో వర్షాలు పడే అవకాశం ఉన్నందున సేకరించిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని సిబ్బందిని ఆదేశించారు. మిగిలిన ధాన్యంపై టార్పలిన్‌లు కప్పి ఉంచాలని , ధాన్యం తడిచిపోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# గడువులోగా ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలి

### కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/వనపర్తి ప్రతినిధి :** నిర్ణీత గడువులోగా వరి ధాన్యం కొనుగోళ్లను వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. కొనుగోలు చేసిన వెంటనే ధాన్యం మిల్లులకు తరలించాలని సూచించారు. మంగళవారం పెబ్బేరు మండల పరిధిలోని గుమ్మడం గ్రామ శివారులో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిర్ణీత గడువులోగా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని సూచించారు. ఆకాల వర్ష సూచనల నేపథ్యంలో రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరించాలని ఆదేశించారు. టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. గన్నీ బ్యాగులు, లారీల కొరత లేకుండా చూడాలన్నారు. కేంద్రాలకు రైతులు తెచ్చిన ప్రతీ ధాన్యపు గింజను కొనుగోలు చేయాలన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన తర్వాత వెంటనే ట్యాబు ఎంట్రీ పూర్తి చేసి, రెండు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఇప్పటి వరకు తరలించిన ధాన్యం వివరాలు, ఇంకా ఉన్న నిల్వల వివరాలు అడిగి తెలుసుకున్నారు.

**సిఎంఆర్ ధాన్యాన్ని వేగంగా అందజేయాలి**

పెండింగ్ సిఎంఆర్ ధాన్యాన్ని రైస్ మిల్లర్లు త్వరగా అందించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. మంగళవారం పెబ్బేరు మండల రంగాపురం శివారులోని అయ్యప్ప రైస్ మిల్‌ను కలెక్టర్ పరిశీలించారు. పెండింగ్ సిఎంఆర్ ధాన్యాన్ని వేగంగా అందించాలని ఆదేశించారు.

**ప్రభుత్వ ఆసుపత్రి ఆకస్మిక సందర్శన**

వనపర్తి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఆసుపత్రుల్లో వైద్యసిబ్బంది ఎల్లవేళలా అందుబాటులో ఉండి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఆసుపత్రికి ప్రతి రోజు రోగులు ఎంత మంది వస్తున్నారు. ఇన్ పేషంట్స్ వారి గురించి వాకబు చేశారు. ఆసుపత్రికి వచ్చిన రోగులకు ల్యాబ్‌లో పరీక్షలు చేసిన అనంతరం ప్రింటెడ్ రిపోర్టులు సకాలంలో అందజేయాలని తెలిపారు. తదుపరి ఫార్మసీ స్టోర్ ఇన్ స్పెక్షన్ చేయడం జరిగింది. అత్యవసర మందుల నిల్వలు సరిగా మైంటైన్ చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సౌకర్యాల గురించి సూపరింటెండెంట్ డా. శ్రీరంగనాథరావు, సీనియర్ ఆర్ఎంఓ డా. వి శంకర్ , ఆర్ఎంఓ డా. ప్రభాకర్ , ఇతర అధికారులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## వరి కొనుగోలు కేంద్ర ఆకస్మిక తనిఖీ

### జిల్లా అడిషనల్ కలెక్టర్ నగేష్



**ప్రజాపక్షం / వీపనగండ్ల :** గడువులోగా వరి ధాన్యం కొనుగోళ్లను వేగంగా పూర్తి చేయాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ నగేష్ అన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని సూచించారు. మంగళవారం మండల పరిధిలోని తూముకుంటలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ నిర్ణీత గడువులోగా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని సూచించారు. ఆకాల వర్ష సూచనల నేపథ్యంలో రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరించాలని ఆదేశించారు. టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని, గన్నీ బ్యాగులు, లారీల కొరత లేకుండా చూడాలన్నారు. కేంద్రాలకురైతులు తెచ్చిన ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేయాలన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన తర్వాత వెంటనే ట్యాబు ఎంట్రీ పూర్తి చేసి, రెండురోజుల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఇప్పటి వరకు తరలించిన ధాన్యం వివరాలు, ఇంకా ఉన్న నిల్వల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు వరలక్ష్మీ, ఐకేపీ సిబ్బంది ఉన్నారు.



## ఆర్థికసాయం అందజేత

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలం జిల్లెల్ల గ్రామానికి చెందిన పేరుమలకృష్ణ సోమవారం మృతిచెందడంతో హ్యూమన్‌వెల్ఫేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుటుంబసభ్యులకు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో హ్యూమన్‌వెల్ఫేర్‌ఫౌండేషన్ చైర్మన్ చింతపల్లి శివశంకర్, ఫౌండేషన్ బాడిమెంబర్ దార్లకాశయ్య, పేరుమలకృష్ణకు భార్య, కుమార్తె నిత్య, కుటుంబసభ్యులు , గ్రామస్తులు ఉన్నారు.



## అందరిపై భగవంతుని అనుగ్రహం

### ఎమ్మెల్యే యెన్నం

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** మనందరిపై ఆ భగవంతుని అనుగ్రహం ఎల్లప్పుడూ ఉండాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పాలమూరు పట్టణం, మిథిలానగరం, లోని ఎర్రసత్యం చౌరస్తా దగ్గర హనుమంతు, హయగ్రీవ , ధన్వంతరి, భూవరమ, సుదర్శన, లక్ష్మీ నరసింహ ఇష్టియజ్ఞ సహిత సామూహిక షష్టిపూర్తి మహోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు ఘనంగా ఎమ్మెల్యే ని సన్మానించి వేది ఆశీర్వాదం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లోక కళ్యాణార్థం శ్రీ పలుకూరి తిరుమలాచార్య స్వామి వారు చేపట్టిన ఈ మహత్తర యజ్ఞం చాలా విశిష్టమైంది. అని నేను ఈ కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నామని ఆయన చెప్పారు. ఇలాంటి ఆధ్యాత్మిక పరిమళం వెదజల్లే కార్యక్రమాలు ఇప్పటి సాంకేతిక జీవనంలో ఎంతైనా అవసరం ఉందని ఆయన అన్నారు. పట్టణంలోని ప్రజలు అందరు కూడా అధికసంఖ్యలో పాల్గొని సకల దేవత అనుగ్రహం పొందాలని ఏర్పాటు చేసిన తులాభారం లో పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో వినోద్‌కుమార్, సత్తూరు చంద్రకుమార్ గౌడ్, సిజె బెనహర్, శ్రీనివాస్‌రెడ్డి, పద్మావతమ్మ, తదితరులు పాల్గొన్నారు.




## కులగణన చేయకుండా ఎన్నికలకు వెళ్తే తగిన మూల్యం తప్పదు

### బిసి సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు సంఘం సూర్యారావు

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** త్వరలో జరగబోవు స్థానిక సంస్థ ఎన్నికల్లో ప్రభుత్వ కులగణన జరిపిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని బీసీ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు సంఘం సూర్యారావు డిమాండు చేశారు. బీసీ సమాజ్ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కులగణన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని కామారెడ్డి సభలో బీసీ డిక్లరేషన్ ప్రకటించి నేడు కులగణన ఊసే ఎత్తకుండా స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని చూడడం అన్యాయమన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా ఉన్న బీసీలకు సామాజిక న్యాయాన్ని చేస్తామని ప్రకటించి కర్ణాటక ముఖ్యమంత్రి బీసీల ముద్దుబిడ్డ సిద్ధరామయ్య తో తెలంగాణ గడ్డమీద ప్రకటన చేయించి బీసీల ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు కులగణన ఊసే ఎత్తకుండా స్థానిక సంస్థల ఎన్నికల్లో గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన పద్ధతిని అవలంబిస్తూ బీసీలకు అన్యాయం చేయాలని భావిస్తే ఈ స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని సంఘం సూర్యారావు అన్నారు. ఈకార్యక్రమంలో బిసి సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మోదాల శ్రీనివాస్ సాగర్, పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సారంగి లక్ష్మీ కాంత్, జాంద్ర సంఘం జిల్లా అధ్యక్షుడు మహేందర్, మేదరి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, ఆరేకటిక సంఘం జిల్లా నాయకుడు శ్రీనివాస్, బీసీ సమాజ్ కో కన్వీనర్ సవారి సత్యం, బీసీ సమాజ్ దేవరకద్ర నియోజకవర్గ కన్వీనర్ శేఖర్, బీసీ సమాజ్ నాయకులు జంగం విశ్వనాథ్, మనోహర్ గౌడ్ తదితరులు ఉన్నారు.



## గ్యారంటీలు అమలు చేస్తాం

**ప్రజాపక్షం/మల్దకల్:** పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నాగర్‌కర్నూల్ అభ్యర్థి డా.మల్లురవి రెండు లక్షల మెజార్టీతో గెలుస్తారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వై.శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. మల్దకల్ మండల పరిధిలోని బిజ్వారం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో కాంగ్రెస్ పార్టీ నాయకులు వై.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఆరు గ్యారెంటీలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూర్తిగా అమలు చేశారని ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆదరించి రాష్ట్రంలో అధికారంలో తెచ్చారని రాహుల్ గాంధీ ప్రధానమంత్రి చేయడమే లక్ష్యంగా ప్రతి ఒక్క కార్యకర్త గ్రామాలలో నాగర్‌కర్నూల్ పార్లమెంటు అభ్యర్థి డా.మల్లురవి గెలుపునకు పనిచేశారని వారందరికి ధన్యవాదాలు తెలియజేశారు. రెండు లక్షల పైగా మెజార్టీతో డా.మల్లురవి నాగర్‌కర్నూల్ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మెకానిక్ గోవిందు, డైనమిక్ లీడర్ నారాయణ, కొంకల రాముడు, నడిపి వెంకటన్న, లబ్బరి దేవదాస్, వడ్డే గోపాల్, శ్రీనివాస్ గౌడ్, కొంకల గోకరన్న, తదితరులు పాల్గొన్నారు.

## 'పెద్దమ్మ'ను దర్శించుకున్న రావుల

**ప్రజాపక్షం / కొత్తకోట :** మదనాపురం మండలం తిరుమలయ్య పల్లె గ్రామంలో పెద్దమ్మ పండుగ సందర్భంగా మాజీ పార్లమెంట్ సభ్యులు, మాజీ ఎమ్మెల్యేరావుల చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొని అమ్మవారికి పూజలు చేసి గ్రామ ప్రజల చల్లగా చూడాలని పెద్దమ్మ తల్లిని కోరారు. తదనంతరం రావులకు ఆ గ్రామ ప్రజలు ఘనంగా సన్మానించారు. మాజీ ఎంపీపీ శశిరేఖమ్మ, టి.కె. కురుమన్న దంపతులకు వారి ఇంటికి వెళ్లి రావుల ఘనంగా సన్మానించారు.

## కూకట్‌పల్లిలో రాజీవ్‌గాంధీకి ఘననివాళి

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి:** భారతరత్న, మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ రాజీవ్ గాంధీ 33వ వర్ధంతి సందర్భంగా నియోజకవర్గంలో పలుచోట్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించారు. కెపిహెచ్ బి కాలనీ ఫోరం మాల్ సర్కిల్‌లో రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద నిర్వహించిన వర్ధంతి కార్యక్రమానికి కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ హాజరై, స్థానిక నాయకులతో కలసి రాజీవ్ గాంధీ విగ్రహానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ దేశంలోని నిరుపేదల అభ్యున్నతి కోసం రాజీవ్ గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్యం శ్రీరంగం, తూము వేణు, నాగిరెడ్డి ,గాలి బాలాజీ, శేరి సతీష్ రెడ్డి, గొట్టిముక్కల వెంకటేశ్వర రావు, ఫణి కుమార్, ప్రవీణ్ కుమార్, గంధం రాజు, శివ చౌదరి, విటల్ రెడ్డి, అప్పారావు, రజిత, రేష్మ, సంధ్య, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు



**ప్రజాపక్షం/ఫేట్ బషీరాబాద్:** చెట్ల నరికివేత, నిర్వహణ ప్రయోజనాల కోసం బుధవారం కొంపల్లి సబ్‌స్టేషన్ ఉదయం 10 :00 నుండి సాయంత్రం 5: 00 గంటల వరకు 11 కెవి విఘ్నేశ్వర ఫీడర్ వెలువడుతుంది. కాబట్టి కింది ప్రాంతాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుంది. రుద్ర నిర్మాణాలు, మోదీ బిల్డర్స్, మల్లారెడ్డి ఇంటి దగ్గర దుర్గా హోటల్ , హాస్టల్స్, జాయ్ కిడ్స్ స్కూల్ దగ్గ ఆ సమయంలో విద్యుత్ నిలిపివేయబడుతుందని టిఎస్ఎస్‌పిడిసిఎల్ శాఖకు సహకరించగలరని ఎఇఒ ప్రకటనలో తెలిపారు.

## పెండింగ్ వేతనాలు చెల్లించాలని ధర్నా

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మూడు నెలల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 24న హైదరాబాద్‌లోని కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్టు ఎన్.హెచ్.ఎం రాష్ట్ర అధ్యక్షుడు ఎం. నరసింహ, జాతీయ ఆరోగ్య మిషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా తెలిపారు. ఉద్యోగులకు పెండింగ్ వేతనాలు, పి.ఆర్.సి బకాయిలను వెంటనే చెల్లించాలని హైదరాబాద్ కోఠిలోని వైదారోగ్యశాఖ కమిషనర్ కార్యాలయంలో వారు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఎన్ హెచ్ ఎంలో 78 క్యాడర్లలో కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ విభాగాలలో సుమారు 17వేల పైచిలుకు మంది నిత్యం రోగులకు సేవలను అందిస్తున్నారని వివరించారు.అలాంటి ఉద్యోగులకు సమాయానికి వేతనాలు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేయడం సరికాదని అన్నారు. గత మూడు నెలల నుంచి వేతనాలు అందకపోవడంతో ఎన్ హెచ్ ఏం ఉద్యోగుల కుటుంబాలు దయనీయ స్థితిలో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై గతంలో అనేక సందర్భాల్లో కమిషనర్ కార్యాలయంలో, జిల్లా స్థాయి అధికారులకు వినతులు అందజేశామని గుర్తు చేశారు. ఇప్పటి వరకు వేతనాలు చెల్లించకపోవడం శోచనీయమన్నారు. ఎన్ హెచ్ ఎం ఉద్యోగులకు ప్రతి నెలా 1వ తేదీన వేతనాలు చెల్లించాలని, అలాగే పెండింగ్ 3 నెలల వేతనాలు వెంటనే విడుదల చేయాలని, పిఆర్‌సి బకాయిలను చెల్లించాలనివారు డిమాండ్ చేశారు. ఈనెల 24న చేపట్టనున్న ధర్నాకు 33 జిల్లాల ఉద్యోగులు పాల్గొని, ధర్నాను జయప్రదం చేయాలని ఎం. నరసింహా, రామ రాజేష్ ఖన్నా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఆరోగ్య మిషన్ రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌పార్టీకి కార్యకర్తలే కొండంత అండ

ఇబ్రహింపట్నం శాసన సభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి



**ప్రజాపక్షం/యాచారం :** కాంగ్రెస్ పార్టీకి పార్టీ కార్యకర్తలే కొండంత బలమని ఇబ్రహింపట్నం శాసన సభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మంగళవారం యూత్ కాంగ్రెస్ కార్యదర్శిగా చింతపట్ల గ్రామానికి చెందిన మహ్మద్ జాంగిర్‌కు నియామక ప్రతంను ఎంఎల్‌ఎ మల్‌రెడ్డి రంగారెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ యాచారం మండలంలో అన్నిగ్రామాల్లో పార్టీని బలోపేతం చేయాలన్నారు. అందరూ పార్టీ కోసం కష్టపడి పనిచేయాలని అన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందని అన్నారు. మహ్మద్ జాంగిర్ విద్యావంతుడు నిజాయితీ పరుడైన జాంగిర్‌ను నియమించామన్నారు. రాజీవ్ యూత్‌ను స్థాపించి యువకులను ఏకం చేశారని అన్నారు. మల్‌రెడ్డి రంగారెడ్డి కి జాంగిర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు అభ్యర్థుల గెలుపు కోసం కష్టపడి పని చేయాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అందరికి సముచిత స్థానం ఇస్తుందని అన్నారు. అందరు కలిసి కట్టుగా పని చేస్తే విజయం మనదేనని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి రాచర్ల వేంకటేశ్వర్లు యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, కిసాన్‌సేల్ యాచారం మండల అధ్యక్షుడు రంగారెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు బాలశివుడు, జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నర్సరీలు ఎండిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి



**ప్రజాపక్షం/యాచారం:** గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద ఏర్పాటు చేసిన నర్సరీలు ఎండిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకొవాలని ఎంపిడిఒ నరేంధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం యాచారం మండల పరిధిలోని మేడిపల్లి గ్రామంలో నర్సరీని పరిశీలించారు. కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ప్రభుత్వాలు మొక్కలు నాటడానికి తగిన ప్రధాన్యం ఇస్తున్నాయి. మొక్కలు ఎండిపోకుండా ఎప్పటికప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకొలన్నారు. వేసవిలో మొక్కలను కాపాడారు. వచ్చేది వర్షకాలం మొక్కలు నాటడానికి అనువైన కాలం ఈ విషయాన్ని అర్థం చేసుకొవాలన్నారు. ప్రతి మొక్కను బ్రతికించుకోవడానికి అందరం కృషి చేయాలన్నారు. ఉపాధి పనులను పభుత్వ నిబంధనల ప్రకారం పనులు చేయాలన్నారు. ఫిల్డ్ అసిస్టేంట్లు పనులను దగ్గర ఉండి చేయించాలని అన్నారు. మాస్టరులో ఎలాంటి తప్పులున్న సహించేదని అన్నారు. చేసిన పనికి వారం వారం పేమెంటు మీ ఆకౌంట్‌లో జమచేస్తున్నామని అన్నారు. ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తెస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామని అన్నారు. కొలతల్లో తేడా రాకుండా మేజర్‌మెంటు ప్రకారం పనులు చేయాలని అన్నారు. ఈ విషయాన్ని కూలీలందరు అర్థం చేసుకొవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కిషన్ నాయక్ ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

**ప్రజాపక్షం/యాచారం :** మండల పరిధిలోని గడ్డమల్లాయగూడ గ్రామానికి చెందిన యార యాదగిరి గత నెల రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు.నిరుపేద కుటుంబానికి చెందిన యాదగిరి కుటుంబానికి గ్రామస్తులు, స్నేహితులు అండగా నిలిచారు. వాట్సాఫ్ స్టేటస్ లో యాదగిరి మరణ వార్త విన్న స్నేహితులు రెండు లక్షల 46 వేల 700 రూపాయల ఆర్థిక సహాయం అతని కుటుంబానికి అంద జేశారు. ఆ కుటుంబానికి కొండత ధైర్యాన్ని అందిచారు. వారి కుటుంబానికి ఎల్లప్పుడు అండగా ఉంటామని అన్నారు. ఆర్థిక సహాయం అంద జేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. చేయడం పట్ల గ్రామస్తులు ఎంతో అనందం వ్యక్తం చేశారు. మంచి మనసున్న స్నేహితులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

# పాఠశాలల్లో త్వరితగతిన పనులు పూర్తి

కలెక్టర్ నారాయణరెడ్డి





**ప్రజాపక్షం/వికారాబాద్ /పరిగి :** వికారాబాద్ జిల్లాలో పరిగి పట్టణ కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలల, సయ్యద్ మాల్కాపూర్ ప్రాథమిక పాఠశాల ప్రాంగణాలలో అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగా చేపడుతున్న పనులను జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అమ్మ ఆదర్శ పాఠశాల కింద వచ్చిన నిధులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాఠశాలల ఆవరణాలో చేపట్టిన పనులను పరిశీలిస్తూ మొదటి ప్రాధన్యతగా మౌలిక సౌకర్యాలు అయిన మంచి నీటి సౌకర్యం, టాయిలెట్స్ మరమ్మత్తు , విద్యుత్తు పనులను చేపట్టాలన్నారు. పాఠశాలల్లో చేపట్టవలసిన పనులను మంజూరైన నిధుల ద్వారా పక్కగా పనులు చేపట్టాలని ఆయన తెలిపారు. చేపడుతున్న పనులన్నీ నాణ్యతగా ఉండాలని అదే విధంగా వర్షాలు కురిసే సమయల్లో లీకేజీలు ఉంటే సరి చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. పాఠశాలల్లో చేపడుతున్న పనులన్నిటినీ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ త్వరితగతిన పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు. పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, అత్యవసరమైన పనులను గుర్తించి వాటిని చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని సయ్యద్ మల్కాపుర్ ప్రాథమిక పాఠశాల ప్రహరీ గోడకు పెంచేందుకు ప్రతిపాధనలు పంపాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. పరిగి పట్టణ కేంద్రలో మెప్మా ఆధ్వర్యంలో మహిళా శక్తి కుట్టు కేంద్రంలో ఏకరూప దుస్తులను తయారు చేస్తున్న విధానాన్ని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు సంబంధించి పాఠశాలలో తీసుకున్న కొలతల ఆధారంగా దుస్తులను తయారు చేయాల ని, నాణ్యతగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఉమేష్, జయసుధ, తహశీల్దార్ ఆనందరావు,వెంకటయ్య,హరిచంద్ర, గోపాల్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

**కొడంగల్ :** అమ్మ ఆదర్శ పనులలో భాగంగా జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్మిస్తున్న పనులను జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆకస్మికంగా తనిఖీలు చేసి పనులలో జాప్యం జరుగకుండా నాణ్యమైన పనులను చేపట్టాలని సంబంధిత అధికారులకు అదేశించారు. మంగళవారం కొడంగల్ నియోజకవర్గంలోని బోంరాస్‌పేట మండల పరిధిలోని చౌదర్‌పల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పూర్యానాయక్ తాండలోని ప్రాథమిక పాఠశాలలను విద్యా శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. చౌదర్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యుత్ పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ అధికారులను అదేశించారు. అనంతరం ఆయా పాఠశాలల ప్రదానోపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వీరితో పాటు మండల విద్యాధికారి రాంరెడ్డి, తహశీల్దార్ పద్మావతి, ఎంపీడీవో శ్రీదేవి, పంచాయతీరాజ్ డిఈ సుదర్శన్‌రావు, ప్రదానోపాధ్యాయులు శ్రీహరి రెడ్డి, రవీందర్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శులు సూర్యప్రకాశ్, సి. యాదగిరి సంబందిత శాఖల అధికారులు తదితరులు పాల్గోన్నారు.

## కెపిహెచ్‌బిలో ఫుట్ పాత్ ఆక్రమణల తొలగింపు





**ప్రజాపక్షం/కూకట్‌పల్లి:** కెపిహెచ్ బి కాలనీలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడంలో భాగంగా జెఎన్టీయు, ఎమ్మార్వో కార్యాలయం రోడ్డులోని ఫుట్‌పాత్‌లను ఆక్రమించి, వ్యాపారాలు నిర్వహిస్తున్న చిరు వ్యాపారులను జిహెచ్‌ఎంసి అధికారులు, ట్రాఫిక్ పోలీసులు మంగళవారం తొలగించారు. గత 30 సంవత్సరాలుగా పొట్టకూటి కోసం చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటున్న తమ వ్యాపారాలను తొలగించడం అమానుషమని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఎమ్మెల్యే కృష్ణారావు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా వీధి వ్యాపారాలు చేసుకుంటున్న వారి పైన అధికారులు కర్కషంగా వ్యవహరించడం అన్యాయమన్నారు. ఫుట్‌పాత్ ఆక్రమణ పేరిట ఎటువంటి సమాచారం లేకుండా సుమారు 200 కుటుంబాలకు చెందిన వ్యాపారాలను తొలగించడం పట్ల ఆయన తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా జీవనం సాగిస్తున్న వీరి కుటుంబాలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా కనీసం సమాచారం ఇవ్వకుండా ఇలాంటి చర్యలు ఎలా చేపడుతారని ప్రభుత్వ అధికారులను ఆయన ప్రశ్నించారు. పక్కనే ఉన్న లులు మాల్‌కి కొమ్ము కాసే విధంగా స్థానిక ట్రాఫిక్ సిఐతో పాటు జిహెచ్‌ఎంసి అధికారులు వ్యవహరిస్తున్నారని, లులు మాల్ నిర్వాహకులకు లబ్ధి చేకూరుస్తున్నారని దీనిపైన సంబంధిత పై అధికారులకు ఫిర్యాదు చేస్తానని ఆయన హెచ్చరించారు. వెంటనే అధికారులు స్పందించి దీనిపై తగు చర్యలు చేపట్టకపోతే బాధిత కుటుంబాలకు తాను అండగా ఉండి, సమస్యను పరిష్కరించేంతవరకు ఆందోళనలు చేపడుతానని ఆయన హెచ్చరించారు.

## ప్రజల సంరక్షణ కోసం కార్డన్ సర్చ్



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ జిల్లా కేంద్రంలోని గృహకల్పలోని అనుమానస్పదమైన వ్యక్తులు, పరిసరాలు, సరైన పత్రాలు లేని వాహనాలను తనిఖీ చేయడం జరగింది. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ.. ప్రజల సంరక్షణ కోసం కాలనీలలో కమ్యూనిటీలలో కర్టన్ సర్చ్ ఏర్పాటు చేయడం జరగింది. అని వికారాబాద్ డిఎస్‌పి శ్రీనివాస్ అన్నారు. ఇట్టి తనిఖీలల్లో 43 ద్వాచక్ర వాహనాలు, 3 ఆటోలు, 4 నాలుగు చక్రాల వాహనాలను సీజ్ చేయడం జరగిందన్నారు. ప్రజలు ఎవ్వరూ కూడా ఎలాంటి భయభ్రాంతులకు గురికావొద్దు అన్నారు. ప్రజలు నివసించే చూట్టు ప్రక్కల ఉన్న పరిసరాలను, నివసించే మనషుల గురించి ఎప్పటికప్పుడు పరిశీలిస్తుండాలని, ఎవరిపైన అయినా ఏదైనా అనుమానం కల్గితే వెంటనే పోలీస్ అధికారులకు తెలిచజేయాలని, సీజ్ చేసిన వాహనాల యజమానులు, వికారాబాద్ పోలిస్ స్టేషన్‌లో వాహనాలకు సంబంధించిన సరైన పత్రాలను చూపించి తీసుకొని వెళ్ళవచ్చు అని డిఎస్‌పి తెలిపారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ సిఐ నాగరాజు, ధారూర్ సిఐ రామకృష్ణ , మోమిన్‌పేట్ సిఐ అంజనేయులు, వికారాబాద్ డివిజన్ పరధిలోని 5మంది ఎస్ఐలు, 77 మంది పోలిస్ అధికారులు పాల్గొన్నారు.

## ఆర్థిక అక్షరాస్యతపై ప్రజలకు అవగాహన

జిల్లా రూరల్ డెవలప్‌మెంట్ అధికారి సాంబశివరావు



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** గ్రామీణ ప్రాంత ప్రజలందరూ బ్యాంకులు అందిస్తున్న సేవల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా రూరల్ డెవలప్‌మెంట్ అధికారి (డిఆర్‌డిఒ) సాంబశివరావు అన్నారు. మంగళవారం మండలంలోని ఉద్దెమర్రిలో ఏర్పాటు చేసిన కుంటుమిషన్ సెంటర్‌ను ఆయన పరిశీలించారు. అనంతరం ఎస్ఎస్‌టి, ఎన్జిఒ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆర్థిక అక్షరాస్యతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలన్ని బ్యాంకుల ద్వారా ప్రజలందరికీ చేరవేసే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. స్వచ్ఛంధ సేవా సంస్థల ద్వారా ప్రజల్లో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పిస్తున్న సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ (ఎస్ఎస్‌టి) ఎన్జిఒ సంస్థకు అభినందనలు తెలిపారు. సుకన్య సమృద్ధి యోజనపథకంలో భాగంగా 10 ఏళ్లలోపు బాలికలకు పొదుపు ఖాతాలను ప్రారంభించి 100 శాతం సాధించిన ఉద్దెమర్రి గ్రామాన్ని గ్రామాధికారి, ఇతర సిబ్బందికి సూచనలిచ్చారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్థిక చేకూర్పులో భాగంగా ఆర్థిక అక్షరాస్యతను ప్రజల్లో పెంపొందించడానికి, ఆర్థిక మోసాలను అరికట్టడానికి, ఆర్థిక మోసాలు జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు ఎస్ఎస్‌టి జిల్లా కోఆర్డినేటర్ అంబికా, కీసర సిఎఫ్ఎల్ విశ్వనాథ్‌లు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మోహన్‌సింగ్, బిపిఎం రమేష్, షరీఫా, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## అందుబాటులో లేని ఎఒ, ఎఇఒలు!



**ప్రజాపక్షం/నవాబుపేట్ :** వర్షాకాలం దగ్గరికి వసున్న సమయంలో అందుబాటులో ఉండవలసిన వ్యవసాయ అధికారులు అందుబాటులో లేకపోవడం వల్ల మండల పరిధిలోని ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. నవాబుపేట్ మండల కేంద్రంలో మంగళవారం ఉదయం మొదలుకొని మధ్యాహ్నం 3 గంటల వర కు తలుపులు తెరుచుకొని వ్యవసాయ అధికారి కార్యాలయం, వ్యవసాయ అధికారులు రాకపోవడంతో ఆయా గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు కనీసం ఒక ఎఇఒ నైన్నా అందుబాటులో ఉండేవిధంగా చూడాలని ప్రజలు అంటున్నారు. విత్తనాల సమయంలో ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీలు కానీ విత్తనాలు కానీ మేము తెలుసుకోవడానికి ఒక్క అధికారి కూడా లేకపోవడంతో బాధను వ్యక్తం చేశారు. ఆయా గ్రామాల ప్రజలు, మేము మా గ్రామాల నుంచి కేవలం వ్య వసాయ అధికారులను కలవడానికి వస్తే వారు లేకపోవడంతో మా ఆశలని బూడిదలో పోసిన పన్నీరు అవుతున్నాయన్నారు. క్లస్టర్ వైజ్‌గా ఉండి ప్రజలకు అం దు బాటులో ఉన్న వాటిని తెలపాలి కానీ మండల పరిధిలో ఉన్న రైతువేదికలో వ్యవసాయ అధికారులు ఎఇఒలు లేకపోవడంతో మండల కేంద్రానికి వస్తే మండల కేం ద్రంలో ఉన్న వ్యవసాయ అధికార కార్యాలయం కూడా మూసివేస్తే ప్రభుత్వం నుంచి వచ్చే ఎరువులు, విత్తనాలు సబ్సిడీలు ఎవరిని అడిగి తెలుసుకోవాలని ఆయా గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దయచేసి ఉన్నత అధికారులు స్పందించి ఇకనుంచయినా సరే రైతులకు ప్రభుత్వం అందిస్తున్న స్కీములను, సబ్సిడీలను ప్రజలకు తెలిపేందుకు ప్రతిరోజు వ్యవసాయ అధికార కార్యాలయంలో ఒక్కరు ఉండేలా చూడాలని ప్రభుత్వాన్ని ప్రజలు కోరుతున్నారు.

# ప్రభుత్వ బడి ఇక ‘అమ్మ ఒడి’

తల్లుల కమిటీకే ‘బడి బాట’ బాధ్యతలు

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ తీర్మానం మేరకే ‘సివిల్ వర్క్స్’

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఇకపై ప్రతి తల్లి ‘అమ్మ ఒడిలా’ ప్రభుత్వ పాఠశాలల ఆలనా పాలన చూసుకునేలా రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త ప్రణాళికకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా త్వరలోనే ప్రారంభం కానున్న ‘2024 25’ విద్యా సంవత్సరంలో ఈ సారి ‘బడిబాట’ కార్యక్రమాన్ని “తల్లుల కమిటీ”అధ్వర్యంలో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటి వరకు (గత విద్యా సంవత్సరం వరకు) టీచర్ల ఆధ్వర్యంలో బడి బాట నిర్వహించారు. కొత్తగా తల్లుల కమిటీ ఆధ్వర్యంలో బడి బాట నిర్వహిస్తే , విద్యార్థుల నమోదు శాతం పెరుగుతుందని, తల్లుల పర్యవేక్షణతో బడిలో చేరే ఆడ పిల్లల సంఖ్య కూడా పెరుగుతుందని ప్రభుత్వం యోచిస్తోంది. అన్ని గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల బాగోగులను పట్టించుకునే బాధ్యతను అక్కడి స్వయం సహాయక సంఘాల మహిళలకు అప్పగించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగా ప్రతి ప్రభుత్వ పాఠశాలలో ‘అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల’ను ఏర్పాటు చేస్తారు. ఈ కమిటీలో ఆయా గ్రామాల మహిళా సంఘం అధ్యక్షురాలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ప్రతీ తరగతిలో చదువుతున్న ముగ్గురు విద్యార్థుల తల్లులు ఉంటారు. పాఠశాలల్లో కిటికీలు, తలుపులు, ఎలక్ట్రిక్ స్విచ్ బోర్డులు, ఫ్యాన్లు, మరుగుదొడ్ల తాత్కాలిక మరమ్మతులు ఈ కమిటీలు చేపడుతాయి. వీటికి అవసరమైన దాదాపు రూ.600 కోట్లను ప్రభుత్వం ఇప్పటికే విడుదల చేసింది. సంఘాల మహిళలపై భారం లేకుండా ఆదర్శ కమిటీలు చేపట్టే పనులకు రూ.25 వేలు అడ్వాన్సుగా అందించారు. పాఠశాల విద్యార్థుల యూనిఫామ్ కుట్టే పనులను స్వయం సహాయక సంఘాలకే అప్పగించారు. దీంతో సంఘాలకు స్థానికంగా ఉపాధి దొరుకుతుందని, వారికి ఆదాయం సమకూరుతుందని ప్రభుత్వం భావిస్తుంది. ప్రైవేటు బడి మోజును తగ్గించి, నాణ్యమైన విద్యను అందించేలా ఉపాధ్యాయులు ఉన్న ప్రభుత్వ పాఠశాలల వైపు పిల్లలను చేరిపించేందుకు స్వయం సహాయక సంఘాలు కీలక పాత్ర పోషిస్తాయని ప్రభుత్వం భావిస్తోంది.

పాఠశాలల్లో అవసరమయ్యే తక్షణ పనులను గు ర్తించి,జూన్10వ తేదీలోగా వాటిని పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

**అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ తీర్మానం మేరకే ‘సివిల్ వర్క్స్’**

ఇకపై పాఠశాలల్లో జరిగే ప్రతి సివిల్ వర్క్స్ ‘అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ’ తీర్మానంతోనే చేపట్టనున్నారు. దీనికి సంబంధించి విద్యా సంవత్సరం నుంచే ఈ కార్యాచరణ మొదలు పెట్టారు. రూ.25 వేల లోపు ఖర్చు అయ్యే పనులను ‘అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ’లే నిర్వహిస్తాయి. అంతకు మించి రూ.లక్ష వరకు చేసే పనులకు ఎంపిడివో, రూ. లక్ష దాటిన పనులకు జిల్లా కలెక్టర్లు అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది.

## ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

ఇంటర్మీడియట్ నోడల్ అధికారి శంకర్



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఇంటర్మిడియట్ నోడల్ అధికారి ఎన్ శంకర్ అధికారులను ఆదేశంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి పరీక్ష కేంద్రంలో మౌలిక వసతుల కల్పన తో పాటు తాగునీరు, నిరంతర విద్యుత్తు సదుపాయం ఉండేలా చూసుకోవాలని తెలిపారు. ఇంటర్మిడియట్ మొదటి సంవత్సరం, రెండవ సంవత్సర అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 24 నుంచి జున్ 3వ తేదీ వరకు నిర్వహిండం జరుగుతుందన్నారు. మొదటి సంవత్సరం పరీక్ష ఉదయం 9నుంచి 12 గంటల వరకు, 2.30 నుంచి 5.30 వరకు రెండు దఫాలుగా పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించేందుకు వికారాబాద్‌లో 5, తాండూర్‌లో4, పరిగిలో 4 పరీక్ష కేంద్రాలను అదే విధంగా నవపేట్, పేద్దముల్, మర్పల్లి , మోమిన్‌పేట్, దోమ, కొండగల్, కుల్కచర్ల మండలాల్లో ఒక్కో పరీక్ష కేంద్రం చొప్పున మొత్తం 20 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఒకేషనల్ కోర్సులలో కలిపి 7831 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు.

పరీక్ష కేంద్రాల్లో మొబైల్స్, వాచ్‌లు, ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించకూడదని ఆయన తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించి పోలిస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌సి సభ్యులు రాజమోహన్‌రావు, బుచ్చయ్య, ప్రిన్సిపల్ నర్సింహారెడ్డి, చెన్నయ్య, సురేశ్వర్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

## గత ప్రభుత్వంలోని విసిలపై విచారణ జరిపించాలి

ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గ్యార నరేష్



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** గత ప్రభుత్వంలో విశ్వవిద్యాలయాల విసిలుగా నియమించినటువంటి వారిపైన ప్రభుత్వం విచారణ జరిపించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గ్యార నరేష్ అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్నటువంటి యూనివర్సిటీలకు బిఆర్ఎస్ ప్రభుత్వం 2021 మే 21న విసిలను నియమించడం జరిగిందని, అందులో అనేక మంది పైన అవినీతి ఆరోపణలు ఉన్నప్పటికీ కూడా తిరిగి వారిని విసిలుగా నియమించారన్నారు. నిన్నటితో వారి పదవి కాలం పూర్తి అయినందున వారిపై విచారణ జరిపించి ఈ మూడు సంవత్సరాల్లో యూనివర్సిటీలో అధికార దుర్వినియోగంతో పాటు విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తూ యూనివర్సిటీ అభివృద్ధికి తోడ్పడకుండా కేవలము ప్రభుత్వం మెప్పు కోసమే వారు పనిచేయడం పై చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ పెద్దల చుట్టూ తిరుగుతూ యూనివర్సిటీల అభివృద్ధికి ఆటంకంగా మారి విద్యార్థులు ఎలాంటి ఉద్యమాలు చేయకుండా ప్రజాస్వామ్య వాతావరణం లేకుండా యూనివర్సిటీలను పూర్తిగా నిర్వీర్యం చేశారన్నారు. స్వయం ప్రతిపత్తి కలిగిన విశ్వవిద్యాలయాల ఉన్నతిని కాలరాసినటువంటి విసిల పైన ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే విచారణ జరిపి అదేవిధంగా ఆర్థిక లావాదేవీల పైన విచారణ చేసి అక్రమాలకు పాల్పడిన వారి పైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. కొత్తగా అపాయింట్ చేసే విసిలను పైరవలకు తావులేకుండా యూనివర్సిటీలపై మంచి పట్టు ఉండి అడ్మినిస్ట్రేషన్ నడిపించే వ్యక్తులను ఎలాంటిఅవినీతి ఆరోపణలులేనివారిని విసిగా నియమించాలని ప్రభుత్వాన్నికోరుతున్నామని గ్యారనరేష్ వెల్లడించారు.

# క్రీడ

### సన్‌రైజర్స్ హైదరాబాద్ ఓటమి!

## ఫైనల్‌కు కోల్‌కతా



ఐపీఎల్ 2024 సీజన్లో కోల్కతా నైట్రైడర్స్(కేకేఆర్) తమ జోరును కొనసాగి స్తోంది. లీగ్ దశలో పూర్తి ఆధిపత్యం చెలాయించి టేబుల్ టాపర్గా నిలిచిన కేకే ఆర్.. అదే జోరులో క్వాలిఫయర్1లో సన్రైజర్స్ హైదరాబాద్ను చిత్తు చేసి దర్జాగా ఫైనల్ చేరింది. మంగళవారం అహ్మదాబాద్ వేదికగా జరిగిన ఈ కీలక పోరులో సమష్టిగా చెలరేగిన కేకేఆర్.. 8 వికెట్ల తేడాతో సన్రైజర్స్ను ఓడించింది. ఈ మ్యాచ్లో ముందుగా బ్యాటింగ్ చేసిన సన్రైజర్స్ హైదరాబాద్ 19.3 ఓవర్లలో 159 పరుగులకు కుప్పకూలింది. రాహుల్ త్రిపాఠి(35 బంతుల్లో 7 ఫోర్లు, సిక్స్తో 55) హాఫ్ సెంచరీతో రాణించగా.. హెన్రీచ్ క్లాసెన్(21 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్తో 32), ప్యాట్ కమిన్స్(24 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సతో 30) కీలక ఇన్నింగ్స్ ఆడారు.

**నిప్పులు చెరిగిన స్టార్క్..**

కేకేఆర్ బౌలర్లలో మిచెల్ స్టార్క్(3/34) మూడు వికెట్లు తీయగా.. వరుణ్ చక్ర వర్తి(2/26) రెండు వికెట్లు పడగొట్టాడు. వైభవ్ అరోరా, హర్షిత్ రాణా, సునీల్ నరైన్, ఆండ్రీ రస్సెల్ తలో వికెట్ తీసారు. అనంతరం లక్ష్యచేధనకు దిగిన కేకేఆర్.. 13.4 ఓవర్లలో 2 వికెట్లకు 164 పరుగులు చేసి సునాయస విజయాన్నందుకుంది. వెంకటేశ్ అయ్యర్(28 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్సతో 51 నాటౌట్), శ్రేయస్ అయ్యర్(24 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్సతో 58 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీలతో సత్తా చాటారు. సన్రైజర్స్ బౌలర్లలో నట రాజన్, కమిన్స్ తలో వికెట్ తీసారు. ఈ ఓటమితో తృటిలో ఫైనల్ చేరే అవకా శాన్ని చేజార్చుకున్న సన్రైజర్స్ హైదరాబాద్.. శుక్రవారం చెన్నై జరిగే క్వాలిఫ యర్2లో మరోసారి తమ అదృష్టాన్ని పరీక్షించుకోనుంది.

**దూకుడైన ఆరంభం..**

160 పరుగుల సాధారణ లక్ష్య చేధనకు దిగిన కేకేఆర్కు శుభారంభం దక్కింది. ఓపెనర్లు రెహ్మానుల్లా గుర్బాజ్(23), సునీల్ నరైన్(21) దూకుడుగా ఆడారు. దాంతో ఆ జట్టు 3 ఓవర్లలోనే 40 పరుగులు చేసింది. దూకుడుగా ఆడుతున్న రెహ్మానుల్లా గుర్బాజ్ను నటరాజన్ క్యాచ్ ఔట్గా పెవిలియన్ చేర్చాడు. ఆ కొద్ది సేపటికే సునీల్ నరైన్ను కమిన్స్ ఔట్ చేశాడు. ఈ ఇద్దరి క్యాచ్లను విజయ్కాంత్ వియాస్కాంత్ అందుకోవడం గమనార్హం. ఈ పరిస్థితు ల్లోక్రీజులోకి వచ్చిన వెంకటేశ్ అయ్యర్, శ్రేయస్ అయ్యర్ ఆచితూచి ఆడుతూ ఇన్నింగ్స్ను ముందుకు నడిపించారు. వీలు చిక్కిన బంతిని బౌండరీకి తరలిం చారు.

**అయ్యర్స్ విధ్వంసం..**

విజయ్కాంత్ బౌలింగ్లో 10 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద శ్రేయస్ అయ్యర్ ఇచ్చిన క్యాచ్ను వికెట్ కీపర్ హెన్రీచ్ క్లాసెన్ నేలపాలు చేశాడు. క్యాచ్ అందు కున్నప్పటికీ సహచర ఫీల్డర్ రాహుల్ త్రిపాఠి అతన్ని ఢీకొట్టడంతో బంతి నేల పాలు అయ్యింది. నటరాజన్ వేసిన ఆ మరుసటి ఓవర్లో శ్రేయస్ అయ్యర్ ఇచ్చిన సునాయస క్యాచ్ను పాయింట్లో ట్రావిస్ హెడ్ నేలపాలు చేశాడు. ఈ రెండు అవకాశాలతో చెలరేగిన అతను భారీ సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. 28 బంతుల్లో వెంకటేశ్ అయ్యర్ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకోగా.. ట్రావిస్ హెడ్ బౌలింగ్లో అయ్యర్ వరుసగా 6, 4, 6, 6 బాది హాఫ్ సెంచరీ పూర్తి చేసుకోవ డంతో పాటు విజయలాంఛనాన్ని పూర్తి చేశాడు.

# రీల్

## మహేష్‌బాబు, రాజమౌళి ప్రాజెక్ట్‌పై సుధీర్ కామెంట్స్



ప్రస్తుతం మన ఇండియన్ సినిమా నుంచి రానున్న బిగ్గెస్ట్ ప్రాజెక్ట్ లలో పాన్ వరల్ ఆడియెన్స్ కూడా ఆసక్తిగా ఎదురు చూస్తున్న భారీ చిత్రం క్రేజీ కాంబినే షన్ సూపర్ స్టార్ మహేష్ అలాగే దర్శక దిగ్గజం ఎస్ ఎస్ రాజమౌళిల కాంబి నేషన్ ఎస్ఎస్ఎంబి 29 అని చెప్పాలి. మరి ఈ భారీ చిత్రం ఎప్పుడెప్పుడు మొదలవుతుందా అని అంతా ఆసక్తిగా ఎదురు చూస్తుండగా ఈ చిత్రంపై టాలీవుడ్ హీరో నైట్రో స్టార్, మహేష్ కుటుంబీకుడు సుధీర్ బాబు చేసిన ఇంట్రెస్టింగ్ కామెంట్స్ వైరల్ గా మారాయి. రాజమౌళి, మహేష్ ల కాంబో పర్ఫెక్ట్ టైం లో పడింది అని, ఇద్దరూ మంచి పీక్ లో ఉన్న సమయం ఇది. ఇదే కాంబినేషన్ ఒక ఐదారేళ్ల కితం వచ్చుంటే ఇంకోలా ఉండేది ఏమో అని తెలి పాడు. అలాగే ఈ చిత్రం కోసం కొన్ని సార్లు మాత్రమే డిస్కషన్ మాలో వచ్చింది అని మహేష్ ఈ సినిమా కోసం మూడేళ్లు కేటాయిస్తున్నట్టుగా ప్లానింగ్స్ లో ఉన్నారని, సీక్వెల్ ఉందా లేదా అనేది మాత్రం నాకు తెలీదని సుధీర్ బాబు తన సైడ్ నుంచి ఈ క్రేజీ కాంబినేషన్ సంబంధించిన అప్డేట్ అందించాడు. ఇక సుధీర్ బాబు హీరోగా నటించిన చిత్రం హరోం హర ఈ జూన్ లో రిలీజ్ కి రాబోతుంది.

## ‘పుష్ప-2’ నుండి రెండవ సింగిల్ అనౌన్స్‌మెంట్



పాన్ ఇండియా స్టార్ హీరో అల్లు అర్జున్ ప్రధాన పాత్రలో, డైరెక్టర్ సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కు తున్న యాక్షన్ ఎంటర్టైనర్ పుష్ప 2 ది రూల్. రష్మిక మందన్న హీరో యిన్ గా నటిస్తున్న ఈ చిత్రం ను ఆగస్ట్ 15, 2024 న వరల్ వైడ్ గా థియేటర్ల లో రిలీజ్ చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రం నుండి రిలీజైన ప్రచార చిత్రా లకి, టీజర్ కి, ఫస్ట్ సింగిల్ కి ప్రేక్ష కుల నుండి, అభిమానుల నుండి సూపర్ రెస్పాన్స్ వచ్చింది. సెకండ్ సింగిల్ పై ఇప్పుడు అందరిలో ఆసక్తి నెలకొంది. రెండవ సింగిల్ మెలోడీ గా ఉంటుందని మేము ఇప్పటికే నివేదించాము. ఐకాన్ స్టార్ అభిమానులు ఈ వారం రెండవ సింగిల్ ప్రకటనను ఆశించవచ్చు. నటుడి వ్యక్తిగత బృందం ఇదే విష యాన్ని ధృవీకరించింది. మే చివరి వారంలో లేదా జూన్ మొదటి వారంలో ఈ పాటను విడుదల చేసే అవకాశం ఉంది. పుష్ప ది రైజ్లోని శ్రీవల్లి పాట ఎంతోమందిని అలరించింది. పుష్ప 2 సెకండ్ సింగిల్ కూడా ఇదే రేంజ్ లో ఉండేలా మేకర్స్ ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది.

## 5 దేశాల్లో ‘దేవర’ ఫియర్ సాంగ్ ట్రెండ్




యంగ్ టైగర్ ఎన్టీఆర్ ప్రధాన పాత్రలో, స్టార్ డైరెక్టర్ కొరటాల శివ దర్శకత్వం లో తెరకెక్కుతున్న యాక్షన్ ఎంటర్టై నర్ దేవర (ౖevara). బాలీ వుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ హీరోయిన్ గా నటిస్తున్న ఈ చిత్రం ను అక్టోబర్ 10, 2024 న వరల్ వైడ్ గా థియేటర్ల లో రిలీజ్ చేసేందుకు మేకర్స్ సన్నా హాలు చేస్తున్నారు. ఈ క్రేజీ కాంబినేషన్ పై ప్రేక్షకుల్లో, అభి మానుల్లో భారీ అంచనాలు నెల కొన్నాయి. ఈ చిత్రం నుండి ఫస్ట్ సింగిల్ అయిన ఫియర్ సాంగ్ ను మేకర్స్ ఎన్టీఆర్ పుట్టిన రోజు సందర్భంగా రిలీజ్ చేయగా, సూపర్ రెస్పాన్స్ వస్తోంది. ఈ పాట ఐదు దేశాల్లో ట్రెండ్ లో నిలి చింది. ఈ చిత్రం లో బాలీవుడ్ యాక్టర్ సైఫ్ ఆలీఖాన్ విలన్ పాత్రలో నటి స్తుండగా, రాక్ స్టార్ అనిరుద్ రవి చందర్ ఈ చిత్రంకి సంగీతం అందిస్తు న్నారు. జనతా గ్యారేజ్ చిత్రం తర్వాత మళ్ళీ వీరి కాంబినేషన్ లో వస్తున్న చిత్రం కావడం తో ప్రేక్షకుల్లో, అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

## టీమిండియా హెడ్ కోచ్ రేసులో గంభీర్‌కు పోటీగా దిగ్గజ స్పిన్నర్



టీమిండియా హెడ్ కోచ్ పదవి బాధ్యతలు చేప ట్టేందుకు సుముఖంగా ఉన్నట్లు మాజీ క్రికెటర్, దిగ్గజ స్పిన్నర్ హర్భజన్ సింగ్ తెలిపాడు. ఆ అవకాశం లభిస్తే సంతోషంగా స్వీకరిస్తానని చెప్పాడు. టీమిండియా హెడ్ కోచ్ పదవి ద్వారా తనకు ఎంతో ఇచ్చిన క్రికెట్కు, ఎంతో కొంత తిరిగి ఇచ్చే అవకాశం లభిస్తుంద న్నాడు. ఇటీవలే భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) టీమిండియా పురుషుల జట్టు హెడ్ కోచ్ పదవికి దరఖాస్తులు ఆహ్వానిం చిన విషయం తెలిసిందే.ఆసక్తి కలిగినవారు మే 27, సాయంత్ర 6 గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలని బీసీసీఐ తమ ప్రకటనలో పేర్కొంది. ఈ క్రమంలో భజ్జీ టీమిండియా హెడ్ కోచ్ పదవిపై తనకు ఉన్న ఆసక్తిని వెల్ల డించడం చర్చనీయాంశమైంది. హర్భజన్ సింగ్ కూడా టీమిండియా హెడ్ కోచ్ పదవి రేసులో నిలుస్తాడా? అనే చర్చ జరుగుతుంది. ప్రస్తుతం టీమిండియా హెడ్ కోచ్గా ఉన్న రాహుల్ ద్రవిడ్ పదవీకాలం 2024 టీ20 ప్రపంచకప్తో ముగియ నుంది. అంటే జూన్ చివరి నాటికి ద్రావిడ్ కోచ్గా వైదొలుగుతారు. అందుకే కొత్త కోచ్ కోసం బీసీ సీఐ తాజాగా దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. కాగా, కొత్త కోచ్ పదవీ కాలం ఈ ఏడాది జులై 1 నుండి ప్రారంభమై 2027 డిసెంబర్ 31తో ముగు స్తుందని బీసీసీఐ తన ప్రకటనలో పేర్కొంది. అంటే టీమిండియాకు కొత్తగా కోచ్ పదవికి ఎంపికయిన వ్యక్తి 2027 వన్డే ప్రపంచకప్ వరకు భారత జట్టుకు ప్రధాన కోచ్గా కొనసాగనున్నాడు. ఇప్ప టికే ఈ పదవి కోసం గౌతమ్ గంభీర్ను బీసీసీఐ అప్రోచ్ అయినట్లు వార్తలు వస్తు న్నాయి. ఈ క్రమంలోనే ఓ వార్త సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో హర్భజన్ సింగ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ’ టీమిం డియా హెడ్ కోచ్ పదవికి నేను దరఖాస్తు చేస్తానో లేదో నాకు తెలియదు. కానీ, టీమిండియాకు కోచింగ్ అనేది మెంటా ర్లాంటిదే. భారత ఆటగాళ్లకు క్రికెట్ గురించి ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వాల్సిన అవసరం లేదు. క్రికెట్ వారికి బాగా తెలుసు. వారికి మెంటార్గా ఉంటే సరిపో తుంది. నాకు క్రికెట్ ఎంతో ఇచ్చింది. కోచ్ రూపంలో ఎంతోకొంత తిరిగి ఇచ్చే అవకాశం వస్తే సంతోషంగా స్వీకరిస్తాను’ అని భజ్జీ చెప్పుకొచ్చాడు. అయితే తాను దరఖాస్తు చేస్తానా? లేదా? అనే విషయాన్ని మాత్రం వెల్లడిం చలేదు. అయితే హర్భజన్ సింగ్కు కోచ్గా పనిచేసిన అనుభవం పెద్దగా లేదు. టీమిండియా హెడ్కోచ్ రేసులో గౌతమ్ గంభీర్తో పాటు స్టీఫెన్ ఫ్లెమింగ్, జస్టిన్ లాంగర్, పాంటింగ్, నెహ్రా, జయవర్దనే ఉన్నట్లు తెలుస్తోంది.

## శంకర్ మార్క్‌లో ‘భారతీయుడు-2’ ఫస్ట్ ప్రోమో బిట్



యూనివర్సల్ హీరో కమల్హాసన్ హీరోగా ఐకానిక్ దర్శకుడు శంకర్ సార థ్యంలో తెరకెక్కిన భారీ పాన్ ఇండియా హిట్ చిత్రం ఇండియన్ తెలుగులో భారతీ యుడు అందుకున్న విజయం కోసం తెలిసిందే. అయితే ఈ సినిమాకి సీక్వెల్ గా భారతీయుడు 2 ఇప్పుడు రాబోతుంది. ఇక ఈ క్రేజీ సీక్వెల్ నుంచి ఆల్రెడీ ప్రమో షన్స్ స్టార్ట్ కాగా మేకర్స్ మొదటి పాటపై అప్డేట్ కూడా అందించారు. ఇక తాజాగా ఫస్ట్ సింగిల్ తాలూకా ప్రోమోని 3 భాషల్లో రిలీజ్ చేయగా మన తెలుగు బిట్ శంకర్ మార్క్లో వినిపిస్తోంది అని చెప్పాలి. ఏ ఆర్ రెహమాన్ మొదటి భాగానికి వర్క్ చేశారు కానీ సీక్వెల్కి అనిరుద్ వర్క్ చేసాడు. అయినా అనిరుధ్ మ్యూజిక్ కూడా శంకర్ రేంజ్లోనే ఉండేలా అనిపిస్తుంది. ప్రోమోలో సాలిడ్ బీట్స్ వినిపిస్తు న్నాయి. ఇక రేపు వచ్చే ఫుల్ సాంగ్ ఎలా ఉంటుందో, అంచనాలు అందుకుం టుందో లేదో చూడాలి. ఇక ఈ సినిమాలో కాజల్, రకుల్ ప్రీత్ సింగ్, సిద్ధార్థ్, వివేక్, బ్రహ్మానందం తదితరులు నటిస్తున్నారు అలాగే లైకా ప్రొడక్షన్స్ వారు నిర్మాణం వహించగా ఈ జూలై 12న సినిమా గ్రాండ్గా పాన్ ఇండియా రిలీజ్ కాబోతోంది.

## ఖైదీ మృతికి పరిహారం చెల్లించాలి

### ఖైదీలకు హక్కులు ఉన్నాయి హైకోర్టు తీర్పు

**హైదరాబాద్:** కోర్టు తీర్పుతో జైలులో శిక్ష అనుభవిస్తున్న ఖైదీల రక్షణ బాధ్యత ఆఫీసర్లదేనని, ఖైదీల ప్రాణాలకు ముప్పు వాటిల్లితే ప్రభుత్వం మృతుడి కుటుంబానికి పరిహారం చెల్లించాలని హైకోర్టు తీర్పు వెలువరిం చింది. రాజ్యాంగంలోని అధికరణ 21 కింద ఖైదీలకు కూడా హక్కులు ఉన్నా యని చెప్పింది. చట్టం పరిధిలో మినహాయింపులు తప్ప రాజ్యాంగ హక్కు లను కాదనేందుకు వీల్లేదని తేల్చి చెప్పింది. అంతేకాకుండా జైలు మాన్యు వల్, ఇతర రూల్స్ కింద ఖైదీల రక్షణ బాధ్యత జైలు అధికారులదేనని జస్టిస్ సీవీ భాస్కర్రెడ్డి ఇటీవల తీర్పు చెప్పారు. అధికారులు తమ బాధ్యత నుంచి తప్పించుకోలేరని చెప్పారు. సంగారెడ్డి కోర్టు తీర్పుతో యావజ్జీవ శిక్ష పడిన కరోళ్ల వెంకయ్య చర్లపల్లి జైలుకు అధికారులు తరలించారు. తోటి ఖైదీ దాడిలో తన భర్త మృతికి పరిహారంగా తనకు రూ 10 లక్షల పరిహారం చెల్లిం చాలని వెంకయ్య భార్య కరోళ్ల జయమ్మ హైకోర్టులో పిటిషన్ వేశారు. వెం కయ్య చర్లపల్లి జైలులో ఉండగా నిజామాబాద్ జిల్లా జైలు నుంచి దాసరి నర సింహులును చర్లపల్లి జైలుకు తరలించారు. జైల్లోని బార్బర్ వద్ద విరిగిపో యిన కత్తెరను నరసింహులు తస్కరించి అక్కడే చెట్ల పొదల్లో దాచాడు. 2012 జులై 4న తెల్లవారుజామున ఆ కత్తెరతో వెంకయ్యతోపాటు మరో ఆరు గురు ఖైదీలపై దాడి చేశారు. దాడిలో వెంకయ్య మరణించిన ఘటనపై కుసా యిగూడ పోలీసు స్టేషన్లో కేసు నమోదు అయ్యింది. మెజిస్టీరియల్ విచారణ జరిపిన కలెక్టర్ 2013 డిసెంబరు 19న నివేదిక ఇచ్చారు. ఆ నివేదిక ఆధా రంగా జాతీయ మానవ హక్కుల కమిషన్ బాధితుడి కుటుంబానికి రూ. లక్ష పరిహారం చెల్లించాలని ఆదేశించింది. ఇందుకు అనుగుణంగా ప్రభుత్వం 2018లో రూ లక్ష జయమ్మకు చెల్లించింది. దీనిపై సంతృప్తి చెందని జయమ్మ దాఖలు చేసిన పిటిషన్ను హైకోర్టు విచారణ జరిపింది జైలు అధికా రుల నిర్లక్ష్యం లేదని ప్రభుత్వం చేసిన వాదనను తిరస్కరించింది. సుపీం కోర్టు, ఏపీ హైకోర్టు, ఇదే హైకోర్టు చెప్పిన తీర్పుల ప్రకారం ఖైదీ రక్షణ బాధ్యత అధికారులదేనని చెప్పింది. వెంకయ్య వయస్సు 55 ఏళ్ళకాగా అతని ఆదాయం వివరాలను ఎక్కడా పేర్కొనలేదని, ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం నైపుణ్యం లేని కార్మికులకు నెలకు 7200 చెల్లించాలన్న నిబంధ ప్రకారం ఏడాదికి రూ 88,400లో మూడో వంతు సొంత ఖర్చులుపోగా మిగిలిన రూ. 57,600లను గత 11 ఏళ్లకు రూ. 6,33,600 చెల్లించాలని. దీనికితోడు అంత్యక్రియల ఖర్చుల కింద మరో రూ 84 వేలు కలిపి రూ.7.20 లక్షలు చెల్లించాలని తీర్పు చెప్పింది ఇప్పటికే చెల్లించిన రూ.లక్షను మినహా యించిన మిగిలిన మొత్తానికి ఆరు శాతం వడ్డీ జమ చేసి ఇవ్వాలంది.

## బిజెపి ప్రచారకులు రాజకీయ టూరిస్టులే

### మూడు వంతుల సీటు పట్నాయక్‌వే : పాండియన్

**పూరీ :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తరపున ఒడిశా రాష్ట్రానికి ఎన్నికల ప్రచారానికి వచ్చేవారంతా కేవలం రాజకీయ టూరిస్టులేననీ, వారు కనీసం రాష్ట్ర రాజధానిని కూడా గుర్తించలేని స్థితిలో ఉన్నారనీ, ఆ రాష్ట్రముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ కుడిభుజంగా పనిచేస్తున్న వి.కె.పాండియన్ (49) అన్నారు. ఇప్పుడు జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఆరోసారి కూడా నవీన్ పట్నాయకే ముఖ్యమంత్రిగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తారని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. పిటిఐ వార్తాసంస్థ వీడియోస్కు సోమవారం రాత్రి ఆయన ఒక ఇంటర్వ్యూ ఇస్తూ, బిజూ జనతాదళ్ పార్టీ ఈసారి ఒడిశాలో మొత్తం సీట్లన్నీ కైవసం చేసుకుంటుందనీ, ఎవ్వరికీ ఒక్కసీటు కూడా దక్కబో దని అన్నారు. రాష్ట్ర అసెంబ్లీలోఉన్న 147 స్థానాలకుగాను నాలుగింట మూడు వంతులు సీట్లు సాధిస్తుందన్నారు. ఆయన ఎప్పుడు ప్రమాణ స్వీకారం చేయాలో సమయం కూడా నిర్దేశించుకున్నారన్నారు. గంజాం జిల్లాలోని హింజిలి, బోలంగిర్ జిల్లాలోని కాంతాబంజి రెండు చోట్ల నుండి నవీన్ పట్నాయక్ పోటీ చేస్తున్నారు. ఈ రెండుచోట్లా సోమవారం పోలింగ్ జరిగింది. మాజీ ఐఎఎస్ అధికారి వి.కె.పాండియన్ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్కు అనేక సంవత్సరాలుగా విశ్వసనీయుడుగా ఉన్నారు. ఇప్పుడు ఆయన ఎన్నికల్లో స్టార్ క్యాంపైనర్గా మారారు. తమ నాయకుడు భారీ మెజారిటీతో గెలుస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల్లో విజయం తర్వాత జూన్ 9వ తేదీన ఉదయం 11.30 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట లోపు గౌరవనీయులైన ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం చేస్తా రని పాండియన్ చెప్పారు.

# ఎసిపి నివాసంలో ఎసిబి సోదాలు

### 17 గంటలకుపైగా కొనసాగుతున్న వైనం
### బయటపడిన నోట్లకట్టలు, ఆభరణాలు, భూ పత్రాలు
### ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయనే ఆరోపణలు





**ప్రజాపక్షం/హైదరాబాద్:** సిసిఎస్ ఎసిపి ఉమామహేశ్వ ర్రావు నివాసముంటున్న అశోకనగర్లోని ఇంటిపై మంగళవారం తెల్లవారుజామున అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) అధికారులు ఆకస్మిక దాడి చేశారు. అనంతరం ఆయనను అదుపులోకి తీసుకున్నారు. అక్రమార్కుల ఫిర్యాదుల అందడంతో ఆయన ఇంటితో పాటు బంధు వులు, స్నేహితుల ఇళ్లపై కూడా అర్ధరాత్రి వరకు కూడా సోదాలు కొనసాగుతునే ఉన్నాయి.ఈ సోదాల్లో ఎసిబి అధికారుల దిమ్మెతిరిగే వాస్తవాలు బయటపడుతున్నాయి. నోట్ల కట్టలతో పాటు బంగారు ఆభరణాలు, భూములకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలు, బ్యాంక్ లాకర్లు స్వాధీనం చేసుకున్నారు. తెల్లవారు జా ము నాలుగు గంటలకే ఆశోక్ నగర్ లోని ఎసిపి ఉమామహేశ్వరరావు నివాసానికి అధికారులు చేరుకున్నారు. ఆ స మయంలో మహేశ్వర్రావు ఇంట్లోనే ఉన్నారు. సదాల్లో ఆ యన ఆస్తుల వివరాలు, సర్వీసు రికార్డు, ఆర్థిక లావాదేవీలను పరిశీలిస్తున్నారు. హైదరాబాద్లోని ఎసిపి స్నేహితులు, బంధువుల ఇళ్లకూ వెళ్లిన అధికారులు మొత్తంగా సి టీలో ఆరుచోట్ల సోదాలు చేస్తున్నారు. రాష్ట్రంలోని మరో నాలుగు చోట్ల ఏక కాలంలో రెయిడ్స్ చేపట్టారు. ఏసీపీ ఉ మామహేశ్వర రావు ప్రస్తుతం సాహితీ ఇన్ఫ్రా కేసులను వి చారణ జరుపు తున్నారు. గతంలో ఇబ్రహీంపట్నం ఏసీపీ గా పనిచేసిన ప్పటి నుంచే ఉమామహేశ్వరరావుపై పలు ఆ రోపణలు వినిపిస్తున్నాయి. డబుల్ మర్డర్ నిందితుడు మ ట్టారెడ్డి నుంచి ముడుపులు తీసుకున్నారని ఉమామహేశ్వరరా వుపై అభియోగాలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్లోని అ త ని స్నేహితుల ఇళ్లపై కూడా సోదాలు నిర్వహిస్తున్నారు. అ ర్ధరాత్రి ముగిసే వరకు సోదాల్లో పలు కీలక డాక్యుమెం ట్లతో పాటు రూ.40 లక్షల నగదు, బంగారం, వెండి ఆభ రణాలు, స్థిర, చరాస్తులకు సంబంధించిన డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు.ఇబ్రహీంపట్నం ఎసిపిగా పనిచే సిన సమయంలో అక్రమార్జనతో పాటు భారీగా ఆస్తులు కూ డబెట్టారని ఆయనపై ఆరోపణలు ఉన్నాయి. మరో వైపు ప్రస్తుతం ఆయన పనిచేస్తున్న సిసిఎస్లో పలు కే సుల్లో ముడుపులు తీసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తు న్నాయి. బాధితులకు న్యాయం చేయకుండా నిందితులకు మద్దతు పలుకుతున్నారని పలువురు సోదాలు జరుగుతు న్న అతని నివాసం వద్దకు వచ్చి అధికారులకు మొరపె ట్టుకు న్నారు. సోదాలు ఇంకా కొనసాగుతున్నాయని పూర్తయిన తరువాతనే అన్ని వివరాలు వెల్లడిస్తామని ఎసిబి అధికారులు చెప్పారు.

## మత్స్యకారుల సమస్యలపై కమిటీ

**హైదరాబాద్:** మత్స్యకార వృత్తిలోకి కొన్ని కులాలు చేర్చకపోవడంతో తలెత్తిన వివాదాలను పరిష్కరించేందుకు ఉన్నతాధికారులతో కూడిన నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని హైకోర్టు తెలంగాణ రాష్ట్రానికి ఉత్తర్వులు జారీ చేసింది. మత్స్యకారుల సహకార సంఘాల్లో కొన్ని కులా లకు మాత్రమే చోటు కల్పిస్తున్నారంటూ దాఖలైన వేర్వేరు వ్యాజ్యాలపై జస్టిస్ బి. నగేష్ భీమపాక ఇటీవల తీర్పు చెప్పారు. వివాదాల పరిష్కార కమిటీని 3 మాసాల్లో ఏర్పాటు చేయాలని, మరో మూడు నెలల్లోగా ఆ కమిటీ రిపోర్టు ఇవ్వాలని, ఆ నివేదికపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని తీర్పులో పేర్కొన్నారు. కొన్ని కులాలకు సొసైటీల్లో సభ్యత్వం ఇవ్వడం లేదని పిటిషనర్ల వాదన.. బెస్త బోయి, గూండ్ల తెగలను చేపలు పట్టే వృత్తిలోకి పరిగణనలోకి తీసుకోకపో వడం లేదని చెప్పారు. గంగపుత్ర, గూండ్ల తెగ లను చేపలు పట్టే వృత్తిలోకి పరిగణనలోకి తీసుకో కపోవడంపై నిపుణుల కమిటీని ఏర్పాటు లేదా ఈ వివాదాన్ని బీసీ కమిషన్కు నివేదించాలని కోరారు. బెస్త బోయి, గూండ్ల, గంగపుత్రలతో కూడిన మత్స్యకారుల సహకార సంఘాల్లో సభ్యత్వం ఇవ్వకపోవడాన్ని పిటిషనర్లు సవాలు చేశారు. ఈ వివాదాన్ని నిపుణుల కమిటీ ద్వారా ప్రభుత్వ పరిష్కరించాలని హైకోర్టు తీర్పు వెలువ రించింది.

## సిఎం రేవంత్‌కు ఈటెల బహిరంగ క్షమాపణ చెప్పాలి

### కాంగ్రెస్ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం డిమాండ్



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** సిఎం రేవంత్ రెడ్డికి బిజెపి ఎంపి అభ్యర్థి ఈటెల రాజేందర్ బహిరంగ క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ ఎంఎల్ఎ మేడిపల్లి సత్యం డిమాండ్ చేశారు. ఈటె లతో పాటు బిఆర్ఎస్ మాజీ మంత్రులు కెటిఆర్, హరీష్ రావులు తమ నోటికి ఎంత వస్తే అంత మాట్లాడుతున్నారని, ఈ ముగ్గురు నేతలు మాట్లాడు తున్న భాషను చూసి జనాలు అసహ్యించుకుంటున్నారని అన్నారు. ఈ గ్రాడ్యూవేట్ ఎన్నికల్లో ఓ నాలుగు ఓట్లు కోసం రేవంత్ రెడ్డిని విమ ర్శిస్తారా? అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం గాంధీ భవన్లో మేడిపల్లి సత్యం మీడియా సమావేశంలో మాట్లాడుతూ బిఆర్ ఎస్ పదేళ్లలో రాష్ట్రాన్ని దివాళా తీయించారని మండిపడ్డారు. తమ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన కొద్ది రోజుల్లోనే 30 వేల ఉద్యోగాలు ఇచ్చామన్నారు. నిరు ద్యోగులకు రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తే జనాలు మిమ్మల్ని ఎందుకు ఓడి స్తారో ఓ సారి ఆత్మావలోక్నం చేసుకోవాలన్నారు. హుజూరాబాద్లో ఓటమిపా లైన ఈటెల రాజేందర్..ఇప్పుడూ మల్కాజ్గిరిలో ఓడిపోతున్నానని తెలిసి కాంగ్రెస్పైనా, ప్రభుత్వంపైనా అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని, ఈటెల రాజేం దర్ అఫ్జల్ గాదు అని తీవ్రంగా విమర్శించారు. తమ పార్టీని విమర్శించడం కాదు..మేము ఎవరి దగ్గరైన పైసలు తీసుకున్నామని నిరూపిస్తే దేనికైనా మేము సిద్ధం..మీరూ రెడీనా అని ఆయన సవాల్ విసిరారు.

## మీకు బెయిలు ఎందుకివ్వాలో మమ్మల్ని ఒప్పించండి

### సోరెన్‌కు చెప్పిన సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ :** ‘‘మీకు తాత్కాలిక బెయిలు మంజూరు చేసే విషయంపై ముందుగా మీరు మమ్మల్ని ఒప్పించండి, మీ వాదనతో సంతృప్తి కలిగించండి’’ అని సుప్రీంకోర్టు జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ను కోరింది. నిందారోపణలు చేసి కేసు పెట్టిన ఎన్ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ను కిందికోర్టు పరిగణనలోకి తీసుకుని అరెసుకు అనుమతించిన తర్వాత ఆ అరెస్టు వెనుక ఉన్న చట్టబద్ధతను ప్రశ్నిస్తూ దాఖలు చేసిన రిట్ పిటిషన్ను తాము (సుప్రీం కోర్టు) పరిశీలించవచ్చునా? లేదా? అని ధర్మా సనం మంగళవారంనాడు సోరెన్ తరపు న్యాయ వాదిని ప్రశ్నించింది. జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మలతో కూడిన ధర్మాసనం ఈ కేసు విచారణను బుధవారానికి వాయిదా వేసింది. ఎన్నిక ప్రచారం నిమిత్తం తాత్కాలిక బెయిలు ఎందుకు ఇవ్వాలి అనే విషయంపై ముందుగా తమను సంతృప్తిపరచేవిధంగా ఒప్పించాలని ధర్మాసనం సోరెన్ను కోరింది. ఐతే కోర్టు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పేందుకు సోరెన్ తరపు న్యాయవాదులు కపిల్ సిబల్, అరునబ్ చౌధరిలు తమకు ఒక రోజు గడువు కావాలని అడిగారు. అరవింద్ కేజ్రీవాల్కు ఇచ్చినవిధంగానే తనకూ తాత్కాలిక బెయిలు మంజూరు చేయాలని సోరెన్ సుప్రీంకో ర్టును కోరారు. ఐతే ఈ కేసులో ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ తరపున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజు ధర్మాసనం ఎదుట మాట్లా డుతూ, తాత్కాలిక బెయిలు మంజూరు చేయ డంలో కేజ్రీవాల్ కేసుకు, హేమంత్ సోరెన్ కేసుకు చాలా తేడా ఉందని చెప్పారు. సోరెన్కు తాత్కాలిక బెయిలును ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ పూర్తిగా వ్యతిరేకించిందని చెప్పారు. ఐతే ఇ డి తన అఫిడవిట్లో, హేమంత్ సోరెన్ బాహ్య ప్రపంచలో ఉంటే తన అధికారాన్ని పూర్తిగా దుర్వినియోగం చేసి సాక్ష్యులను ప్రభావితం చేసే చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపిం చింది. ప్రభుత్వ రికార్డులను తారు మారు చేసి తనకకు అనుకూలంగా మలచుకోవడం ద్వారా సోరెన్ భారీమొత్తంలో నిధులు సమకూర్చుకుని నేరానికి పాల్పడ్డారని,డమ్మీ కొనుగోలుదారు లను, విక్రేతనూ రికార్డుల్లో చూపించారని ఇడి ఆరోపించింది. 8.86 ఎకరాల భూమిని రాంచీలో సోరెన్ అక్రమంగా సేకరించారని పేర్కొంటూ సోరెన్పై ఇడి దర్యాప్తు చేసింది. సోరెన్ ప్రస్తుతం రాంచీలోని బిర్సా ముండా సెంట్రల్ జైలులో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. అక్రమ సంపాదనను తప్పుడు మార్గాల్లో తరలించిన కేసులో సాక్ష్యాలను, దర్యాప్తు ప్రక్రియను కుప్పకూల్చివేసేందుకు ప్రభుత్వ యంత్రాగాన్ని దుర్వినియోగం చేస్తూ ఆయన చాలా క్రియాశీల పాత్ర నిర్వహిస్తున్నా రని ఆరోపించింది. అందువల్ల ఎన్నికల ప్రచా రంలో పాల్గొనేందుకు తాత్కాలిక బెయిలు మంజూరుకు ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ వ్యతిరే కించిందని తన అఫిడవిట్లో పేర్కొంది. ఈ ఏడాది జనవరి 31వ తేదీన జరిగిన హేమంత్ సోరెన్ అరెస్టును జార్ఖండ్ హైకోర్టు సమర్థిం చింది. అదేవిధంగా మే 13వ న ట్రయల్ కోర్టు ఆయన రెగ్యులర్ బెయిలు దరఖాస్తును తిరస్క రించింది. దాంతో అదే రోజున సోరెన్ సుప్రీంకో ర్టును ఆశ్రయించారు. కేజ్రీవాల్కు బెయిలు ఇచ్చినవిధంగానే తనకూ ఇవ్వాలని కోరారు. జెఎంఎం తరపు న్యాయవాది ప్రగ్యా బాఘెల్ ద్వారా ఈ విజ్ఞప్తిని కోర్టుకు ఇచ్చారు.